# ।।ం।। శివఛత్రపతి ।।ం।।

## నాలుగవ తరగతి

పరిసరాల అధ్యయనం

(రెండవ భాగం)



# భారత సంవిధానము

## పార్ట్ – IV A

## ప్రాథమిక బాధ్యతలు

**51 ఎ) ప్రాథమిక బాధ్యతలు**

**ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.**

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణాత్రత.

హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

విద్యా విభాగపు మంజూరు క్రమసంఖ్యః
ప్రా.శి.సం/2014-15/2102/మంజూరి/ D-505/755 తేదిః04-02-2014

# శివఛత్రపతి

## పరిసరాల అధ్యయనం (రెండవ భాగం)

## నాలుగవ తరగతి

మహారాష్ట్ర రాష్ట్ర పాఠపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె

LQ89H7

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA APP నుపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు ప్రతి పాఠంలోని QR CODE ను స్కాన్ చేసిన ఆ పాఠానికి సంబంధించిన అధ్యయన-అధ్యాపనలకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

ప్రథమ ముద్రణః 2014
పరిష్కృత ముద్రణః సెప్టెంబర్ 2016
పునర్ముద్రణ : సెప్టెంబర్ 2021

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె – 411004

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. ఈ సంస్థ సంచాలకుల లిఖిత పూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏ భాగమును గానీ ఉటంకించుట లేదా పునర్ముద్రించుట చేయరాదు.

**చరిత్ర విషయ సమితి :**
డా. ఆ.హ.సాళుంఖే, అధ్యక్షుడు.
డా. సోమ్‌నాథ్‌రోడే, సభ్యుడు
డా. నీరజ్‌సాళుంఖే, సభ్యుడు
శ్రీ. బాపూసాహెబ్‌శిండే, సభ్యుడు
శ్రీ. మొగల్‌జాధవ్, సభ్య–కార్యదర్శి

**సంయోజకులు :**
శ్రీ. మొగల్‌జాధవ్
విశేషాధికారి, చరిత్ర – పౌరశాస్త్రం

**అలంకరణ, చిత్రాలు :**
ప్రా. దిలీప్ కదమ్,
శ్రీ దేవదత్త బలక్ వడె, శ్రీ. సంజాయ్ శేలార్

**ఛాయా చిత్రాలు :**
శ్రీ. ప్రవీణ్ భోస్లే

**మానచిత్రపటం :**
శ్రీ. రవికిరణ్ జాధవ్
డా. నీరజ్ సాళుంఖే

**అనువాదం :** శ్రీ యం. రామకృష్ణ
**సమీక్షకులు :** శ్రీ భూమనపల్లి విజయభాస్కర్ రెడ్డి
**అనువాద సంయోజకులు :** డా॥ శ్రీమతి. తులసీ భారత్
విశేషాధికారిణి–తెలుగు

**నిర్మితి :**
శ్రీ. సచ్చితానంద ఆఫలే – ముఖ్యనిర్మితి అధికారి
శ్రీ. ప్రభాకర్ పరబ్ – నిర్మితి అధికారి
శ్రీ. శశాంక్ కణిక్‌దళే – నిర్మితి సహాయకులు

**అక్షర కూర్పు :** సృష్టి, ఖార్‌ఘర్, నవిముంబయి.

**కాగితం :** 70 జి.ఎస్.ఎమ్., క్రీమ్‌వోవ్.

**ముద్రణాదేశము :**

**ముద్రణ :**

**ప్రకాశకులు :**
శ్రీ. వివేక్ ఉత్తమ్ గోసావి, నియంత్రకులు,
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, ప్రభాదేవి, ముంబయి–25

## ప్రస్తావన

బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం – 2009 మరియు జాతీయ విద్యా ప్రణాళికా చట్రం – 2005 అనుసరించి మహారాష్ట్ర రాష్ట్రంలో ప్రాథమిక విద్యా పాఠ్య ప్రణాళిక – 2012 ను తయారు చేయడం జరిగింది. ఈ పాఠ్య ప్రణాళిక 2013–2014 విద్యా సంవత్సరం నుండి క్రమంగా అమలు చేయబడినది. ఈ పాఠ్య ప్రణాళికలో మూడవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు సామాన్యశాస్త్రం, పౌరశాస్త్రం మరియు భూగోళం విషయాలు సంయుక్తముగా పరిసర అభ్యాసం 1వ భాగంలో పొందుపరచబడతాయి. చరిత్ర విషయం పరిసర అభ్యాసం 2వ భాగంలో స్వతంత్రంగా ఉంటుందని నమోదు చేయబడినది.

ప్రభుత్వామోదిత విద్యా పాఠ్య ప్రణాళికానుసారం ప్రస్తుత నాలుగవ తరగతి పాఠ్య పుస్తకాన్ని పాఠ్యపుస్తక సంస్థ తయారు చేసింది. అధ్యయన – అధ్యాపన ప్రక్రియ బాలల కేంద్రితంగా వుండి స్వయం అధ్యయనానికి ప్రాముఖ్యత నివ్వాలి, ప్రాథమిక విద్య పూర్తి అయ్యేసరికి విద్యార్థులు 'పొందవలసిన సామర్థ్యాలను' పొందాలి, అధ్యయన – అధ్యాపన ప్రక్రియ ఆనందదాయకంగా వుండాలి అనే విస్తృత దృష్టితో ఈ పుస్తకం తయారు చేయబడింది.

ప్రస్తుత పాఠ్య పుస్తకంలో ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క స్ఫూర్తిదాయకమైన చరిత్ర సులభమును, ప్రేరణాయుక్తమైన శైలిలో కథా రూపంలో విద్యార్థుల ముందుంచుటకు ప్రయత్నించడమైనది. శివాజీ మహారాజు యొక్క చరిత్ర, కార్యకలాపములు సంపూర్ణ మహారాష్ట్రమునకు మరియు దేశానికి ఒక ప్రేరణగా భావింబడుచున్నది. పాఠ్యపుస్తకంలో శివాజీ మహారాజు యొక్క వ్యక్తిత్వం నందలి వివిధ స్ఫూర్తిదాయక సంఘటనలు ఇవ్వబడినవి. ఈ పాఠ్యపుస్తక నిర్మితి సందర్భంగా వివిధ సంస్థల నుండి, వ్యక్తిగతంగా వచ్చిన ఫిర్యాదులు, సూచనలను తగిన పద్ధతిలో పరిశీలించి ప్రస్తుత పాఠ్య పుస్తకాన్ని సమితి వారు పునఃరచన చేశారు. అదేవిధంగా అవసరమగు చోట్ల కొన్ని సందర్భోచిత సవరణలు చేయడం జరిగింది.

ఈ పాఠ్యపుస్తకం దోషరహితంగా, ప్రామాణికంగా ఉండుటకై మహారాష్ట్రలోని విద్యానిపుణులు, విషయ నిపుణుల చేత సమీక్షింపబడింది. వారి సూచనలు, అభిప్రాయాలను శ్రద్ధగా పరిశీలించి ఈ పుస్తకానికి అంతిమ రూపం ఇవ్వబడింది. చరిత్ర విషయసమితి, చిత్రకారులు, ఛాయాచిత్రకారులు ఎంతో శ్రమకోర్చి ఈ పుస్తకాన్ని తయారుచేశారు. వారందరికి పాఠ్యపుస్తక సంస్థ తరపున మనఃపూర్వక కృతజ్ఞతలు.

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ పుస్తకాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాము.

(చం.రా. బోర్కర్)
**సంచాలకులు**
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె.

**స్థలం : పుణె**
**తేది : 19-02-2014**

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ** నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు
సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,
అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు; మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,
పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**
**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**
**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## 4వ తరగతి - పరిసరాల అధ్యయనం

| అధ్యయన - ఆధ్యాపన ప్రక్రియ | అధ్యయన ఫలితాలు |
|---|---|
| **అధ్యయనార్థికి (జతగా / సమూహంలో / వ్యక్తిగతంగా) అధ్యయన అవకాశం కల్పించి, వారిని తర్వాతి అంశాలకై ప్రేరేపించుట.**<br>• కుటుంబంలోని పెద్దవారితో చర్చించుట, ప్రశ్నలు విచారించుట. ఉదా. కుటుంబంలో కొంతమంది ఉమ్మడిగా ఉంటారు, చర్చిస్తారు, మరికొందరు దూరంగా ఉంటారు. దీనినర్థంచేసుకొనుట, దూరంగా ఉండే బంధువులు, స్నేహితులతో సంభాషించి వారి ఇళ్ళు, రవాణా సాధనాలు మరియు అచటి ప్రజల జీవన విధానం గూర్చి తెలుసుకొనుట.<br>• భయపడకుండా లేదా సంకోచించకుండా అనుభవాలపై ప్రశ్నలు తయారు చేసి, ధ్యానం చేయుట.<br>• తల్లి-తండ్రి/పాలకులు/నానమ్మ-తాత, పెద్దవారైన పొరుగు వారితో చర్చించి వారి జీవితంలో గత కాలంలో మరియు ప్రస్తుత కాలంలో రోజు ఉపయోగించే వస్తువులు ఉదా. దుస్తులు, వంట పాత్రలు, పనుల రూపం, ఆటలు వీటిని పోల్చడం, విశేష అవసరాలు గల బాలల సమావేశం.<br>• ఛత్రపతి శివాజీ మహారాజుగారి చరిత్రను అభ్యసించడం.<br>• జట్టు చర్చల ద్వారా ధైర్యం, పరిశ్రమ, సంకట పరిస్థితులలో సంధర్భోచిత ఆలోచనల సాయంతో సమస్యలను ఎలా పరిష్కరించుకొనవచ్చో తెలిసికొనుట.<br>• శివాజీ చరిత్రలో ఉదాహరణాల నుండి పర్యావరణ రక్షణ, నీటి (జల) సాక్షరత, సమత, న్యాయం మొదలగు వాటికి సంబంధించిన జాగృతిని అభివృద్ధి పరచుకొనుట.<br>• ఇంట్లో/పాఠశాలలో/సమాజంలో నిర్వహింపబడే వివిధ సాంస్కృతిక/జాతీయ/ పర్యావరణ యొక్క, ఉత్సవం/వివిధ ప్రసంగాలలో పాల్గొనడం ఉదా. ఉదయం పూట లేదా ప్రత్యేక సభ / ప్రదర్శన / దీపావళి / ఓనం / వసుంధర దినం / ఈద్ మొదలైనవి అలాగే శుభకార్యాలలో, నృత్యం, నాట్యం, అభినయం, సృజనశీల రచనలు చేయడం, (ఉదా. దీపములు / రంగోళీ / గాలిపటం తయారీ, భవన నమూనాలు, నదులపైనున్న వంతెనల నమూనాలు మొ.నవి. కథలు, కవితలు, నినాదాలు, సంఘటనల వృతాంతాలు, సృజనశీల రచనలు లేదా ఏదేని సృజనశీల కృత్యాన్ని ప్రదర్శించుట.<br>• పాఠ్యపుస్తకంతోబాటు ఇతర సాధనములను చదువుట / వెదకుట ఉదా. దినపత్రికలలోని కటింగ్స్, శ్రావ్య సాధనాలు / కథలు / కవితలు / చిత్రాలు / వీడియోలు / స్పర్శతో తెలియునట్టి ఉన్నత సాహిత్యం, అంతర్జాలం / గ్రంథాలయం లాంటి ఏవేని ఇతర తత్సమ సాధనాలు.<br>• సంప్రదాయ మరియు అధునిక దుస్తులలోని భేదాలను గ్రహించడం.<br>• రాష్ట్రంలోని భాష, మాట్లడేభాష, పండుగలు, ఉత్సవాలను గూర్చి సమాచారాన్ని సేకరించడం. | **అధ్యయనార్థి -**<br>04.95B.01 విస్తారిత కుటుంబంలోని సభ్యులలో ఒకరినొకరికి గల బంధుత్వమును గుర్తిస్తారు / తెలుసుకొంటారు.<br>04.95B.02 కుటుంబం / పాఠశాల / పొరుగు ఈ చోట్ల పరిశీలించిన / తెలుసుకొన్న సమస్యలపై సొంత అభిప్రాయాలను వెల్లడిస్తారు.<br>04.95B.03 సమూహంలో ఒక్కటిగా పనిచేస్తున్నపుడు ఒకరిపట్ల ఒకరికి అప్యాయత, సమానత్వం మరియు నేతృత్వ గుణాలలో ముందుండడం, చురుకుగా పాల్గొనడం. ఉదా. అంతర్గత (Indoor) / బాహ్య (Outdoor) / స్థానిక / సమకాలీన ఉపక్రమాల గురించి ఆటలను గూర్చి అలాగే మొక్కలపట్ల శ్రద్ధ తీసుకోవడం, పశుపక్ష్యాదులకు ఆహారాన్ని అందించడం / చుట్టున్న వస్తువులు / పెద్దవారు / దివ్యాంగుల కోసం ప్రకల్పన తయారీ / పాత్రను పోషించుట.<br>04.95B.04 ఛత్రపతి శివాజీ మహారాజుగారి వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకమైన ఘటనలను గూర్చి చెబుతారు.<br>04.95B.05 చాతుర్యం, ధైర్యం మరియు వివేకం, వీటి వలన సంకటాలను ఎదుర్కొనవచ్చునని శివాజీ చరిత్ర నుంచి గ్రహిస్తారు.<br>04.95B.06 భౌగోళిక, సాంస్కృతిక కారణాల వల్ల దుస్తులలోని వైవిధ్యతనం చెబుతారు. |

# విషయ సూచిక


| క్ర.స. | పాఠం | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | శివాజీ జననానికి పూర్వం – మహారాష్ట్ర | 1 |
| 2. | భక్తుల కార్యకలాపాలు | 3 |
| 3. | మరాఠా సర్దారులు – సమర్థవంతమైన భోస్లేవంశం | 8 |
| 4. | శివాజీ బాల్యం | 12 |
| 5. | శివాజీ విద్యాభ్యాసం | 17 |
| 6. | స్వరాజ్య స్థాపనకై శపథం | 21 |
| 7. | స్వరాజ్యమునకు శంకుస్థాపన | 25 |
| 8 . | అంతర్గత శత్రువుల అణచివేత | 29 |
| 9. | ప్రతాప్‌గడ్ విజయం | 32 |
| 10. | పట్టుదలతో చేసిన ఘోడ్‌ఖిండ్ యుద్ధం | 37 |
| 11. | శాయిస్తాఖాన్ పరాభవం | 42 |
| 12. | పురందర్‌ముట్టడి మరియు సంధి | 45 |
| 13. | మొఘలు చక్రవర్తిపై ఎత్తుగడ | 50 |
| 14. | కోటదొరికింది, కానీ సింహం పోయింది | 53 |
| 15. | ఒక మరపురాని మహోత్సవం | 57 |
| 16. | దక్షిణ దేశ దండయాత్ర | 60 |
| 17. | పర్వతదుర్గాల మరియు నౌకాదళ వ్యవస్థాపన | 65 |
| 18. | ప్రజాసంక్షేమ స్వరాజ్య నిర్వహణ | 70 |

శివాజీ మహారాజు కేవలం మహారాష్ట్రమునకే కాకుండ యావత్తు భారతదేశానికి చెందినవాడు. ఆయన ప్రాచీన తత్త్వవేత్తల బోధనల ద్వారా స్ఫూర్తిని పొందాడు. ఆయనకు తనకొరకు రాజ్యాన్ని స్థాపించుకొనవలెనెడి కోరికలేదు. రాజ్యపాలనా వ్యవస్థలో నెలకొనియున్న మంచిచెడ్డలను అధ్యయనం చేసి తద్వారా తన స్వయం పరిపాలనా విధానాలను నిర్ధారణ చేసుకొన్నాడు. మహారాజు స్వయంగా హిందూ మతస్థుడైనను, పరమత సహనం కల్గియుండెను. అతడు ఇతర మతస్థుల పుణ్యక్షేత్రాల కొరకు విరాళములు నిచ్చెను. శివాజీ మహారాజు గొప్ప సైన్యాధిపతి. తన సముద్రతీరాలను కాపాడుకొనుటకు డచ్చి, ఆంగ్లేయులను ఎదుర్కొనుటకు నావికాదళం అవసరమని గ్రహించి దానిని నిర్మించాడు. ప్రతాప్‌గడ్ కోట నిర్మాణం అతని యుద్ధశాస్త్ర నిపుణతకు సాక్షి. అనేక సద్గుణాలకు, మానవత్వానికి ముఖ్యంగా దేశప్రేమకు శివాజీ మహారాజు గొప్ప నిదర్శనం.

**– పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ.**



శివాజీ కాలంనాటి చిత్రకారుడు మీర్‌మహ్మద్ చిత్రించిన శివాజీ మహారాజు చిత్రం
(దీని మూలచిత్రం ప్యారిస్‌లోని వస్తుసంగ్రహాలయంలో కలదు.)

# 1. శివాజీ జననానికి పూర్వం - మహారాష్ట్ర

శివాజీ మహారాజు ఒక గొప్ప వ్యక్తిగా ప్రసిద్ధి చెందాడు. ప్రతి సంవత్సరం మనం అతని జయంతిని ఎంతో ఉత్సాహంగా, గౌరవంతో ఘనంగా జరుపుకొంటాం. పిల్లలూ! మీకు కూడా ఆరోజు ఎంతో ఆనందంగా ఉంటుంది కదూ! మహారాజు గురించి మంచి మంచి పాటలు, పోవాడా గీతములను ఆలపిస్తాము. అతని చిత్తరువునకు పూలమాల వేసి 'శివాజీ మహారాజుకు జై' అని మహారాజు పేరు జై కొట్టుతాము. ఇంతకీ ఈ శివాజీ మహారాజు ఎవరు? అతడు చేసిన గొప్ప కార్యమేమిటి ?

శివాజీ మహారాజు మధ్యయుగ కాలము నాటి వాడు. ఆ కాలంలో అంతటా రాచరికపు పాలన అమలులో ఉండేది. చాలా మంది రాజులు ప్రజల సంక్షేమమునకు పాటుపడక తమ సుఖ సంతోషాలలోనే గడిపేవారు. కాని ఆకాలంలో కూడా కొంతమంది రాజులు ప్రజాక్షేమం కొరకు పరిపాలన సాగించారు. ఉత్తరంలోని మొఘలు చక్రవర్తి అక్బర్ దక్షిణంలోని విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయలు ప్రజా సంక్షేమ పరిపాలకులుగా చరిత్రలో ప్రఖ్యాతి గాంచారు. వీరితో పాటు శివాజీ మహారాజు పేరును కూడా గౌరవంగా మనం స్మరించుకుంటాం.

శివాజీ మహారాజు మహారాష్ట్రంలో స్వరాజ్యాన్ని స్థాపించాడు. స్వరాజ్య మనగా స్వీయరాజ్యం అని అర్థం. మహారాజుకు పూర్వం సుమారు నాలుగు వందల సంవత్సరాలు మహారాష్ట్రలో స్వరాజ్యం లేదు. మహారాష్ట్రలోని అత్యధిక భాగాన్ని అహ్మద్‌నగర్ నిజాంషాహ మరియు బీజాపూర్ ఆదిల్‌షాహ అను ఇద్దరు సుల్తానులు పరస్పరం పంచు కున్నారు. వారు ఉదార స్వభావులు కాదు. ప్రజలను వారెప్పుడు హింసించేవారు. వీరి సంకుచిత స్వభావం వల్ల ప్రజలు హింసించబడ్డారు. వారు ఒకరికొకరు బద్ధ శత్రువులు. వారి ఎడతెగని పోరాటం వల్ల ప్రజలు కష్ట నష్టాలకు గురయ్యారు. వారికి సుఖశాంతులు లేవు. దేవుళ్లను పూజించుటకు, పండుగలు బహిరంగంగా జరుపు కొనుటకు స్వేచ్ఛ లేదు. తినుటకు సరియైన తిండి, నివసించుటకు సురక్షితమైన ఇళ్లు లేవు. ఎక్కడ చూసినా అన్యాయం ప్రబలి ఉండేది. మహారాష్ట్రలో జాగీరులు కల్గియున్న అనేక మంది దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు తమ తమ జాగీరుల పై శ్రద్ధ చూపారే కాని దేశప్రజల సంక్షేమంపై శ్రద్ధ చూపలేదు. వారు జాగీరుల కొరకు పరస్పరం కలహించుకొనేవారు. వారి నిరంతర పోరాటం వల్ల ప్రజలు ఎన్నో కష్టాలకు గురయ్యారు. సరియైన పాలన అంటూ లేదు. ప్రజలు ఆ కష్టాలను భరించలేక చాలా విసుగెత్తారు. అంతటా అరాచాకత్వం ప్రబలింది.

శివాజీ మహారాజు ఈ పరిస్థితులన్నింటిని చూసి, మహారాష్ట్రలో ప్రజలకు సుఖశాంతులు ప్రసాదిం చేందుకై స్వరాజ్యం సాధించవలెనను మహత్తర కార్యాన్ని చేపట్టాడు. పరస్పరం కలహించు కొనే వతందారులను (జాగీరుదారులను) అతడు తన విధేయులుగా చేసుకొన్నాడు. అటుపిమ్మట వారిని స్వరాజ్య సాధన కార్యకాలాపాలలో ఉపయోగించు కొన్నాడు. ప్రజలను అణగదొక్కు శక్తులతో పోరాడి వారిని జయించాడు. కులమత భేదం లేకుండ సమానన్యాయం, గౌరవ మర్యాదలు ఉండే హైందవ స్వరాజ్యాన్ని స్థాపించాడు. హిందూ, ముస్లింల మధ్య ఎలాంటి భేదము చూపలేదు. అన్నిమతాల సాధువులను (భక్తులు) ఆదరించి, వారిని గౌరవించాడు. శివాజీ చేసిన ఈ ఉదాత్తమైన కార్యముల నుండి మనం ఉత్తేజాన్ని పొందవచ్చు.

శివాజీ మహారాజుకు పూర్వం దాదాపు మూడు - నాలుగు వందల సంవత్సరాల క్రితం మహారాష్ట్రలో అనేకమంది భక్తులు జన్మించారు. వారి కార్యాలు శివాజీకి స్వరాజ్య స్థాపనకై ఎంతో ఉపయోగపడ్డాయి. తర్వాత పాఠాలలో ఈ భక్తులు ఏమి చేశారో మనం తెలుసుకొందాం.

**1. ఖాళీలను కుండలీ కరణములోని సరైన పదంతో పూరించండి.**

అ) శివాజీ మహారాజు ............ యుగ కాలం నాటి వాడు.

(ప్రాచీన, మధ్య, ఆధునిక)

ఆ) శివాజీ మహారాజు ............ స్వరాజ్య స్థాపన చేశాడు

(మహారాష్ట్రలో, మధ్య ప్రదేశ్‌లో, ఉత్తరప్రదేశ్‌లో)

**2. జతపరచండి.**

| 'అ' | 'ఆ' |
|---|---|
| అ) విజయనగర చక్రవర్తి | 1. నిజాంషాహ |
| ఆ) అహ్మద్‌నగర్‌సుల్తాను | 2. ఆదిల్‌షాహ |
| ఇ) బీజాపూర్‌సుల్తాను | 3. కృష్ణదేవరాయలు |
| | 4. అక్బరు చక్రవర్తి |

LQHSIU

**3. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) ప్రజా సంక్షేమం కొరకు పరిపాలన చేసిన రాజుల పేర్లను రాయండి.

ఆ) శివాజీ మహారాజు ఏ కార్యమును చేపట్టెను?

ఇ) శివాజీ మహారాజు ఎవరితో పోరాడెను?

**4. భిన్నమైన పదాన్ని గుర్తించండి.**

అ) స్వరాజ్యం, బానిసత్వం, స్వాతంత్ర్యం.

ఆ) ప్రజలు, జనులు, రాజు.

**ఉపక్రమం**

అ) మీ తరగతిలో శివాజీ జయంతిని జరపండి.

ఆ) పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలలో చారిత్రాత్మక పాటలు, పోవాడాగేయాలు పాడి అభినయం చేసి చూపండి.



# 2.భక్తుల కార్యకలాపాలు

మహారాష్ట్రలో శ్రీచక్రధర్, భక్త నామ్‌దేవ్, భక్త జ్ఞానేశ్వర్, భక్త చోఖామెళాల నుండి మొదలైన భక్తి పరంపర సమాజంలోని వివిధ స్థాయిలకు చెందిన భక్తగోరోబా, భక్తసావతా, భక్త నరహరి, భక్త ఏక్‌నాథ్, భక్త శేఖ్ మహమ్మద్, భక్తతుకారాం, భక్త నీళోబా మొదలైనటువంటి గల భక్తులు ముందుకు కొనసాగించిరి. అదే విధంగా భక్త జానాబాయి, భక్త సోయరాబాయి, భక్త నిర్మళాబాయి, భక్త ముక్తాబాయి భక్త కాన్హోపాత్రా మరియు భక్త బహిణాబాయి శివూర్‌కర్ కూడా ముందుకు కొనసాగించిరి.


వీరు ప్రజలకు దయ, అహింస, పరోపకారం, సేవ, సమత, సోదరప్రేమ మొదలగు సుగుణాల గురించి ప్రభోదించారు. ఒకరు తక్కువ, ఒకరు ఎక్కువ అనే బేధభావం లేకుండా అందరూ సమానులే అనే భావనను భక్తులు ప్రజల మనస్సులో కలిగింప చేశారు. అదే విధంగా మహారాష్ట్రలో సమర్థ రామదాసు కూడా తమ కార్యాన్ని చేసెను.



శ్రీ చక్రధర్‌స్వామి

**శ్రీ చక్రధర్‌స్వామి :** శ్రీచక్రధర్‌స్వామి గుజరాత్‌లోని ఒక రాజపుత్రుడు. అతడు సన్యాసం స్వీకరించి మహారాష్ట్రకు వచ్చాడు. ఇచ్చట సంచారం చేస్తూ అతడు సమానత్వాన్ని బోధించాడు. అతనికి స్త్రీ – పురుష, జాతి, మత భేదములు ఇష్టం లేదు. అందువలన అనేక మంది స్త్రీ–పురుష అనుచరులు లభించారు. అతడు స్థాపించిన మతమును మహానుభావ మతము అని అంటారు. శ్రీచక్రధర్ స్వామి గారి స్మృతుల సంగ్రహమే 'లీలా చరిత్రము' అను గ్రంథము.

**భక్తనామ్‌దేవ్ :** భక్తనామ్‌దేవ్ విఠలుని యొక్క పరమ భక్తుడు. అతడు నర్సీగ్రామానికి చెందినవాడు. అతడు అనేక కీర్తనలు రాసి, వాటిని సంకీర్తనము



భక్త నామ్‌దేవ్

చేస్తూ ప్రజలలో గొప్ప జాగృతిని కలిగించాడు. ఆయన వైష్ణవ మతాన్ని ప్రచారం చేస్తూ మహారాష్ట్ర అంతటా పర్యటించాడు. ఆయన ప్రజలలో దైవభక్తిని కలిగించాడు. మత సంరక్షణ, భక్తిమార్గంల యొక్క దృఢ సంకల్పాన్ని ప్రజల మనసులలో నాటాడు. పిమ్మట భక్త నామ్‌దేవ్ భారతదేశ మంతటా పర్యటించి మానవ ధర్మసందేశాన్ని వినిపించాడు. ఆయన పంజాబ్ వెళ్లి ప్రజలకు సమానత్వాన్ని గూర్చి బోధించాడు. హిందీ భాషలో కీర్తనలు రాసెను. ఇప్పటికీ అతడు రాసిన భక్తి కీర్తనలు సిక్కుల మత గ్రంథం 'గురు గ్రంథసాహిబ్'లో చూడవచ్చును. మహారాష్ట్ర అంతటా ప్రజలు ఇప్పటికీ ఆయన కీర్తనలను (అభంగ్) ఇంటింటా గొప్ప భక్తి శ్రద్ధలతో పాడుకొనుచున్నారు.

**భక్త జ్ఞానేశ్వర్ :** భక్త జ్ఞానేశ్వర్ ఆపేగావ్‌కు చెందినవాడు. ఇతని సోదరులు నివృత్తినాథ్ సోపాన్‌దేవులు. ఈయన సోదరి ముక్తాబాయి. అప్పటి సనాతనులు వీరిని సన్యాసి సంతానమని వెక్కిరించే వారు. వీరి తండ్రి సన్యాసం పుచ్చుకొని, ఇల్లు వదలి వెళ్లిపోవడమే దీనికి కారణం. కాని గురువు ఆజ్ఞ ప్రకారం ఇంటికి తిరిగి వచ్చి సంసారం చేయసాగాడు. ఆ తర్వాత వారికి పై నలుగురు సంతానం కలిగారు. ఆ సమయంలో సంకుచిత మనస్తత్వము కలిగిన మతాధికారులకు ఇది సబబుగా అనిపించలేదు. అందువల్ల ప్రజలు ఈ పిల్లలను హింసించి సంఘబహిష్కరణ చేశారు.

ఒకసారి జ్ఞానేశ్వర్ గ్రామంలో భిక్షాటనకు వెళ్లాడు. కాని అతనికి ఎవరును భిక్ష పెట్టలేదు. పైగా వారినుండి దుర్భాషలు వినవలసి వచ్చింది. అందుకు పిన్న వయస్కుడైన జ్ఞానేశ్వర్ చాల బాధపడ్డాడు. అతడు తన గుడిసెలోకి వెళ్లి లోపల గడియ పెట్టుకొని జరిగిన దానికి దుఃఖించాడు. ఇంతలో అతని సోదరి ముక్తా బాయి వచ్చి తలుపుతట్టి "జ్ఞానేశ్వర్! తలుపు తీయి! మనం దుఃఖంలో మునిగి పోయినచో ప్రపంచ క్షేమాన్ని ఎవరు చూడగలరు?" అన్నది. తన సోదరి మాటలు జ్ఞానేశ్వర్‌కు నూతనోత్సాహాన్ని కలిగించాయి. అతడు తన దుఃఖాన్ని మరచి కార్యసాధనకు పూనుకొన్నాడు. ప్రతిచోట మతము పేరిట పేదలు, వెనుక బడిన వర్గపు ప్రజలు అణగద్రొక్క బడుటను చూచి జ్ఞానేశ్వర్ ప్రజల పట్ల ఆసక్తితో "దేవునిపై విశ్వాసం కలిగి వుండండి. అందరిని సమానంగా చూడండి. దుఃఖంలో ఉన్నవారికి సహాయపడండి. వారి దుఃఖాన్ని తుడిచి వేయండి" అని బోధించాడు. అతని బోధనలు ఏడు శతాబ్దాలుగా మహారాష్ట్ర నలుమూలల్లో వ్యాపించాయి.

ఆ రోజుల్లో మత బోధనలన్నియు సంస్కృత గ్రంథాల్లో నిగూఢమై ఉండేవి. సామాన్య ప్రజలు నిత్య వ్యవహారికంలో మరాఠీ భాష మాత్రమే వాడెడి వారు. జ్ఞానేశ్వర్ మరాఠి భాషలో 'జ్ఞానేశ్వరి' అను గొప్ప గ్రంథాన్ని రాసెను. ఈ విధంగా అతడు ప్రజలకు మత జ్ఞాన ద్వారాలు తెరచాడు. ప్రజలకు సోదర



భక్త జ్ఞానేశ్వర్

భావం గూర్చి బోధించాడు. జానేశ్వర్ పుణె దగ్గర గల ఆలంది గ్రామంలో అతి చిన్న వయసులోనే సజీవసమాధి పొందాడు. నేటికి కూడా ప్రతి సంవత్సరం ఆషాఢ, కార్తీక మాసాలలో ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో భక్తులు ఆలంది-పండరిపూరుకు వెళ్లి దర్శించుకుంటారు.



భక్త ఏక్‌నాథ్

**భక్త ఏక్‌నాథ్ :** భక్త నామ్‌దేవ్, భక్త జ్ఞానేశ్వర్లు ప్రారంభించిన కార్య పరంపరను భక్త ఏక్‌నాథ్ ముందుకు కొనసాగించాడు. అతడు పైఠణ్‌కు చెందిన వాడు. భక్తి మార్గాన్ని ప్రజలకు బోధించాడు. అభంగములు, ఛందములు, జానపద గేయాలు మొదలైన మతసంబంధమగు కీర్తనలు రాసెను. ఉచ్ఛ, నీచ బేధములు పాటించవద్దని ప్రజలకు భోదించాడు. భక్తి యొక్క విశిష్టతను ప్రజలకు తెలియజేశాడు. పేదలను, దళితులను చేరదీశాడు. అంతేకాదు మూగ జంతువులతో సహా సమస్త జీవరాసులను ప్రేమించమని బోధించాడు. తాను బోధించిన విషయాలను ఆచరించి చూపాడు.

ఒకరోజు ఏక్‌నాథ్ గోదావరి నదికి స్నానానికి వెళ్లుచున్నాడు. మధ్యాహ్నమై నందున ఎండ తీవ్రంగా ఉన్నది. నదీ తీరాన వేడిగా ఉన్న ఇసుక తిన్నెలపై కూర్చొని ఒంటరి బాలుడొకడు ఏడ్చుచున్నాడు. ఆ బాలుని ఏడ్పు ఏక్‌నాథ్‌కు వినిపించింది. అతడు ఆ బాలుని తల్లి దండ్రుల కోసం చుట్టూ కలియజూచాడు. పరుగున వెళ్లి ఆ పిల్లవాణ్ణి ఎత్తుకొని కన్నీరు తుడిచి ఇంటికి చేర్చాడు.

ఈ విధంగా ఏక్‌నాథ్ ప్రజల మనస్సులో ప్రేమ, సమానత్వం కలుగునట్లు చేసి తాను స్వయంగా ఆచరిస్తూ ఆదర్శ ప్రాయుడైనాడు.



భక్త తుకారాం


**భక్తతుకారాం :** శివాజీ మహారాజు కాలంలో తుకారాం, రామదాసు అనే ఇద్దరు గొప్ప భక్తులు ఉండేవారు. తుకారం పుణె దగ్గర గల దేహు అనే గ్రామానికి చెందినవాడు. అతనికి పొలము, కిరాణా (ఆహార దినుసులు) దుకాణం కూడా ఉండేది. అతని పూర్వీకులు తరతమ బేధ భావం చూపక అందరికీ అప్పులిచ్చేవారు. కాని తుకారాం తన వాటాకు వచ్చిన అప్పు పద్దులను ఇంద్రాయణీ నదిలో ముంచివేసి ఎంతో మందిని అప్పులనుండి విముక్తులను గావించాడు. అతడు దరిదాపుల నున్న కొండలకు వెళ్లి విఠల దేవుని గూర్చి భజన చేసేవాడు. ఆషాఢ, కార్తీక మాసాలలో పంఢరీపురానికి పోయేవాడు. అతడు కీర్తనలు, అభంగములు రచించి వాటిని ప్రజలకు పాడి వినిపించే వాడు. వేలకొలది ప్రజలు అతని కీర్తనలు వినుటకు మూగెడివారు. శివాజీ కూడా అతని కీర్తనలు వినడానికి వెళ్లేవాడు. భక్త తుకారాం ప్రజలకు దయ, క్షమ, శాంతులను ఉద్భోదిస్తూ సర్వ సమానత్వాన్ని ఉపదేశించాడు.

**జే కా రంజలే గాంజలే ! త్యాంసీ మ్హణే జో ఆపులే**
**తోచి సాధు ఓళఖావా ! దేవ తేథేచి జాణావా !**

(దీనులను, బలహీనులను, తన వారుగా ఎవరు భావిస్తారో అతనే సాధువు అని గుర్తించు, అతని లోనే భగవంతుడుంటాడని గ్రహించు.)

అనే సందేశాన్ని అతను ప్రజల మనస్సుల్లో నాటి ప్రజల మనసులో ఆలోచనలు రేకెత్తించాడు. ప్రజలు అతనిని ఎంతగానో పొగడసాగారు. నేటికిని మహారాష్ట్ర మంతటా మనకు "జ్ఞాన్‌బా–తుకారాం" అనే నినాదములు వినబడుతుంటాయి. జ్ఞానేశ్వరుని 'జ్ఞాన్‌బా' అని అనేవారు. 'తుకారాంగాథ' నేటికీ ఇంటింటా పఠింపబడుచున్నది.

**సమర్థరామదాసు :** అదే సమయంలో 'జయ జయ రఘువీర సమర్థ' అనే నినాదం మహారాష్ట్ర కొండకోనలలో మారుమోగింది. రామదాసు మరాఠ్వాడ లోని గోదావరీ నదీ తీరాన గల జాంబ్ అనే గ్రామంలో రామనవమి రోజున పుట్టాడు. ఇతని అసలుపేరు నారాయణ. కాని ఇతడు శ్రీరాముని సేవకునిగా రామదాసు అని పిలిపించుకొనుటకే ఇష్టపడేవాడు. తాను రచించిన 'దాసబోధ' అనే గొప్ప గ్రంథం ద్వారా ప్రజలకు అమూల్య సందేశాన్ని బోధించాడు. తన మనాచా శ్లోక్ (మానశ్లోకం) ద్వారా ప్రజలకు చిత్తశుద్ధి, సత్ప్రవర్తనను గురించి తెలియజెప్పాడు. ప్రజలు శక్తిని పూజించుటకు పలుచోట్ల ఆంజనేయస్వామి దేవాలయాలు కట్టించాడు. ప్రజలకు శక్తిని ఆరాధించడం నేర్పాడు. 'సామర్థ్య ఆహే చళవళీచే, జో జో కరీల్ తయాచే'. (గొప్ప శక్తి ఉంటుంది ఉద్యమం ఎవరెవరు చేస్తారో) ఐకమత్యంతో అన్యాయాన్ని ఎదిరించమని ప్రజలకు ఉపదేశించాడు. ఈ బోధనలు ప్రజలకు ధైర్యం కలిగించాయి.



సమర్థరామదాసు

భక్తుల కార్యకలాపాలు ప్రజలలో ఒక గొప్ప చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కల్గింపజేశాయి. మతం పై గౌరవభావాన్ని పెంచాయి. భక్తుల కార్యాలను శివాజీ స్వరాజ్య స్థాపనకు ఎంతగానో ఉపయోగించుకొన్నాడు.

## అభ్యాసం

**1. ఖాళీలను సరైన పదంతో పూరించండి.**

అ) భక్తనామ్‌దేవ్ ............ పరమభక్తుడు.

ఆ) జ్ఞానేశ్వర్ చిన్న వయసులోనే పుణె దగ్గరి ........... వద్ద సజీవసమాధి పొందాడు.

ఇ) భక్త తుకారాం తన వాటాకు వచ్చిన అప్పు పద్దులను ............ నదిలో ముంచివేశాడు.

ఈ) సమర్థ రామదాసు శక్తిని పూజించుటకు పలుచోట్ల ........... దేవాలయాలు కట్టించాడు.

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శ్రీచక్రధర్‌స్వామికి ఏ బేధభావము ఇష్టం లేకుండెను?

ఆ) భక్త నామ్‌దేవ్‌ప్రజల మనసుల్లో ఎలాంటి దృఢ సంకల్పాన్ని కలిగించాడు.

ఇ) భక్త ఏక్‌నాథ్ ప్రజలకు ఏమని బోధించాడు?

ఈ) సమర్థ రామదాసు ఏమని సందేశమిచ్చాడు?

**3. రెండు – మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) భక్త జ్ఞానేశ్వర్ గుడిసెలోనికి వెళ్లి ఎందుకు గడియ వేసుకొనెను?

ఆ) భక్త తుకారాం ప్రజల మనసుల్లో ఏ సందేశాన్ని నాటాడు?

### ఉపక్రమం

పాఠంలో వచ్చిన భక్తులు కాకుండా ఇతర భక్తుల చిత్రాలను సేకరించి వాటి కింద వారి బోధనలను రాయండి.

LQR1KH

# 3. మరాఠా సర్దారులు – సమర్థవంతమైన భోస్లే వంశం

**అశాంతియుత కాలం :** భక్తులు ప్రజలలో దైవభక్తిని బోధించగా సాహసికులైన మరాఠా సర్ధారులు మహారాష్ట్రలో శౌర్యపరంపరను నెలకొల్పారు.

అది ఎన్నో ఒడిదుడుకులతో నిండిన కాలం. బీజాపూర్ ఆదిల్‌షాహ, అహ్మద్‌నగర్ నిజాంషాహ సుల్తానుల మధ్య మహారాష్ట్రలో నిరంతరం యుద్ధాలు జరుగుతుండేవి. యుద్ధానికై వారికి సైన్యం కావలసి వచ్చేది. ఆ యుద్ధాలలో మరాఠా సర్ధారులను ఉపయోగించుకొనేవారు.

**సాహసవంతులైన మరాఠా సర్ధారులు :** మరాఠాలు శ్రమజీవులు, సాహస వంతులైన వీరులు. వారు చాలా ధైర్యవంతులు. విశ్వాస పాత్రులుగా ఉండేవారు. యుద్ధంలో తాము పొందిన గొప్ప గొప్ప విజయాలకు గర్వ పడేవారు. సాహస మరాఠా యువకులు నడుముకు కత్తితోను, చేతిలో ఈటెతోను గుర్రముపై జీను వేసి సర్ధారుల దళంలో చేరిపోయేవారు. మరాఠా సర్ధారులకు తమ స్వంతసైన్యాలు ఉండేవి. అటువంటి సర్ధారు తన సైన్యంతో సల్తాన్‌ను దర్శిం చినపుడు సుల్తాన్‌అతనికి కొలువులో ఉద్యోగమిచ్చి, రాజ్యంలో ఒక సర్ధారుగా నియమించేవాడు. కొన్ని సమయాల్లో అతనికి జాగీరు కూడా బహుమతిగా ఇచ్చేవాడు. అటువంటి జాగీరు పొందిన సర్ధారు తనను తాను జాగీరుకు రాజుగా భావించుకొనేవాడు.

బీజాపూర్, అహ్మద్‌నగర్ సుల్తానుల సంస్థానాలలో అనేక మంది పేరుగాంచిన మరాఠా సర్ధారులుం డేవారు. వారిలో సింధ్‌ఖేడ్ జాదవులు, ఫల్టణ్ నింబాల్కర్లు, ముధోల్ ఘోర్పడేలు, జావళి మోరెలు, వేరుల్ భోస్లేలు ముఖ్యులు. సింధ్‌ఖేడ్ జాధవులు దేవగిరి యాదవ వంశస్థులు. శివాజీ మహారాజు తల్లి జిజాబాయి సింధ్‌ఖేడ్ లఖూజీ జాదవ్‌కుమార్తె.

**వీరోచిత సంప్రదాయం :** ఈ మరాఠా సర్ధారులందరు సాహసవంతులు. కాని వారిలో చాలా మంది ఒకరికొకరు బద్ధ శత్రువులు. ఐక్యతగా ఉండి తమ ప్రజలకు ఏదైనా మేలు చేయవలెనని ఎప్పుడూ తలంచే వారు కాదు. కనుక వారి ధైర్య సాహసాలు, వీరత్వం ఇతరులకు మాత్రమే ఉపయోగపడేవి. అలా ఉండి కూడా, మహారాష్ట్రలోని వేలాది యువకులలో రణోత్సాహం పట్ల ఆసక్తిని కలిగించారు. వారు అనేక మంది వీరులను తయారు చేశారు. మరాఠా సర్ధారులు మహారాష్ట్రలో వీరోచిత సంప్రదాయాన్ని నిలబెట్టారు. మహారాష్ట్రలోని శూరులలో వేరూల్ యొక్క భోస్లే వంశస్థుల గొప్ప ధైర్యసాహసాలను ప్రదర్శించారు.

**ఘృష్ణేశ్వరాలయం :** ఇది సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రిందటి విషయం. వేరుల్‌గుహల దగ్గర నున్న సుందరమైన ఘృష్ణేశ్వరాలయం శిథిలావస్థలో, గోడలు బీటలు వారి ఉండేది. పూజారి కూడా ఆలయం వదలి వెళ్ళి పోయాడు. ఎంత మహత్తుగల దైవం! కాని ఆ మందిరానికి ఎలాంటి దురవస్థ కలిగింది. (ఇట్లు గొప్ప పరమార్థం కొరకు కట్టబడిన దేవాలయం పూర్తిగా శిథిలమై పోయింది.) అక్కడికి వచ్చిన భక్తులందరు శిధిలావస్థలో ఉన్న దేవాలయాన్ని చూచి దుఃఖించారు, నిట్టూర్పు విడిచారు. కాని దానిని బాగు చేయుటకు ఎవరును ప్రయత్నించలేదు.

ఒక గొప్ప శివభక్తుడు క్రమం తప్పక ప్రతిరోజు ఆ శిథిల దేవాలయాన్ని దర్శించేవాడు. అక్కడ ఉన్న శివ లింగంపై పూలు, విభూతి పెట్టి చేతులు జోడించి తన మనోచింతనలను శివునికి విన్నవించు కొనేవాడు. ఒకరోజు అతడు కూలీలను పిలిపించి,



శహాజీరాజె

పడిపోయిన గోడలను కట్టించాడు. ఆ దేవాలయానికి విస్తారమైన మరమ్మత్తులు చేయించి, పూర్వపు స్థితికి తెచ్చి, ఘృష్ణేశ్వరుని పునఃనిర్మాణం చేశాడు. దేవాలయం లోపల, బయట దీపాలు వెలిగాయి. ఘృష్ణేశ్వరుని గతవైభవం మరల తిరిగి వచ్చింది. ఇది ఎవరు చేసారు ఇట్లు చేసిన ఆ శివభక్తుడెవరో తెలుసా? అతడే మాళోజీ రాజె భోస్లే.

**వేరుళ్ భోస్లేలు :** వేరుళ్ గ్రామపు పాటిల్ అయిన మాళోజి రాజె భోస్లే గొప్ప శివభక్తుడు. విఠోజీరాజె అతని యొక్క చిన్న తమ్ముడు. వేరుళ్ యొక్క బాబాజీ రాజె భోస్లే కుమారులు వీరు. వేరుళ్ గ్రామం యొక్క అధికారం బాబాజీ రాజె భోస్లే చేతిలో ఉండేది.

మాళోజీరాజె, విఠోజీరాజెలు గొప్ప సామర్థ్య వంతులు, ధైర్యసాహసాలు కలవారు. వారిసేవలో అనేకమంది సాయుధులైన మరాఠా సైనికులు ఉండేవారు. అది ఒక అశాంతియుత కాలం. ఉత్తరంలోని ఢిల్లీని పాలించు మొఘలు చక్రవర్తి నిజాంషాహ రాజ్యంపై దండెత్తాడు. అప్పుడు దౌలతాబాదు నిజాంషాహ రాజ్యానికి రాజధానిగా ఉండేది. అక్కడ అతనికి మలిక్ అంబర్ మంత్రిగా ఉండేవాడు. అతడు గొప్ప పరాక్రమ వంతుడు, మేధావి. అతని దృష్టి సాహసవంతులైన, సమర్థవం తులైన వేరుల్ సోదరులపై పడింది. అతడు నిజాం షాకు వారి ధైర్యసాహసాలను గురించి వివరించారు. నిజాంషాహ మాళోజీ రాజెకు పుణె, సుపేపరగణాలను జాగీరులుగా ఇచ్చాడు.

దాంతో భోస్లేలు ధనవంతులుగా మారి శక్తి వంతులైరి. మాళోజీరాజె భార్య ఉమాబాయి. ఆమె పల్టణ్ నింబాల్కరుల కుటుంబీకురాలు. వారికి శహజీ, శరీఫ్‌జీ అనే ఇద్దరు కుమారులు ఉండిరి. శహాజీ ఐదు సంవత్సరాల బాలునిగా ఉన్నప్పుడు మాళోజీ రాజె ఇందాపూర్‌యుద్దంలో చంపబడ్డాడు. ఆ కారణంగా విఠోజీరాజె పిల్లలిద్దరిని, జాగీరును సంరక్షించాడు. ఆ తరువాత అతడు లఖుజీరావు జాదవ్‌కూతురు జీజాను శహాజి పెండ్లి నిమిత్తమై సంప్రదించాడు. జీజా సుగుణాలరాశి. విఠోజి రాజె ప్రస్తావించిన పెండ్లి సంబంధానికి లఖూజీరావు అంగీకరించాడు. లఖూజీరావు నిజాంషాహ రాజ్యం లోని ఒక శురుడు, పరాక్రమ వంతుడైన సర్దారు. అతడు పటిష్టమైన సైన్యాన్ని కలిగియుండేవాడు. నిజాంషాహ దర్బారులో కూడా అతనికి గొప్పగౌరవం వుండేది. అతడు శహాజీరాజు, జిజాబాయి వివాహం అంగరంగవైభవంగా జరిపించాడు. జిజాబాయి భోస్లే వంశానికి కులస్త్రీ అయింది.

**శహాజీరాజె :** నిజాంషాహ మాళోజీరాజుకు బహూకరించిన జాగీరును శహాజీరాజెకు బదిలీ జేశాడు. శహాజీరాజె గొప్ప పరాక్రమవంతుడు, నిజాంషాహ కొలువులో అతనికి గొప్ప గౌరవం వుండెను. మొఘలు చక్రవర్తి నిజాంషాహ రాజ్యాన్ని జయింప నిశ్చయించుకొని బీజాపూర్ ఆదిల్‌షాహతో చేయికలిపాడు. అప్పుడు నిజాం షాహ రాజ్యాన్ని కాపాడుట కొరకు మలిక్ అంబర్, శహాజీరాజులు తెగించి పోరాడి ఇరుసైన్యాలను ఓడించాడు .అహ్మద్‌నగర్ దగ్గర భాత్‌వడి వద్ద ఈ గొప్ప యుద్ధం జరిగింది . ఈ యుద్ధంలో శరీఫ్‌జీ చంపబడెను. కానీ శహాజీ రాజె గొప్ప పరాక్రమాన్ని ప్రదర్శించాడు. 'వీరసేనాని' అని దేశమంతటా ఖ్యాతి గాంచాడు. దర్బారులో అతని ప్రతిష్ట ఎంతగా పెరిగిందంటే స్వయంగా మలిక్ అంబర్‌కే అతనిపై అసూయ కలిగింది. తత్ఫలితంగా ఇరువురిలో మనస్పర్థలు కలిగి శహాజీరాజె నిజాంషాహ రాజ్యాన్ని వదలిపెట్టి బీజాపూర్ ఆదిల్‌షాహ రాజ్యంలో కలిశాడు. ఆదిల్‌షాహ అతనికి 'సర్‌లష్కర్' అను బిరుదునిచ్చి గౌరవించాడు. తర్వాత నిజాంషాహ రాజ్యంలో చాలా మార్పులు జరిగాయి. మంత్రి మలిక్

అంబర్ మరణించాడు. అతని కుమారుడు ఫత్తేఖాన్ గొప్ప కుటిలనీతి గలవాడు. అతడిప్పుడు నిజాం షాహ రాజ్యానికి మంత్రి అయ్యాడు. అతని కాలంలో నిజాంషాహ రాజ్యానికి క్షీణదశ పట్టింది. మొఘలుల దండయాత్రల ముప్పు మొదలైంది. వాటినుండి నిజాంషాహ రాజ్యాన్ని రక్షించుకొనుటకు నిజాంషాహ తల్లి శహాజీ రాజు వద్దకు వెళ్లి నిజాంషాహ రాజ్యానికి తిరిగిమ్మని ఒత్తిడి చేసింది. అప్పుడు శహాజీరాజు ఆదిల్‌షాహ రాజ్యాన్ని వదిలి తిరిగి నిజాంషాహ రాజ్యంలోకి వచ్చాడు.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదంతో పూరించండి.**

అ) మహారాష్ట్రలోని వీరోచిత వంశాలలో వేరుల్ ............. వంశం గొప్ప, పరాక్రమవంతులుగా పేరు పొందారు.

(మోరే, ఘోర్పడే, భోస్లే)

ఆ) బాబాజీ రాజే భోస్లేకు మాళోజీ మరియు ............. అను ఇద్దరు కుమారులుండిరి.

(విఠోజీ, శహాజీ, శరీఫ్‌జీ)

ఇ) నిజాంషాహ యొక్క కర్తవ్య పరాయణుడైన మంత్రి .............

(మలిక్ అంబర్, ఫత్తే ఖాన్, శరీఫ్‌జీ)

**2. బంధుత్వాన్ని రాయండి.**

అ) మాళోజీ రాజే – విఠోజీ రాజే ............

ఆ) శహాజీ రాజే – లఖూజీ రావు జాధవ్ ............

ఇ) శహాజీ రాజే – శరీఫ్‌జీ ............

ఈ) బాబాజీ రాజే – విఠోజీ రాజే ............

**3. జతపరచండి.**

| 'అ' | | 'ఆ' |
|---|---|---|
| అ) | సింధ్‌ఖేడ్ | 1) నింబాల్కర్ |
| ఆ) | పల్టణ్ | 2) ఘోర్పడె |
| ఇ) | జావళీ | 3) భోస్లే |
| ఈ) | ముదోళ్ | 4) మోరే |
| | | 5) జాధవ్ |

**4. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) ఘృష్ణేశ్వరాలయానికి మరమ్మత్తులు ఎవరు చేశారు?

ఆ) నిజాంషాహ మాళోజీరాజునకు ఏ పరగణాలను జాగీరుగా ఇచ్చెను?

ఇ) నిజాంషాహ రాజ్యంను కాపాడుట కొరకు ఎవరు తెగ్గించి పోరాడారు?

ఈ) ఆదిల్‌షాహ శహాజీ రాజుకు ఏ బిరుదును ఇచ్చాడు?

ఉ) శహాజీ ఆదిల్‌షాహ రాజ్యం వదిలి నిజాంషాహ రాజ్యంలోకి ఎందుకు వచ్చాడు?

**ఉపక్రమం**

మహారాష్ట్ర మానచిత్ర పటంలో అహ్మద్‌నగర్, పల్టణ్, వేరుళ్, పుణె, సుపె ప్రదేశాలను చూపండి.

**సూచన :** ఇక్కడ 'మరాఠా' పదానికి అర్థం ప్రత్యేక జాతికి చెందిన వ్యక్తి అని కాదు. మరాఠీ భాష మాట్లాడే వారు మహారాష్ట్రీయులు అని అర్థం.

LQZHM5

# 4. శివాజీ బాల్యం



శివనేరి కోటలో శివాజీ జన్మస్థానం

**శివాజీ జననం :** అస్థిరత ప్రబలిన రోజులవి. ఉత్తరం నుండి మొఘల్‌చక్రవర్తి యగు షాజహాన్ దక్కన్‌ను జయించడానికి పెద్ద సైన్యాన్ని పంపాడు. శహాజీరాజు జాగీరుకు ముఖ్య పట్టణమైన పుణెను బీజాపూర్ నవాబు ఆదిల్‌షాహ సర్వనాశనం చేశాడు. శహాజీకి చాల కష్ట పరిస్థితి ఎదురైంది .అతని పరిస్థితి ముందు చూస్తే నుయ్యి వెనుక చూస్తే గొయ్యి అన్నట్లుగా ఉంది. అతనికి నిలకడ అంటూ లేకుండా పోయింది.

ఆ సమయంతో జిజాబాయి గర్భవతిగా ఉండేది. ఇటువంటి క్లిష్టపరిస్థితులలో ఆమెకు ప్రశాంతత, రక్షణ ఇవ్వగలిగిన ప్రాంతమొక్కడుందనే గొప్ప సమస్య శహాజీకి ఎదురైంది. అప్పుడతనికి శివనేరి దుర్గం గుర్తుకొచ్చింది. జిజాబాయిని శివనేరికి పంపాలని నిశ్చయించుకొన్నాడు. శివనేరి పుణె జిల్లాలోని జున్నర్ దగ్గరగల ఒక బలమైన కోట. ఆ కోటకు నాలుగు వైపులా ఎత్తైన కొండలు, బలమైన ప్రహారీగోడలు, దృఢమైన ద్వారాలు ఉండేవి.

కోట చాలా బలంగా ఉండెను. ఈ కోట ఆకాలం లో భోస్లేలకు బంధువైన విజయరాజు ఆధీనంలో ఉండేది. అతడు జిజాబాయికి రక్షణ కల్పించుటకు అంగీకరించాడు. శహాజీ ఆమెను కోటలో వదిలి అటు పిమ్మట మొఘలులపై దండెత్తాడు.


ఇంతలోనే ఆ శుభఘడియ రానే వచ్చింది. ఫాల్గుణ మాస కృష్ణపక్ష తదియనాడు 1551 అనగా ఇంగ్లీషు క్యాలండరు ప్రకారం 19 వ ఫిబ్రవరి 1630. శివనేరి నగరఖానా లోని భేరీలు, బాకాలు మ్రోగుచున్న శుభసమయాన జిజాబాయి ఒక మగ శిశువుకు జన్మనిచ్చింది. కోటలో పరమానందమయింది. బాలుని నామకరణం జరిగింది. శివనేరి కోటలో జన్మించాడు కావున బాలునిపేరు శివాజీ అని పెట్టారు.

**శివాజీ బాల్యం :** శివాజీ మొదటి ఆరు సంవత్సరాల జీవితం చాల అనిశ్చిత పరిస్థితులలో గడిచింది . అనిశ్చిత పరిస్థితులలోనైనను జిజాబాయి అతనికి మంచి చదువు చెప్పించింది. ప్రతిరోజు సాయంత్రం ఇంటిదీపాలు వెలిగించగానే శివాజీని పిలిచి, దగ్గరకూర్చుండ బెట్టుకొని ప్రేమతో రాముడు, కృష్ణుడు, భీముడు, అభిమన్యుడు మున్నగువారి కథలు చెప్పేది. అట్లే కొన్నిసార్లు నామ్‌దేవ్, జ్ఞానేశ్వర్, ఏక్‌నాథ్‌ల భక్తి గీతాలు వినిపించేది. శివాజీకి సాహసవీరుల కథలంటే ఇష్టం. పెరిగి పెద్దవాడైన తరవాత వారి మాదిరిగా గొప్ప పనులు చేయాలని అతను అనుకొనేవాడు. జిజాబాయి సాధువుల, భక్తుల జీవితచరిత్రలలోని కథలు చెప్పేది. వాటి మూలాన అతనిలో సాధువుల, భక్తుల పట్ల ఆదర భావం ఏర్పడింది.

పేద కుటుంబాలకు చెందిన మావళీల పిల్లలు శివాజీతో ఆడుకొనుటకు వచ్చేవారు. కొన్ని సమయాల్లో అతడు వారి గుడిసెలకు వెళ్లి రొట్టెలను ఉల్లిపాయతో ఇష్టంతో తినేవాడు. గమ్మత్తైన ఆటలు ఆడుకొనెవారు.



వీరమాత జిజాబాయి శివాజీకి కథలు చెప్పుచున్న దృశ్యం



**మిత్రులతో శివాజీ**

మావళీల పిల్లలు అడవిలోని స్వేచ్ఛా విహంగముల వంటివారు. అడవిలోని కోయిలలను, చిలుకలను, పులులను చక్కగా అనుకరించి అరిచేవారు. ఏనుగుల, గుర్రములను మరియు కోటలను మట్టితో చేయడం వారి అలవాటు. దాగుడు మూతలు, బంతి, బొంగరాలు వారు ఎప్పుడూ ఆడేవాడు. శివాజీ ఆ ఆటలన్నియు వారితో కలిసి ఆడేవాడు. మావళీ పిల్లలకు శివాజీ అంటే చాలా ఇష్టం.

**శహాజీరాజె మొఘలు చక్రవర్తి వైపు :** శహాజీరాజె నిజాంషాహ రాజ్యం లోకి తిరిగి వచ్చాడు. కాని అతనికి అచట సంతృప్తి గా లేదు. ఎందుకంటే నిజాంషాహ చెప్పుడు మాటలు వినేవాడు, చంచల స్వభావం కలవాడు. అందువలన దర్బారులో కుట్రలు, కుతంత్రాలు పెరిగి పోయాయి. నిజాంషాహ రెచ్చగొట్టడంచే లఖూజీరావు జాధవ్ నిండు దర్బారులో హత్య గావించబడ్డాడు. ఈ సంఘటనతో ఆక్రోశం చెంది శహాజీరాజె నిజాంషాహ రాజ్యాన్ని వదిలిపెట్టి మొఘలుల కొలువులో చేరాడు. మొఘలు చక్రవర్తి షాజహాన్అతనికి సర్దారు హోదా కల్పించాడు.

ఇంతలో మంత్రి ఫత్తేఖాన్ మొఘలులతో రహస్యంగా చేతులు కలిపి నిజాంషాహనే హత్యచేశాడు. నిజాంషాహ రాజ్యంలో అరాచకత్వం ప్రబలింది. ఫత్తేఖాన్ నమ్మక ద్రోహంతో నిజాంషాహ రాజ్యాన్ని మొఘలుల హస్తగతం చేస్తాడని స్పష్టమైంది. అంతే కాకుండా దానికి ప్రతిఫలంగా శహాజీరాజె అధీనంలో ఉన్న ప్రాంతాన్ని మొఘలులు అతనికి బహుమానంగా ఇచ్చారు. అప్పుడు శహాజీరాజె కోపంచెంది మొఘలుల పక్షం విడిచి తన సామర్థ్యంతో మొఘలులకు గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నాడు.

**నూతన నిజాంషాహ రాజ్యస్థాపన :** మంత్రి ఫత్తేఖాన్ మరియు మొఘల్ చక్రవర్తిని ఎదిరించుట కోసం శహాజీరాజె నిజాం వంశంలోని ఒక బాలుడిని

వెదికి పట్టుకొని, జున్నర్‌దగ్గర గల పేమగిరి కోటపై అతడిని నిజాంషాహ అని ప్రకటించెను. ఆ విధంగా అతడు ఒక కొత్త రాజ్యాన్నే స్థాపించాడు. ఈ రాజ్యం లో గోదావరి నుండి నీరా మధ్యగల ప్రాంతం ఇమిడి యుండెను. ఈ రాజ్యాన్ని రక్షించుటకు శహాజీరాజె చాలా పట్టుదలతో పోరాడెను. ఈ పోరాటంలో ఆదిల్‌షాహ ముందు అతనికి అండగా నిలిచెను. కాని తరువాత స్వయంగా మొఘలు చక్రవర్తి షాజహాను దక్షిణం వైపు శహాజీరాజు పైకి దాడికి వచ్చి, ఆదిల్‌షాహను బెదిరించడం వల్ల ఆదిల్‌షాహ శహాజీరాజెకు వ్యతిరేకంగా షాజహానుతో మైత్రీ ఒడం బడిక చేసుకొన్నాడు.

ఇప్పుడు మొఘలు మరియు ఆదిల్‌షాహ రాజ్యాల ఉమ్మడి సైన్యాలతో శహాజీరాజె గొరిల్లా యుద్ధ పద్ధతిలో పోరాడ సాగాడు, కాని శహాజీరాజె ఒక్కడే ఎన్నిరోజులు పోరాడగలడు? అతని శక్తి సన్నగిల్ల సాగింది.. అప్పుడు గత్యంతరంలేక 1636 సంవత్సరం లో అతడు మొఘలులతో సంధి చేసుకున్నాడు. శహాజీరాజెకు కాలం అనుకూలంగా లేకపోవుట వలన అతని స్వతంత్ర రాజ్య స్థాపన ప్రయత్నం సాధ్యం కాలేదు. కాని అతని ధైర్యం మూలంగా మరాఠీ ప్రజలలో ఆత్మవిశ్వాసం పెంపొందింది. తరవాత కాలం లో శివాజీ మహారాజుకు ఈ ఆత్మవిశ్వాసం స్వరాజ్య స్థాపన కార్యంలో ఉపయోగపడింది.

**కర్నాటకలో జిజాబాయి మరియు శివాజీ :** శహాజీ రాజు యొక్క నిజాంషాహ రాజ్యం పతనమైన పిమ్మట ఆ ప్రాంతాన్ని మొఘలులు మరియు ఆదిల్‌షాహలు పంచుకొన్నారు. శహాజీ రాజు యొక్క పుణె-సుపె పూర్వపు జాగీరులు ఆదిల్‌షాహ రాజ్యం లోకి వచ్చాయి. అప్పుడు ఆదిల్‌షాహ ఆ జాగీరులను తన తరపున శహాజీ రాజుకు ఇచ్చాడు. ఇప్పుడు శహాజీ రాజు ఆదిల్‌షాహ యొక్క రాజ్యసేవను స్వీకరించాడు. ఆదిల్‌షాహ అతన్ని పుణెకు దూరం గానున్న కర్నాటకలోని ప్రాంతాలను జయించే పనికి నియమించాడు. శహాజీరాజె కర్నాటకు వెళ్లిన తరవాత కొన్నాళ్లకు జిజాబాయి మరియు శివాజీ అతని వద్దకు వెళ్లారు.

శివాజీ బాల్యంలో మహారాష్ట్రలో ఉరుకులు పరుగులతో గడిచింది. నేడు ఒక కోటపై ఉంటే మరునాడు మరొక కోటపై. ఇలా జిజాబాయి, శివాజీల ఉరుకులు, పరుగులు కొనసాగేవి. ఆ సమయంలో తండ్రిగారి పరాక్రమ గాథలు బాలశివాజీ చెవిన పడేవి. కర్నాటకకు వచ్చిన తరువాత ఈ తల్లి బిడ్డలకు కొంత స్థిరత్వం లభించింది. కర్నాటకలోని ఎందరో రాజులను శహాజీరాజు జయించాడు. అప్పుడు ఆదిల్‌షాహ అతనికి బెంగళూరు జాగీరును బహుమానంగా ఇచ్చాడు. అప్పటి నుండి బెంగళూరును శహాజీ రాజు తన ముఖ్య స్థలంగా మార్చుకున్నాడు. అక్కడ అతడు ఒక రాజు వలె వైభవంగా గడుపుతు, కొలువు దీరసాగాడు.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణములోని సరైన పదంతో పూరించండి.**

అ) శివాజీ జననం .................. కోటపై జరిగింది. (పురందర్, శివనేరి, పన్హాల)

ఆ) ఆదిల్‌షాహ శహాజీరాజును .................... ప్రాంతాలను జయించే పనికి నియమించాడు. (కర్నాటకలోని, ఖాందేశ్‌లోని, కొంకణంలోని)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) జిజామాత బోధనల వలన శివాజీ మనసులో ఏ ఆలోచనలు రేకెత్తినాయి?

ఆ) శివాజీ మావళీ పిల్లలతో కలిసి ఏ ఆటలు ఆడుకొనేవాడు?

ఇ) శహాజీరాజు నిజాంషాహ రాజ్యాన్ని ఎందుకు వదిలి పెట్టాడు?

**3. రెండు – మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) జిజాబాయి శివాజీకి ఎవరెవరి కథలు చెప్పేది?

ఆ) శహాజీరాజు నిజాంషాహ వంశంలోని బాలున్ని నిజాంషాహగా ఎందుకు ప్రకటించెను?

**ఉపక్రమం**

అ) శివనేరి కోటకు విజ్ఞాన యాత్రకు వెళ్లండి. అక్కడ శివాజీ జన్మస్థలం వివరాలు తెలుసుకోండి.

ఆ) నీవు ఆడేటటువంటి సంప్రదాయక ఆటలపేర్లు రాయండి. వాటిలో నుండి ఒక ఆట గురించి 10 వాక్యాలలో వివరాలు రాయండి.



శివనేరి కోట – మహాదర్వాజా

# 5. శివాజీ విద్యాభ్యాసం

**శివాజీ విద్యారంభం :** శహాజీరాజె స్వయంగా సంస్కృతంలో ఉద్ధంత పండితుడు. అతడు తన బెంగళూరు దర్బారులో ఎన్నో భాషలకు చెందిన పండితులకు, కళాకారులకు ఆశ్రయమిచ్చాడు. శివాజీ కోసం తెలివైన గురువులను నియమించాడు. అక్కడ ఏడు సంవత్సరాల అనంతరం అతని విద్యాభ్యాసం ప్రారంభమైంది. కొద్దికాలంలోనే శివాజీ చదవటం-రాయటంలో ఆరితేరాడు. రామాయణం, మహాభారతం, భాగవతంలోని కథలు స్వయం గా చదవసాగాడు. శహాజీరాజు శివాజీకి యుద్ధకళ నేర్పించుటకై కొంతమంది గురువులను నియమించాడు. వారు శివాజీకి గుర్రపుస్వారీ, మల్లవిద్య (కుస్తీ), కర్రసాము, కత్తిసాము మొదలగు విద్యలను నేర్పించడం ప్రారంభించారు. ఈ విధంగా పన్నెండేళ్ల వయస్సు వరకు శివాజీకి వివిధ విద్యలు, కళలు అలవడ్డాయి.

తొందరలోనే ఆదిల్‌షాహ కర్నాటకలోని నాయక్‌ల రాజ్యాలను జయించడానికి శహాజీరాజును పురమాయించి పంపాడు. ఈదాడికి వెళ్లేముందు శహాజీరాజు జిజాబాయి, శివాజీలను పుణె జాగీరుకు పంపివేశాడు. ఆ సమయంలో వారితో పాటు శహాజీరాజు ఏనుగులు, గుర్రాలు, కాల్బలం, ద్రవ్యసంపద, పతాకం అటులనే విశ్వాస పాత్రుడైన ప్రధాని, శూరసేనాని, పేరుగాంచిన గురువులను పంపాడు.



శహాజీరాజు పర్యవేక్షణలో శివాజీ విద్యాభ్యాసం

**పుణె సమూల మార్పు :** జిజాబాయి, శివాజీ పుణెకు వచ్చారు. శివాజీకి బాల్యంలోని రోజులు గుర్తుకు వచ్చాయి. బాల్యంలో శివనేరి మట్టిలో ఆడేవాడు. ఎత్తైన సహ్యాద్రి శిఖరాలు అతనికి మళ్లీ కనిపించాయి. అతనికి చాలా చాలా ఆనందం కలిగింది. ఆనాటి కాలంలోని పుణె నేడున్నంత పెద్దగా లేకుండెను. శహాజీరాజు యొక్క శత్రువులు ఆ అందమైన గ్రామాన్ని నిర్మానుష్యం చేసేశారు. గ్రామంలోని ఆస్తులు ధ్వంసమై పోయాయి. ఇళ్ళు కూలిపోయాయి. దేవాలయాలు పడగొట్టబడ్డాయి. శత్రుభయంతో ప్రజలు గ్రామం వదిలి పారిపోయారు. పంటపొలాలు బీడు భూములైనవి. అడవులు పెరిగాయి. అడవిలో తోడేళ్లు విహారం చేయసాగాయి. ఇలా పుణె కడు శిథిలావస్థలో ఉండెను.

జిజాబాయి శివాజీతో పాటు పుణెలో ఉండ సాగెను. ఈ వార్త ఇరుగుపొరుగు గ్రామాలప్రజలకు తెలిసింది. వారికి గొప్పధైర్యం వచ్చింది. జిజాబాయి వారిని పిలుచుకొని ఉత్తేజాన్నిచ్చింది. ప్రజలు మళ్లీ పుణెకి వచ్చి ఉండసాగిరి. పంట పొలాల్లోకి, వ్యవసాయ పనులకు వెళ్లసాగిరి. జిజాబాయి పడిపోయిన దేవాలయాలకు మరమ్మత్తులు చేయించింది. దేవాలయాలలో ఉదయం, సాయంత్రం పూజలు జరిగేవి. గ్రామం ప్రజలతో కళకళలాడసాగెను. దీనితో పుణె యొక్క రూపం మారిపోయింది.

**దాదాజీ కొండదేవ్ కార్యకుశలత :** జిజాబాయి, శివాజీ కర్నాటకలో ఉంటున్నప్పుడు పుణె జాగీరు వ్యవహారాలను దాదాజీ కొండదేవ్ చూస్తుండేవాడు. అతడు కొంఢాణా యొక్క సుబేదారుగా కూడా ఉండెను. అతడు విశ్వాస పాత్రుడైన సేవకుడు. పరిపాలనా దక్షత కలిగిన వాడు. ధర్మమెరిగినవాడు. అతని క్రమ శిక్షణ కఠినముగా ఉండేది. అతడు చాలా నేర్పరి. ఆ కాలంలో శహాజీరాజు ఆదేశానుసారం పుణెలో ఒక పెద్ద భవనం నిర్మించాడు. దానిపేరు లాల్‌మహల్. రైతులు పొలాలలో సాగు చేయుటకై దాదాజీ వారికి కొన్ని సంవత్సరాలు భూమి శిస్తును రద్దు చేశాడు. దాని మూలంగా భూములు పంట పొలాలుగా మారాయి. అధికమైన తోడేళ్లు రైతులకు ఆటంకం కలిగిస్తాయని తోడేళ్లను చంపడానికి అతడు బహుమానాలు ఏర్పాటు చేశాడు. తత్ఫలితం గా అనేక తోడేళ్లు చంపబడినవి. దొంగలు విరివిగా పెరిగిపోయారు. దాదాజీ రైతుల దండు నిర్మించి వారిని కాపలాగా ఉంచి దొంగలను అడ్డుకున్నాడు. నేల సారాన్ని బట్టి పన్ను నిర్ణయించాడు. ఈ విధానం వల్ల ప్రజలకు ఆనందం కలిగింది. దాదాజీ కోండదేవ్, నిజాంషా మంత్రి (వజీరు) మలిక్ అంబర్‌లు వ్యవసాయాభివృద్ధి మరియు భూమిశిస్తు వసూలులాంటి రంగాలలో చేసిన కృషి అమోఘమైనది, మూలాధారమైనదిగా భావిస్తారు.

**శివాజీ విద్యాభ్యాసం :** శివాజీ పుణె జాగీరుకు వచ్చెను. అయినప్పటికి జిజాబాయి కనుసన్నలలో అతని విద్యాభ్యాసం సాగుతు ఉండెను. బెంగళూరు నుండి వచ్చుచున్నపుడు శహాజీరాజు తమ వెంట పంపిన ప్రసిద్ధి చెందిన గురువులు శివాజీకి ఎన్నో శాస్త్రములను, విద్యలను, భాషలను నేర్పించారు.

ఉత్తమ రాజ్యపాలన ఎలా చేయాలి? శత్రువులతో యుద్ధం ఎలా చేయాలి? కోటలను ఎలా నిర్మించాలి? గుర్రాలను, ఏనుగులను ఎలా పరీక్షించాలి? శత్రువుల అభేద్య ప్రదేశాల నుండి ఎలా తప్పించు కోవాలి మొదలగు ఎన్నో విద్యలు శివాజీకి అవగతమయ్యాయి. శివాజీ శిక్షణలోని ఈ ప్రగతిని చూచి జిజాబాయికి మిక్కిలి ఆనందం కలిగింది.

**వీరమాత జిజాబాయి శివాజీకి బోధించుట :** జిజాబాయి సాధారణ స్త్రీ కాదు. ఆమె బలోపేతమైన సర్దారగు లఖూజీజాధవ్ కుమార్తె. పరాక్రమ

వంతుడైన శహాజీరాజు భార్య. రాజకీయ, యుద్ధనీతి తర్ఫీదు జిజాబాయికి చిన్నప్పుడే అందింది. ప్రసిద్ధ వంశాలైన జాధవ్, భోస్లేల ధైర్యసాహసాలు, సంస్కృతులు మిళితమై ఆమెలో ఇమిడి యుండేవి. జిజాబాయి గొప్ప స్వాభిమానురాలు, స్వాతంత్ర్య వాంఛగలది. మరాఠా సర్ధారులు ఎంత పోరాడినా సుల్తానుల దర్బారులో ఫలితం దక్కేది కాదు. ఇలాంటి చేదు అనుభవాలు ఆమె చూసి యుండెను. నిజాంషాహ నిండు సభలో ఆమె తండ్రిని హత్యగావించాడు. ఆ దుఃఖాన్ని ఆమె దిగమింగు కొన్నది. తన కుమారుడైన శివాజీ ఇలాంటి పరాయి పాలకుల పంచన సేవ చేయకూడదని ఆమె నిర్ణయించుకుంది. అంతే కాకుండా అతడు స్వయంగా ప్రజల రాజ్యాన్ని అనగా స్వరాజ్యాన్నీ స్థాపించాలనే ఆలోచనతో శివాజీని తీర్చి దిద్దసాగింది.

మావళ ప్రాంతంలో ఉండే ప్రజలను మావళీలు అంటారు. మావళీలు విశ్వాస పాత్రులు, కష్టజీవులు, చురుకైనవారు. కష్టించి పని చేయుటలో అందెవేసిన చేయి వారిది. అయినప్పటికి వారు సుల్తానుల రాజ్యపాలనలో బాధలు పడ్డారు. సుల్తానుల సైన్యాలు గ్రామాలకు గ్రామాలనే దోచుకొనేవి. ప్రజలు వలస వెళ్లేవారు. దానిని అడ్డుకునే వారు లేరు. ఇలా కష్టాలు పడే ప్రజల కోసం ఏదైనా చేయాలని శివాజీకి అనిపించేది.

ఇంటికి వచ్చిన తరువాత శివాజీ జిజామాతతో చర్చించేవాడు. జిజామాత అనేది "శివబా, భోస్లేల పూర్వజుడు శ్రీరామచంద్రుడు. ఆ శ్రీరాముడు దుష్ట రావణుని చంపి ప్రజలను సుఖపెట్టాడు. జాధవుల పూర్వజుడు శ్రీకృష్ణుడు. అతడు దుష్ట కంసుని చంపి ప్రజలను సంతోష పరచాడు. నీవు శ్రీరాముని,శ్రీకృష్ణుని వంశంలో పుట్టినవాడవు. నీవు కూడా దుర్మార్గులను నాశనం చేయగలవు. నీవు



వీరమాత జిజాబాయి

కూడా పేద ప్రజలను చాలా సుఖపెట్టగలవు".

తల్లి ఈ ఉపదేశాలు శివాజీని ఉత్తేజ పరచేవి. రాముడు, కృష్ణుడు, భీముడు, అర్జునుడు మున్నగు వీరుల గాథలు గుర్తుకు వచ్చేవి. ఈ వీర పురుషులు శివాజీకి ఎల్లప్పుడు చేతనావస్థలో, మనసులో, స్వప్నాలలో మెదిలేవారు. వారు అన్యాయాలకు వ్యతిరేకంగా ఎలా పోరాడారో తాను కూడా అలా పోరాడాలి. వారు దుష్టులను నాశనం చేసిన విధంగా తాను కూడా చేయాలి. వారు ప్రజలను సుఖపెట్టిన విధంగా తాను కూడా ప్రజలను సుఖపెట్టాలి. తను ధర్మాత్ముడు, ధైర్యవంతుడు, పరాక్రమ వంతుడు కావాలి అని శివాజీకి ఎప్పుడూ అనిపించేది.

**శివాజీ నూతన అధికారం :** పుణె జాగీరులో ఇప్పుడు జిజాబాయి మార్గ దర్శనంలో శివాజీ పాలన మొదలైంది. ఈ పరిస్థితి ముందే గ్రహించి శహాజీరాజు అన్ని ఏర్పాట్లు గావించాడు. అతడు శివాజీని బెంగళూరు నుండి పుణెకు పంపునపుడు సామ్‌రాజ్ నీలకంఠ్ పేశ్వా, బాలకృష్ణ హనుమంత ముజుందార్, మాణ్కోజీ దహాతోండే సర్నోబత్, రఘునాథ్ బల్లాల్ సబ్‌నీస్, సోనోపంత్ డబీర్ అను ముఖ్యుల బృందాన్ని వెంటపంపెను. వీరందరు స్వతంత్ర రాజు యొక్క అధికారులే. శివాజీ తన జాగీరు పరిపాలన సమర్థవంతంగా చూచుకొనుటకై శహాజీరాజు ఈ అధికారులను పుణెకు పంపాడు. వారి సహాయంతో శివాజీ జాగీరు యొక్క పాలన చూడసాగాడు. ప్రజల సుఖ దుఃఖాలపై దృష్టి సారించబడింది. ప్రజలపై అన్యాయాలు చేసే వారు శిక్షించబడుచుండిరి. ఒక రకంగా శహాజీరాజు యొక్క జాగీరు ఆమూలాగ్రం మార్పు చెందు చుండెను. మున్ముందు రాబోయే స్వరాజ్య స్థాపన యొక్క నమూనాను చూసే భాగ్యం మావళీలకు కలిగింది. ఇదే స్వరాజ్యం యొక్క అరుణోదయమని చెప్పవచ్చు.

**శివాజీ వివాహం :** ఆ రోజుల్లో చిన్న వయసులో వివాహం చేసే పద్ధతి ఉండేది. "మా శివాజీ పదునాలుగు సంవత్సరాల వాడైనాడు. ఇక అతనిని ఒక ఇంటి వాడిని చేయాలి" అని జిజామాత అనెను. శివాజీ కొరకు వధువును చూడసాగెను. ఒక కన్య ఆమెకు నచ్చింది. ఆమె పేరు సయీబాయి, పల్టణ్ నాయిక్ నింబాల్కర్ వంశస్థురాలు. వారి వివాహం అత్యంత వైభవంగా జరిగింది.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదంతో రాయండి.**

అ) శహాజీరాజు ............. ఉద్దండ పండితుడు.

(సంస్కృతం, కన్నడంలో, తమిళంలో)

ఆ) మావళప్రాంతంలో ఉండే ప్రజలను ............. అంటారు.

(రైతులు, సైనికులు, మావళీలు)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శివాజీ విద్యాభ్యాసం కొరకు గురువులను ఎవరు, ఎక్కడ నియమించారు?

ఆ) శివాజీ గురువులు ఏ విద్యలను నేర్పనారంభించారు?

ఇ) దాదాజీ కొండదేవ్ రైతులకు భూమిశిస్తు ఎందుకు రద్దు చేశాడు?

**3. రెండు-మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) పుణె రూపురేఖలు ఎలా మార్పు చెందెను?

ఆ) శివాజీకి ఏ విద్యలు అవగతమైనవి?

ఇ) జిజాబాయి ఏమని నిర్ణయించుకొనెను?

**ఉపక్రమం**

అ) జిజాబాయి, శివాజీల మధ్య సంభాషణను ప్రదర్శించండి.

ఆ) వీరమాత జిజాబాయి యొక్క చరిత్రను చదవండి.

# 6. స్వరాజ్య స్థాపనకై శపథం

**రాయరేశ్వర ఆలయం :** పుణెకు నైఋతి దిశలో ఉన్న రాయరేశ్వర దేవాలయం గొప్ప రమణీయ స్థానం అక్కడ 1645వ సంవత్సరం లో ఒక అసాధారణ సంఘటన జరిగింది. శివాజీ మరియు కొంత మంది మావళీలు పరిసర లోయల నుండి చర్చించుటకు అక్కడ సమావేశమయ్యారు. ఆ దట్టమైన అడవిలో చెట్ల పొదలలో ఎవరికీ తెలియని రాయరేశ్వర దేవాలయంలో శివాజీతో మావళీలు ఏ విషయాన్ని గూర్చి చర్చించు చుండిరి? వారు శివుని కోరిన కోరికలేవి?

**బాల శివాజీ ఉద్రేక పూరిత ప్రసంగం :** శివాజీ చిన్న వయస్కుడైనప్పటికిని గొప్ప విషయాలను గూర్చి ఆలోచించడంలో లీనమయ్యేవాడు. అతడు తన స్నేహితులతో మనసు విప్పి ఈ విధంగా చెప్పాడు. ప్రియ మిత్రులారా! ఎంతోకాలంగా నా మనస్సులో ఉన్న ఆలోచనను ఈ రోజు మీకు చెప్పొచ్చా? నా తండ్రి శహాజీ బీజాపూర్‌సంస్థానంలో సర్దారుగా ఉన్నాడు. అతడే ఈ జాగీరు బాధ్యతలను నాకు అప్పగించాడు. అంతా ప్రశాంతంగా జరిగిపోవుచున్నది. కానీ స్నేహితులారా! నాకు ఏ మాత్రం సంతోషం లేదు. మనం నిత్యం సుల్తానుకు బానిసలుగా ఉండుటతోనే తృప్తిపడవలసిం దేనా? మనం ఎల్లప్పుడు ఇతరుల దోసిలిలోని నీరు తాగవలసిందేనా? మనం నాలుగు దిక్కులా పరాయి రాజ్యములచే ఆవరింపబడి యున్నాము. ఆ రాజ్యాలలో ఎల్లప్పుడూ యుద్ధాలు జరుగుచున్నవి. నిష్కారణంగా మన ప్రజలు ఈ యుద్ధాలలో చనిపోవుచున్నారు. అనేక కుటుంబాలు దేశాన్ని వదలి వెళ్లుచున్నాయి. మన దేశం నాశనమగుతున్నది. ఇన్ని బాధలు పడటం వల్ల మనకు ఏమి లభిస్తుంది? బానిస బ్రతుకు మాత్రమే కదా! ఇలా ఎంత కాలం సహించగలం? ఎన్నాళ్లని మనం ఇతరుల కొరకు ప్రాణత్యాగం చేయాలి? మీరే చెప్పండి. దేశం పట్ల స్వార్థంతో దీన్ని ఇలాగా కొనసాగించనీయవలెనా?

శివాజీ ఆవేశపూరితంగా మాట్లాడు చుండెను. అతని ముఖం కోపంతో ఎర్రబారి యుండెను. మధ్యలో తన ఉపన్యాసం ఆపి తన సహచరులను గమనించెను. రాయరేశ్వరుని గర్భగుడిలో సమావేశమై యున్న మావళీలు శివాజీ ఉపన్యాసం విని ఉత్తేజితులయ్యారు. వారి ఆలోచనలు మార్పు చెందసాగెను. అప్పుడు వారిలో ఒకరు "చెప్పండి, యువరాజా! చెప్పండి. మీ మనస్సులో ఏమి ఉన్నదో విశదంగా చెప్పండి. మీరు ఏం చెప్పినా వెంటనే చేయడానికి మేము ఒంటి కాలుపై సిద్ధంగా ఉన్నాం" అని పలికిరి. అక్కడ ఉన్న వారంతా ఏక కంఠంతో "ఔను రాజా! మా ప్రాణాలను త్యాగం చేసైనా మీరు చెప్పింది చేయడానికి సిద్ధంగా ఉన్నాం", అని పలికారు.

**స్వరాజ్య శపథం :** మావళీల మాటల వల్ల శివాజీ నూతనోత్సాహం పొందాడు. అతడు ప్రతి ఒకరిని చూస్తూ ఆనందంగా "మిత్రులారా, మన మార్గం తేటతెల్లం. మన లక్ష్యసాధన కొరకు మనమందరం స్థిరంగా పోరాడుదాం. ఎంతైనా శ్రమిద్దాం. చివరికి ప్రాణాలను అర్పించడానికైనా సిద్ధపడాలి. మన లక్ష్యం 'హైందవ స్వరాజ్యం'! మీరు, నేను స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాలి. ఇక బానిసలుగా బతుక వద్దు. లేవండి మన స్వతంత్ర రాజ్యం స్థాపించవలెనను మహత్తర కార్యానికి అంకిత మౌదాముని రాయరేశ్వర స్వామి సమక్షంలో శపథం చేద్దాం" అని పలికెను.

శివాజీ పలుకులతో దేవాలయం అంతా ప్రతి ధ్వనించింది. "ఈ రాజ్యం హైందవ స్వరాజ్యం గా రూపొందాలన్నది దేవుని అభిమతం. దేవుని అభిమతాన్ని నెరవేరుటకు మనమందరం ప్రయత్నిం చాలి" అని శివాజీ చివరగా నిశ్చయ పూర్వకంగా అనెను.



స్వరాజ్య స్థాపన ప్రతిజ్ఞ

అటు పిమ్మట మావళీలు స్వరాజ్య శపథమునకు కట్టుబడిన వారై రాయరేశ్వర దేవాలయం నుండి బయటపడ్డారు. శివాజీ మనస్సు అమితానందంతో నిండిపోయింది. శివాజీ పుణెకు చేరిన వెంటనే తల్లిని చూచుటకు సరాసరి లాల్‌మహల్‌కు వెళ్లాడు. రాయరేశ్వర ఆలయంలో జరిగినదంతా తల్లి జిజాబాయికి వివరించాడు. ఆ తల్లికి ఎంతో సంతోషం కలిగింది. తన మనస్సులో ఉన్న కోరికను శివాజీ తప్పక నెరవేర్చుననే ఆశ, విశ్వాసం ఆమెకు కలుగసాగింది.

**మావళీ లోయలో యుద్ధ సన్నాహాలు :** శివాజీ వెంటనే తన లక్ష్య సాధనలో నిమగ్నుడయ్యాడు. తన సహచరులతో పాటు కత్తిసాములోను, గుర్రపు స్వారిలోను సాధన చేసేవాడు. కొండ ప్రాంతంలోని లోయలు, కనుమలు అందులోని అడ్డదారులు, నైసర్గిక వివరాలు మొదలగు వాటిపై అతడు ప్రతిరోజు క్షుణ్ణమైన పరిశీలన చేయనారంభించారు. శివాజీ మావళీల అంతరంగాలను చూరగొన్నారు. మావళీలు శివాజీ కొరకు పిచ్చివారయ్యారు. శివాజీ కొరకే జీవిద్దాం, శివాజీ కొరకే మరణిద్దాం అని నిశ్చయించుకొన్నారు. ఇక శివాజీ కార్యకలాపాలు సముద్రం ఉప్పొంగినట్లుగా ఊపందుకొన్నాయి. శివాజీ పుణె చుట్టుప్రక్కల గల కోటలన్నింటిని తన అనుచరులతో కలిసి సూక్ష్మదృష్టితో పరిశీలించాడు. రహస్యదారులు, సొరంగ మార్గాలు, భూగర్భ స్థావరాలు, యుద్ధ సామాగ్రి, ఆయుధాలు, శత్రుసైన్యాల విడిదులను గురించి స్పష్టమైన సమాచారాన్ని తెలుసుకొన్నాడు.

**మావళీమిత్రులు :** పన్నెండు మావళీ ప్రాంతాలలో దేశ్‌ముఖ్‌ల బృందం తమ తమ జాగీర్లను కాపాడు కొనుటలోనే నిమగ్నమైయుండెను.వారికితమజాగీర్లపై అధికమైన మోహం ఉండెను. జాగీర్లకోసం తమలో తాము కలహించుకొనేవారు. ఈ కలహాలలో మరాఠీల శక్తి వ్యర్థమౌతుందని శివాజీ గ్రహించాడు. శివాజీ ఈ కలహాలను రూపు మాపాలని నిశ్చయించుకొన్నాడు. శివాజీ దేశ్‌ముఖ్‌ల గ్రామాలను సందర్శించి వారు చేయుచున్న తెలివి తక్కువ పనులను విడనాడమని చెప్పేవాడు. స్వరాజ్య సాధన లక్ష్యాన్ని వారిలో కలిగించాడు. శివాజీ ఆత్మీయతతో మాట్లాడుతూ వారిని తనవాళ్లుగా మలచుకొన్నాడు. కాని కొందరు వ్యతిరేకించారు. వారిని కూడా శివాజీ బలప్రయోగంతో తనవైపు తిప్పుకొన్నాడు. మరాఠీయుల అంతర్గత కలహాలను అతడు మాన్పించాడు. అందరు అతన్ని అభినందించ సాగారు. మావళీ లోయలోని జుంజార్‌రావు మరల్, హైబత్‌రావ్ శిలంకర్, బాజీపాసల్కర్, విఠోజీ శితోళే, జెధే, పాయ్‌గుడె, బాందల్ మొదలగు దేశ్‌ముఖ్‌లు శివాజీ ఆజ్ఞలను పాటించసాగారు. మావళీలలో స్వరాజ్య భావన ఉరకలెత్తింది.

**శివాజీ రాజముద్ర :** శివాజీ పేరున జాగీరు పరిపాలన ప్రారంభమైంది. శహాజీరాజు శివాజీ యొక్క స్వతంత్ర రాజముద్రను తయారు చేసెను. ఆ ముద్ర

ప్రతి పచ్చంద్ర లేఖేవ వర్ధి ష్ణుర్విశ్వవందితా॥
శాహసూనోః శివస్యైషా ముద్ర భద్రాయ రాజతే॥



రాజముద్ర

శుక్లపక్ష చంద్రుని వలె వర్ధిల్లే ఈ రాజముద్ర ప్రజా సంక్షేమం కోసమే సమస్త లోకానికిది పూజ్యనీయమౌతుంది. అని చెప్పే ఆ రాజముద్ర స్వరాజ్యస్థాపనకు సంకేతం.

ఆ రోజుల్లో రాజముద్రలు అధికంగా పర్షియన్(పార్సీ) భాషలో లిఖింపబడేవి. కాని శివాజీ ముద్ర సంస్కృత భాషలో లిఖింపబడింది.

స్వరాజ్యంతోబాటు సొంత భాష, సొంత మతం అవసరం. అటులనే ఇతర మతాలపై ద్వేషం ఉండకూడదు. శివాజీ తన పరిపాలన ప్రజా సంక్షేమం కోసమే ప్రారంభించాడని మావళీలకు వెంటనే అర్థమైంది.

## అభ్యాసం

**1. ఖాళీలను సరైన పదంతో రాయండి.**

అ) పుణెకు నైఋతి దిశలో ఉన్న ............. దేవాలయం గొప్ప రమణీయ స్థానం.

ఆ) మావళ ప్రాంతాలలో ............. బృందం తమ జాగీరులను కాపాడు కొనుటలో నిమగ్నమై వుండిరి.

ఇ) శహాజీరాజు శివాజీ యొక్క స్వతంత్ర ............. తయారుచేసెను.

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) రాయరేశ్వర దేవాలయంలో శివాజీ చివరకు నిశ్చయ పూర్వకంగా ఏమనెను?

ఆ) జిజాబాయికి ఏమని విశ్వాసం కలుగసాగింది?

ఇ) శివాజీ ఏయే విషయాల గురించి స్పష్టమైన సమాచారం సేకరించాడు?

ఈ) శివాజీ వేటిని రూపుమాపాలని నిశ్చయించుకొనెను?

**3. రెండు – మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) శివాజీ లక్ష్యం ఏమిటి?

ఆ) శివాజీ ప్రతిరోజు వేటిని క్షుణ్ణంగా పరిశీలించనారంభించాడు?

### ఉపక్రమం

ఉపాధ్యాయుని సహాయంతో స్వరాజ్య స్థాపన ఉదంతమును చిత్రించుము.

# 7. స్వరాజ్యమునకు శంకుస్థాపన

రాయరేశ్వరాలయంలో శివాజీ తన అనుచరులతో పాటు స్వరాజ్య శపథం చేశాడు. కాని అది ఎంతో కష్టసాధ్యమైన పని. ఆరోజుల్లో ఢిల్లీని పాలించు మొఘలు చక్రవర్తి, బీజాపూర్ సుల్తాన్ ఆదిల్‌షాహ, గోవాను పాలించు పోర్చుగీసు వారు, జంజీరాను పాలించు సిద్దీ అనే నాలుగు రాజ్యాలు మహారాష్ట్రమును పాలించు చుండెడివి. వారు శక్తి వంతులైన పరిపాలకులు. వారి అధికారమునకు తిరుగులేదు. వారిని ఎదిరించి పల్లెత్తు మాట అనుటకు కూడా ఎవరికి సాహసం లేదు. అటువంటి క్లిష్ట పరిస్థితులలో శివాజీ స్వరాజ్య శపథం చేశాడు. అపారమైన శత్రుసైన్యమెక్కడా? అల్పసైన్యం గల శివాజీ మావళీలు ఎక్కడ? కాని శివాజీ దృఢ సంకల్పమే అతనికి గొప్ప మనోబలం చేకూర్చింది.

**తోరణ కోట :** శివాజీ అధీనంలో పుణె, సుపె, చాకణ్ ఇందాపూర్ జాగీరులు ఉండేవి. కాని ఆ జాగీరులలోని కోటలన్నియు బీజాపూర్‌సంస్థాన అధికారుల చేతుల్లో ఉండేవి. కోటలు స్వాధీనంలో లేనప్పుడు స్వరాజ్యమెట్లు ప్రాప్తించును? కోటలు ఎవరి చేతుల్లో ఉంటే వారిదే రాజ్యం. కోటలు ఆధీనం లో ఉన్నప్పుడు పరిసర ప్రాంతాలపై అధికారాన్ని చెలాయించవచ్చును. కోట అనేది రాజ్యానికి ముఖ్య ఆధారమవుతుంది. అందుకే శివాజీ ఏదో ఒక బలమైన కోటను (దుర్గం) త్వరగా జయించాలని మనసులో నిర్ణయించుకొన్నాడు. శివాజీ కనుల ముందు తోరణ కోట కనిపించింది. అది పుణేకు నైఋతి దిశలో అరవై నాలుగు కిలోమీటర్ల దూరం లో కానద్‌లోయలో ఉంది. కొండ కోనలలో అన్నిటి కంటే తోరణాకోట రక్షణకు మిక్కిలి అనుకూలంగా ఉండెను. ఆ కోటపై రెండు దృఢమైన బురుజులు ఉండెను. ఆ బురుజులలో ఒకటి ఝుంజార్ బురుజు మరొకటి బుదల బురుజు. బురుజు అనగా కోట యొక్క ఎత్తైన భాగంపై ప్రకృతి రీత్యా ఏర్పడిన చదునైన స్థలం. ఝుంజార్ బురుజు పేరుకు తగినట్లుగా



**తోరణా కోట (ఝుంజార్ బురుజు)**

శత్రుదాడి నుండి రక్షణనిస్తుంది. కోట నుండి క్రిందికి దిగుటకు ఒకే మార్గం కలదు. అది ఝుంజార్ బురుజు నుండే. అది చాలా కఠినమైన మార్గం. ఆ మార్గంలో ఏ మాత్రం అజాగ్రత్తగా నడిచినా కాలుజారి అగాధమైన లోయలో పడిపోతారు. మహారాష్ట్రలోని బలమైన కోటలలో తోరణకోట ఒకటిగా పరిగణింపబడుతున్నది. ఆ కోటలో తోరణజాయి అనే దేవి ఆలయం కలదు. అందువల్ల ఈ కోట తోరణా కోట అని పిలువబడింది. అది ఎంతో బలమైన కోట. అయినా ఆదిల్‌షాహ దీనిపై ఎక్కువ దృష్టి పెట్టలేదు. దాని రక్షణకు తగిన సైన్యంగాని, ఆయుధ సామాగ్రిగాని లేదు. శివాజీ ఇది అంతయూ చూచి తెలుసుకొన్నాడు. శివాజీకి ముఖ్యంగా కావాల్సింది ఇదే. తోరణా కోటను జయించి స్వరాజ్యమునకు పునాది వేయదలచుకొన్నాడు.

**స్వరాజ్య భేరీలు మ్రోగుట :** శివాజీ తాను ఎన్నుకొన్న మావళీదళంతో కానద్‌లోయలోకి దిగాడు. మావళీలతో సహా సింహంవలె ధైర్యంతో, లేళ్లవలె వేగంతో పైకి ఎగబ్రాకి కోటలోని కీలక స్థానాలను మావళీలు వశపరచుకొన్నారు. తానాజీ మాలుసరే కోట ముఖ ద్వారంపై మరాఠా పతాకాన్ని ఎగురవేశాడు. శివాజీ విశ్వాస పాత్రుడు, నమ్మిన బంటు అయిన ఏసాజి కంక్‌ను కీలక స్థానాలందు కాపలా ఉంచాడు. కోట సాధీనమైంది. శివాజీ మహారాజుకి జై అనే నినాదములు మిన్నంటాయి. హైందవ స్వరాజ్యపు మొదటి యుద్ధ భేరీలు, బాకాల ధ్వనులు సహ్యాద్రి లోయల్లో అంతటా ప్రతిధ్వనించాయి. శివాజీ ఈ కోటకు ప్రచండ గడ్ అని పేరుపెట్టాడు.

**భవానీ దేవి ఆశీస్సులు :** తోరణా కోటపై శివాజీ పరిపాలన ప్రాంభమైంది. అతడు కోటను జాగ్రత్తగా పరిశీలించాడు. ఆ కోటపై మరాఠా కిల్లేదారును, బ్రాహ్మణ సబ్‌నీస్‌ను, ప్రభు కార్కానీస్ మొదలగు అధికారులను నియమించాడు. మావళీలు, కోళీలు, రామోశీలు, మహార్‌లు మొదలగు వెనుకబడిన జాతులకు చెందిన, సాహస వంతులను సైన్యంలో నియమించాడు. స్వరాజ్యసైన్యంలో జాతి, కుల అనే బేధ భావాలు లేవు. కోటకు మరమ్మత్తులు ప్రారంభం కాగానే ఒక ఆశ్చర్యం జరిగింది. పని కొనసాగుచుండగా మొహరీ (నాణెము)లతో నిండుగా నింపబడిన నాలుగు కడవలు కోటలో దొరికాయి. పనివారు ఎంతో ఆనందించారు. శివాజీ తలపెట్టిన ప్రయత్నాలకు భవాని దేవి ఆశీర్వదించి ఇచ్చిన బహుమతి ఈ ధనం. అని అందరూ చెప్పుకొన్నారు. పని వారు సంతోషంగా ధనంతో నిండిన కడవలను, శివాజీవద్దకు తీసుకొని వచ్చారు. ఒక్క నాణెమును కూడా ముట్టలేదెవరు. అది స్వరాజ్యధనమని భావించారు. వారు ఈ ధనాన్ని తమ స్వామి పరం చేశారు. స్వరాజ్య కార్యం కొరకు అనుకోకుండా ఇంతధనం లభించిందని శివాజీకి ఉత్సాహం కలిగింది. తాను చేయుచున్న కార్యానికి భవానీదేవి ఆశీస్సులు కలవని భావించాడు.

ఈ ధనము స్వరాజ్యానికి పనికి వచ్చింది. ఈ ధనంతో శివాజీ ఆయుధాలు, యుద్ధ సామాగ్రిని కొనుకోలు చేసాడు. మిగిలిన ధనాన్ని తాను తలపెట్టిన మరొక పథకానికి వినియోగింప నిశ్చయించుకొన్నాడు. తోరణా కోటకు తూర్పు దిశలో, సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో మురుంబదేవ్ అను కొండ కలదు. శివాజీ ఎప్పటి నుండియో దానిపై దృష్టి సారించి యుండెను. ఆ కొండ చాలా ఎత్తుగా, దుర్భేద్యంగా, ముఖ్యమైందిగా ఉండెను. ఆదిల్‌షాహ ఆ కొండపై ఒక కోట కట్టనారంభించి పూర్తి చేయక మధ్యలో ఆపివేశాడు. ఆ కోటపై కూడా కాపలా పటిష్టంగా లేదు. స్వరాజ్య రాజధాని కొరకు ఈ కోటను స్వాధీనం చేసుకోవాలని శివాజీ నిశ్చయించుకొనెను.

**స్వరాజ్యపు మొదటి రాజధాని :** ఒక రోజు శివాజీ తాను ఎన్నుకొన్న అనుచరుల దళంతో కొండ నెక్కి, కోటను తన స్వాధీనం చేసుకొన్నాడు. తోరణ ధుర్గంలో లభించిన కొంత ధనాన్ని మురుంబదేవి నిర్మాణానికి



రాజ్‌గడ్ – పాలీ దర్వాజా

ఉపయోగించాడు. శివాజీ ఈ కోటకు రాజగడ్ అనిపేరు పెట్టాడు. కోటపై రాతి పనివారు రాళ్లను సిద్ధం చేశారు. కమ్మరులు కొలిమిలు రాజేశారు. వడ్రంగులు, ఇండ్లు కట్టువారు, కూలి వారు, నీళ్లు మోసుకొచ్చేవారు. ఇలా అనేక మంది పనిలో నిమగ్నమయ్యారు. రాజమహల్, బారామహల్, పద్దెనిమిది కర్మాగారాల నిర్మాణంతో పాటు రాజసింహాసనం కూడ తయారు చేశారు. స్వరాజ్యానికి మొదటి రాజధానిగా రాజగడ్ ముస్తాబైంది.

**స్వరాజ్య విస్తరణ :** శివాజీ స్వరాజ్య విస్తరణ వేగవంతమైంది. మావళంలోని ఒక్కొక్క కోటను స్వాధీనం చేసుకొంటూ పన్నెండు కోటలను వశపరచుకొన్నాడు. ఈ పన్నెండు మావళంలలో ఆనందోత్సహాలు వెల్లివిరిసాయి. ప్రతి గ్రామంలోని పాటిల్, దేశ్‌ముఖులు శివాజీకి విశ్వాస పాత్రులుగా ఉండుటకు అంగీకరించిరి. కానీ బియ్యంలో మెరికలు ఉన్నట్లు మావళీలలో కూడా కొందరు దుష్టులుం డిరి. వారికి శివాజీ ఎదుగుదలను చూసి కడుపు మండసాగింది. వారు శిర్వల్ యొక్క ఆదిల్‌షాహ ఠాణెదారుకు శివాజీకి వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఠాణేదారు బీజాపూర్‌కు దూతలను పంపి శివాజీ యొక్క తిరుగుబాటును గురించి వాస్తవాన్ని ఆదిల్‌షాహకు తెలియపరచారు.

**శివాజీ చాతుర్యం :** ఈ వార్తవిన్న ఆదిల్‌షాహ ఆశ్చర్యపడెను. అతడు శహాజీ రాజును సంజాయిషీ చెప్పమన్నాడు. శహాజీరాజుకు గొప్ప సమస్య వచ్చి పడింది. కాని అతడు సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. 'జాగీరును రక్షించుటకు మనవద్ద ఒక కోటకూడా లేదు. అందువల్ల శివాజీ రాజు ఆ కోటను తీసికొని యుండవచ్చు' అని శహాజీరాజు ఆదిల్‌షాహకు తెలిపెను. శివాజీ కూడా ఆదిల్‌షాహ వద్దకు దూతను పంపాడు. 'జాగీరు పరిపాలన సక్రమంగా నిర్వర్తించుటకు మేము ఈ కోటను తీసుకొన్నాం. ఇది కేవలం ఆదిల్‌షాహ మేలు కొరకే గానీ వేరే ఉద్దేశ్యంలేదు' అని చమత్కారంగా శివాజీ తన సందేశాన్ని ఆదిల్‌షాహకు పంపాడు.

కొంఢాణా, పురంధర్ అను ముఖ్యమైన రెండు కోటలను కూడా శివాజీ చాతుర్యంతో తన కైవసం చేసుకొన్నాడు. ఆ తరువాత రోహిడా కోటను వశపరచుకొన్నాడు. స్వరాజ్య విస్తరణను శీఘ్రంగా కొనసాగించాడు.

**1. ఖాళీలను కుండలీకరణములోని సరైన పదంతో రాయండి.**

అ) శివాజీ వద్ద పుణె, సుపె, చాకణ్ మరియు ............. జాగీరులు ఉండేవి.

(ఇందాపూర్, సాస్వడ్, పెల్లే)

ఆ) శివాజీ ............. ను జయించి స్వరాజ్యానికి పునాది వేయాలని నిశ్చయించు కున్నాడు.

(సింహగడ్, శివనేరి, తోరణా)

ఇ) స్వరాజ్యం యొక్క మొదటి రాజధానిగా ............. ముస్తాబైంది.

(రాజగడ్, రాయగడ్, ప్రతాపగడ్)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) మహారాష్ట్రను ఏ నాలుగు రాజ్యాలు పరిపాలించుచుండేవి?

ఆ) శివాజీ తోరణా కోటపైన ఏయే అధికారులను నియమించెను?

ఇ) శివాజీ ఆదిల్‌షాహకు ఏమని సందేశం పంపెను?

**3. కారణాలు రాయండి.**

అ) స్వరాజ్యానికి పునాది వేయడానికి శివాజీ తోరణా కోటను ఎన్నుకొనెను.

ఆ) తోరణా కోటపై దొరికిన నాణెములతో నిండిన కడవలను పనివారు శివాజీ వద్దకు తీసుకెళ్లిరి.

**ఉపక్రమం**

ఉపాధ్యాయుల సహాయంతో మీ పరిసరాలలోని కోటపైకి విజ్ఞాన యాత్రను నిర్వహించండి.

LS2FTQ

# 8. అంతర్గత శత్రువుల అణచివేత

**బలప్రయోగం :** శివాజీకి అండగా నిలుచుటకు పన్నెండు మావళంలలోని మావళీలు ఏకమయ్యారు. వారు శివాజీ చెప్పిన పని చేస్తుండేవారు. స్వరాజ్యం కొరకు జీవించుట, స్వరాజ్యం కొరకు ప్రాణాలు అర్పించుటకు కూడా వారు సిద్ధపడేవారు. వారు నిరాడంబర మరాఠీ మనుషులు. వారికి శివాజీ అంటే ప్రాణంకన్నా మిన్నా. కాని కొందరికి సహజంగానే శివాజీ కార్యములపై ద్వేషం కలుగుచుండేది. అటువంటి వారిని లొంగదీయుట శివాజీకి తప్పలేదు.

ఆదిల్‌షాహ కొలువులో ఖండోజీ మరియు బాజీఘోర్పడే అను సర్దారులుండిరి. ఆదిల్‌షాహ వారిని శివాజీపై పురికొల్పాడు. వారు కొంఢాణా ప్రాంతంలో అరాచకాన్ని సృష్టించారు. కాని శివాజీ వారి ఆటలను సాగనివ్వలేదు. వారిని ఓడించి అచట నుండి తరిమి వేశారు.

అదే విధంగా పల్టణుకు చెందిన బజాజీ నాయక్ నింబాల్కర్ శివాజీకి బావమరిది. అతడు ఆదిల్‌షాహతో సంప్రదించి శివాజీకి వ్యతిరేకంగా కుట్రపన్నాడు. అయిననూ ఆ తర్వాత ఈ వంశంలోని వ్యక్తులు శివాజీ తోపాటే ఉండిపోయారు.

సంభాజీ మొహితే శివాజీకి దగ్గరి బంధువు. అతడు శివాజీ యొక్క సుపే పరగణాలో ఉండేవాడు. అతడు కూడా శివాజీకి వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగాడు. శివాజీ సుపెకు వెళ్లి అతనిని బంధించి కర్నాటకకు పంపివేశాడు. కర్తవ్య నిర్వహణలో శివాజీ బంధువులను కూడా లెక్క చేసే వాడు కాదు.

**జావళీ చంద్రరావు మోరే :** శివాజీ సాధించిన ఘనకార్యాలు మావళీలకు నచ్చాయి. అతనిపేరు అంతటా మారుమ్రోగింది. శివాజీ ప్రజల రాజు అయ్యాడు. కాని అతన్ని కొందరు కంటిలో నలుసుగా భావించారు. అటువంటి వారిలో జావళీ మోరే ఒకడు. మోరే జావళీకి జాగీరుదారుగా ఉండెను. అది రాయగడ్‌నుండి కోయనా లోయ వరకు విస్తరించి యుండెను. అది బీజాపూర్ ఆదిల్‌షాహ యొక్క జాగీరు. ఆదిల్‌షాహ అతనికి చంద్రరావు అను బిరుదును ప్రధానం చేసెను. జావళీ అడవి చాలా దట్టమైనది. ఆ జావళీ ప్రాంతం పగటివేళ కూడా సూర్యకిరణాలు సోకనటువంటిదిగా ఉండెను. అందులో పులులు, తోడేళ్లు, ఎలుగు బంట్లు మొదలగు క్రూర మృగాలు సంచరించు చుండేవి. మోరే జావళీ అంటే పులి బోను లాంటిదే. అందువలన ఎవరునూ మోరే జోలికి పోయేవారు కాదు. కాని శివాజీ అతనిని ఎదిరించుటకు సాహసించాడు.

అందుకు కారణం – దౌలత్‌రావుమోరే 1645వ సంవత్సరంలో మరణించాడు. వారసుల మధ్య కలహాలు మొదలయ్యాయి. శివాజీ యశ్వంతరావు మోరెకు సహాయం చేసెను. శివాజీ సహాయం వల్ల యశ్వంతరావు జావళీ గద్దెపై చంద్రరావుగా ఆశీనుడయ్యెడు. అప్పుడు యశ్వంతరావు శివాజీకి కప్పం చెల్లించడానికి ఒప్పుకొన్నాడు. అతని కార్యకలాపాలకు సహాయం చేస్తానని కూడా ఒప్పుకొన్నాడు. కాని గద్దెపై కూర్చోగానే ఇవన్నీ మరచిపోయాడు. ఎవరా శివాజీ? ఏమిటా ఒప్పందం? అని నిర్లక్షంగా వ్యవహరించసాగాడు. అతడు స్వరాజ్యంలోని ప్రాంతంపై దాడి సల్పుతూ, ప్రజలను బాధిస్తూ తలబిరుసుగా ప్రవర్తించసాగాడు. వెంటనే అతనిని అణచివేయుకపోతే స్వరాజ్యానికి ముప్పు వాటిల్లునని శివాజీ భావించాడు.

**తిరుగబడితే చావు తప్పదు :** "నీయంటత నీవే రాజనుకొనుచున్నావు. కాని ఈ రాజ్యానికి రాజును నేను. శివ భగవానుడు నాకు ఈ రాజ్యాన్ని ప్రసాదించాడు. కావున నీయంతట నీవు రాజు అని తలంచవద్దు" అని శివాజీ యశ్వంతరావు

మోరెకు ఘాటుగా మొదట ఒక సందేశాన్ని పంపి హెచ్చరించాడు.

దానికి యశ్వంతరావు మొండిగా "నీవు నిన్నటి రాజువు మాత్రమే. ఈ రాజ్యాన్ని నీకు ఎవరు ఇచ్చారు? నీవు జావళీకి వచ్చినచో చిక్కుల్లో పడెదవు. దేవుని దయవల్ల నేను ఆదిల్‌షాహ నుండి రాజు అనే బిరుదును పొందాను. అతని దయవల్ల రాజ సింహాసనం, రాజ్యాధికారం నాకు లభించినవి. నీవు ఏదైనా అలజడి చేసినచో ప్రమాదానికి గురియుగుదువు" అని సమాధానమిచ్చాడు.

అందుకు శివాజీ "జావళీని వదలి, రాజుగా కాకుండా, రాజ్యాధికారాన్ని దూరంగాపెట్టి, చేతులను జోడించి, రాజు దర్శనానికి వచ్చి స్వామి(రాజ) సేవను స్వీకరించు. అట్లు చేయుటకు నిరాకరించినచో ప్రాణాలకే ముప్పు వాటిల్లును" అని ప్రత్యుత్తర మిచ్చెను.

జావళీ చుట్టూ దట్టమైన అడవివుండెను. రాయరీకోట జయింపశక్య కానటువంటిదిగా ఉండెను. మోరేల బృందం కూడా చాలా ఉండెను. జావళీలను జయించడం సులభతరం కాకుండెను. శివాజీయుద్ధ సన్నద్ధుడై జావళీపై దండెత్తెను. యశ్వంతరావు దాదాపు నెల రోజుల వరకు పట్టు వదలక పోరాడసాగెను. కాని అతని సైనికులు చాలా మంది చంపబడిరి. చివరికి అతడు రాయరీ కోటలోకి పారిపోయెను. శివాజీ జావళీని జయించి తర్వాత రాయరీకోట వైపు పురోగమించి దానిని ముట్టడించాడు. యశ్వంతరావు మూడు నెలల వరకు సాహస వంతంగా పోరాడి చివరికి లొంగి పోయాడు.

**రాయగడ్‌కోట :** జావళీ విజయం ఎంతో ప్రాముఖ్యం కలిగియుంది. ఈ విజయంతో శివాజీ స్వరాజ్య విస్తరణ మొదటి కన్న రెండింతలయ్యింది. యశ్వంతరావు సైన్యం కూడా వచ్చి శివాజీ సైన్యం లో కలిసింది. విశాలమైన రాయరీకోట స్వరాజ్యం లోకి వచ్చింది. దానిని చూచి శివాజీ ఎంతగానో ఆనం దించాడు. అతడు రాయరీకోటకు 'రాయగడ్'అని పేరు పెట్టాడు. తరువాత అతడు దానికి సమీపంలో ఉన్న భోరప్య కొండపై ఒక కొత్త కోటను కట్టి దానికి ప్రతాపగడ్ అని పేరు పెట్టాడు.



రాయగడ్‌కోట

**1. సరికాని జంటను గుర్తించండి.**

అ) పల్టణ్ – నింబాల్కర్

ఆ) జావళీ – మోరె

ఇ) సుపె – జాధవ్

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శివాజీ యొక్క స్వరాజ్యమును ఏ సర్దారులు వ్యతిరేకించు చుండిరి?

ఆ) జావళీ మోరేకు ఆదిల్‌షాహ ఏ బిరుదును ప్రసాదించెను?

ఇ) జావళీ యొక్క విజయం ఎందుకు చాలా ప్రాముఖ్యమైనది?

**3. రెండు – మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) జావళీ మోరే జోలికి ఎవరును, ఎందుకు వెళ్లేవారు కాదు?

ఆ) శివాజీ యశ్వంతరావు మోరెకు ఏ జాబు పంపెను?

**ఉపక్రమం**

అ) రాయగడ్‌చిత్రాలను సంగ్రహించండి.

ఆ) దీపావళి సెలవులలో మీ మిత్రులతో రాయగడ్ నమూనాను తయారు చేయండి.

LS7F7G

# 9. ప్రతాప్‌గడ్ విజయం

**ఆదిల్‌షాహ రాజ్యం భీతిల్లుట :** బీజాపూర్ దర్బారులోని కథ. శివాజీకి పెరుగుచున్న ఆదరణ విని ఆదిల్‌షాహ దర్బారులో ఆందోళన చెలరేగింది. ఆ పరిస్థితిని ఎదుర్కొనుటకు సుల్తాన్ తన ఆధీనంలో వున్న సర్దారులందరిని తన సంస్థానానికి రప్పించాడు. సాహస కృత్యాలలో ప్రవీణులైన సర్దారులందరు హాజరైరి. ఆదిల్‌షాహ రాజ్యాన్ని పరిపాలిస్తున్న బడి సాహెబా స్వయంగా ఆ దర్బారులో హాజరైంది. ఆ సభ ముందున్న ఏకైక ప్రశ్న శివాజీని ఎలా తుదముట్టడించాలి?

బడిసాహెబా తన సర్దారులనుద్దేశించి చెప్పండి, శివాజీపై దండెత్తి, అతని తిరుగుబాటును అణచి వేయగల వారెవరు? అని సూటిగా ప్రశ్నించింది.

సంస్థానమంతయు నిశ్శబ్దమైంది. అందరు తమ తమ స్థానాలలో మౌనంగా యుండిరి. శివాజీని ఎదిరించుటకు ఎవరు సాహసం చేయగలరు? అందరు ఒకరి ముఖాలు ఒకరు చూచుకొనసాగిరి. ఇంతలో భీమునిలా దృఢకాయం కలిగిన ఒక సర్దారు తల ఒగ్గి, సలాం చేస్తూ ముందుకు వచ్చాడు. అతనిపేరు అఫ్జల్‌ఖాన్.

**ఖాన్ సవాలుకు సమ్మతించుట :** అఫ్జల్‌ఖాన్ పళ్లెంలోని తాంబూలాన్ని "చేతబూని శివాజీ! ఎవరా శివాజీ? నేను అతనిని బందించి ఇక్కడికి తీసుకొని వస్తాను. అట్లు కానిచో అతనిని చంపి శవాన్ని బీజాపూర్‌కు తీసుకొని వస్తాను" అని పలికాడు.

బీజాపూర్ సంస్థానంలోని బలమైన సర్దారులలో అఫ్జల్‌ఖాన్ ఒకడు. అతడు చాలా శక్తివంతుడు. ఇనుప గునపాన్ని పట్టి చేతులతో సులభంగా వంచగలిగే వాడు, తాను చేపట్టిన కార్యాన్ని ఏ విధంగానైనా సాధించుటలో అతడు ఆరితేరినవాడు. శివాజీని నిండు ప్రాణాలతో గాని లేదా చంపిగాని ఆస్థానానికి తీసుకురాగలనని నిండు సభలో ప్రతిజ్ఞ చేశాడు. సంస్థానంలోని వారందరూ ఎంతో ఆనందించారు. ఇప్పుడు శివాజీ భోస్లే ఎలా తప్పించుకోగలడు? కొద్ది రోజుల్లోనే శివాజీ ఇనుప గొలుసులతో బంధించబడిన స్థితిలో బీజాపూర్ సంస్థానంలో హాజరు చేయబడుతాడు లేదా అతని శిరస్సు అయినా సంస్థానంలో హాజరవుతుంది అని ప్రతి ఒక్కరు భావించారు.

అఫ్జల్‌ఖాన్ గొప్ప గర్వంతో, ఆడంబరంతో బీజాపూర్‌నుండి బయలుదేరెను. అతడు తన వెంట యుద్ధ సామాగ్రితో కూడిన పెద్దసైన్యాన్ని తీసుకువెళ్లాడు. ఇంతకు పూర్వం అఫ్జల్‌ఖాన్ పన్నెండు సంవత్సరాలు వాయి ప్రాంతానికి సుబేదారుగా ఉండుట వల్ల ఆ ప్రాంతమంతయూ సుపరిచితమై యుండెను. మిక్కిలి గర్వంతో అతడు మహారాష్ట్ర వైపుకు సాగాడు.

**స్వరాజ్యానికి ముప్పు :** శివాజీ ఆ సమయాన రాజగడ్‌లో వుండెను. అఫ్జల్‌ఖాన్ రాబోవు చున్నాడను వార్త అతని చెవినపడింది. స్వరాజ్యానికి ముప్పు వాటిల్లుచున్నదని గ్రహించాడు. అయినా అతడు ధైర్యాన్ని కోల్పోలేదు. అఫ్జల్‌ఖాన్ కపటోపాయం కలవాడని, అతని వెంట పెద్ద సైన్యం కూడా కలదని అతనికి తెలుసు. కాని తన రాజ్యంకాని, సైన్యంకాని దానికి పోలిస్తే చాలా తక్కువ. ఖాన్‌ను బహిరంగ ప్రదేశంలో ఎదిరించి నిలవాలంటే కష్టంతో కూడిన పని అని భావించెను. అతనిని యుక్తితో ఎదుర్కోవాలని నిశ్చయించుకొన్నాడు. అతడు జిజామాతతో రహస్య మంతనాలు జరిపి, ఆమె ఆశీర్వాదాలను తీసుకొని రాజగడ నుండి ప్రతాపగడ్ వైపుకు బయలుదేరాడు.

**అఫ్జల్‌ఖాన్ ఎత్తుగడలు :** శివాజీ ప్రతాపగడ్‌కు చేరుకున్నాడను వార్త విని అఫ్జల్‌ఖాన్ ఆగ్రహం చెందాడు. ప్రతాప్‌గడ్‌గోటపై దాడి చేయుట సులభతరం కాదని అతనికి తెలుసు. ఎందుకనగా

అది కొండల మధ్య ఉండే కోట. చుట్టూ దట్టమైన అరణ్యాల మధ్య ఉంది. దారి మధ్య ఎత్తైన కొండలు కూడా ఉన్నాయి. సైన్యాన్ని నడిపించుటకు దారికూడా సరిగా లేదు. ఫిరంగులను కదిలించేందుకు కూడా మార్గంలేదు. దానికి తోడు అచటి అరణ్యం క్రూరమృగాలమయమై ఉండేది.

శివాజీ ప్రతాపగడ్ నుండి కిందికి దిగి వచ్చునట్లు చేయుటకు అఫ్జల్‌ఖాన్ ఎత్తుగడలు వేయనారంభించాడు. తుల్జాపూర్, పండర్‌పూర్ మొదలగు పవిత్ర నగరాలపై అతడు దాడి సల్పెను. అచటి ప్రజలను హింసించాడు. ఇటువంటి ఎత్తుగడలు శివాజీని బహిరంగ ప్రదేశానికి రప్పించ గలవని అతడు ఆశించాడు. కాని శివాజీ అతనికన్నా ఎక్కువ తెలివిని ప్రదర్శించాడు. అతడు ప్రతాప్‌గడ్‌ను వదలకుండెను. తర్వాత ఖాన్ తన యుక్తిని మార్చాడు. అతడు ప్రేమను నటిస్తూ "నీవు నా కుమారుని లాంటి వాడవు. నాతో కలిసేటందుకు రమ్ము. మా కోటలు మాకు తిరిగి ఇచ్చి వేయుము. నేను నీకు ఆదిల్‌షాహ కొలువులో సర్దారు పదవి ఇప్పించగలను" అని శివాజీకి సందేశం పంపాడు.


**ఎత్తుకు పై ఎత్తు :** అఫ్జల్‌ఖాన్ తనతో కపట నాటకమాడుచున్నాడని శివాజీ పసికట్టాడు. ఖాన్‌నే ప్రతాప్‌గడ్‌కోట క్రిందికి వచ్చునట్లు చేయాలని తలంచి "ఖాన్‌సాహెబ్! నేను మీ కోటలు స్వాధీనం చేసుకున్నందుకు అపరాధినయ్యాను. నన్ను క్షమించండి. మీరే నన్ను కలుసుకొనుటకు ప్రతాప్‌గడ్‌కోట కిందికి రండి. నేను అచటికి వచ్చుటకు భయపడుచున్నాను." అని శివాజీ సందేశాన్ని పంపెను.

శివాజీ పంపిన సందేశాన్ని విని అఫ్జల్‌ఖాన్‌ఎంతో సంతోషించాడు. చేతి వేళ్లతో తన గడ్డాన్ని నిమురుతూ, నవ్వుచూ ఇట్లనెను. "వాహ్వా ! ఎంతో సంతోషకరమైన వార్త. శక్తి వంతుడైన అఫ్జల్‌ఖాన్‌కు విరుద్ధంగా ఇంతకన్నా ఏమి చేయగలడు? ఆ పిరికి వాడు నాతో ఏమి పోరాడగలడు. నేనె స్వయంగా వెళ్లి అతనిని హతమార్చెద" అని ఖాన్ ప్రతాప్‌గడ్‌కోట కింద శివాజీతో కలియుటకు సిద్ధమైనాడు.

**సమావేశ స్థలం :** ప్రతాప్‌గడ్ క్రింద నున్న పీఠభూమిని సమావేశ స్థలంగా ఎన్నుకున్నారు. సమయం నిర్ధారించబడింది. సమావేశ సమయాన



ప్రతాప్‌గడ్‌కోట




ఒక్కొక్కరి వెంట ఒక్కొక్క సేవకునితో పాటు కొంత దూరంలో పదిమంది అంగరక్షకులు నిర్ధారింపబడ్డ స్థలంలో ఉండాలని నిర్ణయింపబడింది. ఖాన్‌కు అనుకూలంగా ఒక రోడ్డు వేయించబడింది. సమావేశ స్థలంలో ఒక అందమైన షామియానా ఏర్పాటు చేయబడ్డది.

శివాజీ చాలా జాగ్రత్తగా వ్యవహరించసాగాడు. అతడు తనసైన్యాన్ని చిన్న చిన్న దళాలుగా విభజించాడు. అడవిలో ఎవరు ఎక్కడ దాగి ఉండాలి. ఏ పని చేయాలి అనే విషయాలు వారికి తెలిపెను. సంపూర్ణంగా, జాగ్రత్తలు తీసుకొన్నాడు. ఖాన్ కపట బుద్ధి కలవాడు. శివాజీ నీవు అతన్ని కలుసుకొనుటకు వెళ్లవద్దు అని అతనికి కొంతమంది సలహానిచ్చిరి. కాని శివాజీ ఖాన్‌తో కలియుటకు నిశ్చయించుకున్నారు.

**సమావేశానికి సిద్ధమగుట :** సమావేశమయ్యే రోజు రానే వచ్చింది. శివాజీ ఉదయాన్నే భవానీదేవిని దర్శనం చేసుకొన్నాడు. ఆ తర్వాత అతడు తన సంప్రదాయ దుస్తులను ధరించడం ప్రారంభించాడు. కాళ్లకు సల్వార్ ఎక్కించాడు. శరీరంపై కవచాన్ని దానిపై సిల్కుచొక్కాను, జాకెట్‌ను తొడిగాడు. తలపై బంగారు శిరస్త్రాణం ఉంచి దానిపై ఒక తలపాగాను చుట్టాడు. ఎడమచేతి వేళ్లకు పులిగోళ్లు ఎక్కించాడు. అదేచేతి చంకలో పిడిబాకును దాచి పెట్టాడు. వెంట ఖడ్గం తీసుకొని శివాజీ ఖాన్‌ను కలుసుకొనుటకు సంసిద్ధుడైనాడు.

సర్దారులందరూ బయట వేచియుండిరి. శివాజీ వారితో ఇట్లనెను. "స్నేహితులారా! ప్రతి ఒక్కరు మీకిచ్చిన కర్తవ్యాలను నెరవేర్చండి. భవానీదేవి మనం విజయం పొందునట్లు చూస్తుంది. కానీ ఒకవేళ పరిస్థితులు అదుపుతప్పి నేను చంపబడితే మీరు ధైర్యాన్ని కోల్పోవద్దు. సంబాజీ రాజును గద్దె నెక్కించండి. తల్లి ఆజ్ఞలను పాటించండి. స్వరాజ్యాన్ని విస్తరింపచేయండి. ప్రజలను సుఖపెట్టండి. నేను వెళ్లుచున్నాను" అంటూ శివాజీ బయలు దేరెను. అతని వెంట ఒక దూత పంతాజీ గోపినాథ్ మరియు జీవాజీ మహాలా, సంబాజీ కావ్‌జీ, యేసాజీ కంక్, కృష్ణాజీ గైక్వాడ్, సిద్ది ఇబ్రహీం మొదలగు పదిమంది అంగరక్షకులుండిరి.

శివాజీ కంటే ముందే ఖాన్ షామియానాలో కూర్చొని యుండెను. అతడు శివాజీని ఎలా ఎదుర్కోవాలి అనే ఆలోచనల్లో లీనమై యుండెను. అతని ప్రక్క బడాసయ్యద్ అనే పేరుగల సాయుధ సైనికుడు నిలబడి యుండెను. అతడు కత్తిసాములో మంచి నిపుణత కలవాడు. శివాజీ షామియానా ద్వారం వద్దకు వచ్చాడు. బడాసయ్యద్‌ను చూసి అచటనే ఆగిపోయాడు. శివాజీ లోపలికి ఎందుకు రావడం లేదు అని ఖాన్ మహారాజు దూతను అడిగెను.

"అతడు బడా సయ్యద్‌ను చూచి భయ పడుచున్నాడు కాబోలు. మీరు అతన్ని కొంత దూరంగా ఉండమనండి" అని శివాజీ దూత ఖాన్‌తో అనెను.



**శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను కలుసుకొనుట**

బడాసయ్యద్ దూరంగా వెళ్లి నిలబడెను. శివాజీ లోపలికి వెళ్లాడు. ఖాన్‌లేచి "శివాజీ రాజా! రండి కౌగిలించుకొందాం", అని పలికెను.

**అఫ్జల్‌ఖాన్‌తో పోరాడుట :** శివాజీ మహారాజు చాలా జాగ్రత్తగా ముందుకు అడుగు వేశాడు. ఖాన్ శివాజీని కౌగిలించుకొన్నాడు. ఆజానుబాహుడైన ఖాన్ ముందు శివాజీ ఒక మరుగుజ్జులాగా కనిపించాడు. శివాజీ శిరస్సు ఖాన్ వక్షస్థలం వరకే యుండెను. ఖాన్ శివాజీని చంపనుద్దేశంతో వెంటనే అతని మెడను ఎడమ చంక క్రిందికి లాగి వత్తెను. మరొక చేతితో శరీరంపై బాకుతో పొడిచాడు. శివాజీ శరీరంపై గల చొక్కా(కోటు) మాత్రమే చినిగిపోయింది. చొక్కా లోపల కవచం ఉన్నందు వల్ల శివాజీ రక్షింపబడెను. అతడు ఖాన్‌ఎత్తుగడను తెలుసుకొన్నాడు. అత్యంత చాకచక్యంతో అతడు ఖాన్ పొట్టలో పులిగోళ్లను దించాడు. ఎడమ చేతి చంకలో దాచిన పిడి బాకును కుడిచేతితో బయటకు తీసి కసుక్కున ఖాన్‌పొట్టలోకి పొడిచాడు. ఖాన్ ప్రేగులు బయట పడ్డాయి. ఖాన్ నేలకొరిగాడు. ఇంతలోనే ఖాన్‌దూత కృష్ణాజీ భాస్కర్ ముందుకు వచ్చి కత్తితో శివాజీని ఎదుర్కొనెను. కాని శివాజీ ఒక ఖడ్గం దెబ్బతోనే అతనిని చంపెను. ఈ చావుకేకలు విన్న బడాసయ్యద్ పరుగున షామియానాలోకి వచ్చెను. అతడు శివాజీని ఎదుర్కొనే లోపల జివాజీ మహాలా పరుగున వారి మధ్యకు వచ్చి బడాసయ్యద్ వేసిన దెబ్బను తన శరీరంపై వేసుకొని ఒకే దెబ్బతో అతనిని చంపివేశాడు. "జివా ఉండెను, కావున దక్కెను శివా" (హోతా జివా మ్హణూన్ వాచలా శివా) అను నానుడి నాటి నుండి పరిపాటి అయ్యెను. అప్పుడు జరిగిన సంఘర్షణలో సంభాజీ కావ్‌జీ చాలా పరాక్రమాన్ని చూపెను.

**అఫ్జల్‌ఖాన్ సైన్య ఓటమి :** విజయం పొందిన శివాజీ కోటపైకి వెళ్లాడు. ఫిరంగుల మోత విజయ సూచకాన్నిచ్చాయి. శివాజీ సైన్యం ఆ సూచన కొరకే ఎదురు చూస్తుండెను. ఫిరంగుల మోత వినగానే చెట్లలో దాగియున్న శివాజీ సైనికులు ఖాన్ సైన్యంపై దాడి సల్పిరి. ఖాన్‌సైన్యం అజాగ్రత్తగా ఉం

డెను. పరుగెత్తుటకు కూడ దారి తెలియలేదు. మరాఠా సైనికులు వారి వెంబడించి ఖాన్‌సైన్యాన్ని అంతమొందించిరి. అఫ్జల్‌ఖాన్ కుమారుడు ఫాజల్‌ఖాన్ ఎలాగో తప్పించుకొని బీజాపూర్‌కు చేరుకొన్నాడు. అతడు అందించిన వార్తవల్ల బీజాపూర్ అంతటా హాహాకారాలు చెలరేగాయి.

బీజాపూర్ సంస్థానంలోని మిక్కిలి శక్తిశాలియైన సర్దారును చూస్తుండగానే శివాజీ మట్టిలో కలిపెను. శివాజీ పేరు నలుమూలలా వ్యాపించింది. అతని పరాక్రమ పొవాడ వీరగీతాలు సహ్యాద్రి కొండ, కోనల్లో మారుమ్రోగాయి.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన అక్షరాల నుండి అర్థవంతమైన పదాన్ని తయారు చేయండి.**

అ) తా గ ప్ర డ్ ప్ = .............................

ఆ) జీ వా శి = .............................

ఇ) ఖా అ ఫ్జ న్ ల్ = .............................

**2. ఒక వాక్యంలో జవాబులు రాయండి.**

అ) అఫ్జల్‌ఖాన్ ఏ సవాలును స్వీకరించెను?

ఆ) ప్రేమను నటిస్తూ అఫ్జల్‌ఖాన్ శివాజీకి ఏమని సందేశం పంపాడు?

**3. రెండు-మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను యుక్తితోనే హత మార్చాలని ఎందుకు నిశ్చయించుకొనెను?

ఆ) అఫ్జల్‌ఖాన్‌ను కలుసుకొనుటకు వెళ్లుచున్నపుడు శివాజీ తన సర్దారులతో ఏమన్నాడు?

**4. కారణాలు రాయండి.**

అ) శివాజీ ప్రతాప్‌గడ్ చేరుకున్నాడనే వార్త తెలియగానే ఖాన్ కోపగ్రస్తుడయ్యాడు.

ఆ) బీజాపూర్‌లో హాహాకారాలు చెలరేగాయి.

**ఉపక్రమం**

అ) చారిత్రక సంబంధమైన సామెతలను సేకరించండి.

ఉదా : ''జీవా ఉండెను, కావున దక్కెను శివా''

LSBBVD

# 10. పట్టుదలతో చేసిన ఘోడ్‌ఖిండ్‌యుద్ధం

**పన్హాలపై విజయం – ఆదిల్‌షాహకు ఆగ్రహం:** బీజాపూర్ సంస్థానం అఫ్జల్‌ఖాన్ మరణ విషాదంలో మునిగి యుండగా శివాజీ బీజాపూర్ ఆధీనంలోయున్న పన్హాలగడ్‌ను జయించాడు. అందువల్ల ఆదిల్‌షాహ అత్యంత ఆగ్రహం చెందాడు. అతనికి ఆహార పానీయాలు రుచించలేదు. శివాజీని అంతం చేయడానికి అతడు సిద్ది జోహార్ అనే సర్దారును పంపాడు. సిద్దీ జోహార్ పెద్దసైన్యాన్ని తీసుకొని బయలుదేరెను. తండ్రి మృతిపై పగ సాధించడానికి ఫజల్‌ఖాన్ కూడా అతని వెంట బయలు దేరెను.

**పన్హాలగడ్‌ను ముట్టడించుట :** సిద్దీ జోహార్ ఎంత ధైర్యవంతుడో అంత క్రూరుడు. అతడు గొప్ప క్రమశిక్షణ కలవాడు. అతడు పన్హాలగడ్‌ను నాలుగు వైపుల ముట్టడించి శివాజీని దుర్గంలోనే బంధింపబడేటట్లు చేశాడు. వర్షాకాలం సమీపించుచున్నది. వర్షం పడిన వెంటనే సిద్దీ జోహార్‌కోట ముట్టడిని సడలించునని శివాజీ తలంచెను. కాని వర్షం ప్రారంభం కాగానే అతడు కోట ముట్టడిని మరింత కట్టు దిట్టం చేశాడు. కోటలో ఉన్న ధాన్య నిలువలు ఖాళీ కావచ్చాయి. ఇప్పుడేమి చేయగలడు? శక్తి వలన కాని పని కావున ఏదో ఒక యుక్తితో తప్పించుకొని పోవుటకు శివాజీ నిశ్చయించుకొన్నాడు. "త్వరలోనే కోటను మీకు అప్పగించనున్నాము" అని ఒక సందేశాన్ని సిద్దీజోహార్‌కు పంపెను. వర్తమానం అందుకొన్న సిద్దీజోహార్ అందుకు ఒప్పుకొని చాలా సంతోషించెను.

ముట్టడి కార్యంలో సిద్దీజోహార్ సైనికులు విసిగి పోయివుండిరి. శివాజీ లొంగి పోవుచున్నాడని విని వారు సంతోషించారు. ఆహార పానీయాలతో, గానా బజానాలతో, హుక్కా పీల్చుటలో నిమగ్నమై యుండిరి.

**ముట్టడి నుండి శివాజీ బయటపడుట :** ముట్టడి నుండి శివాజీ తప్పించుకొని పోవుటకు ఒక ఉపాయాన్ని పన్నాడు. అతడు రెండు పల్లకీలను సిద్ధం చేశాడు. ఒకదానిలో శివాజీ క్లిష్టమైన దారి నుండి బయటకు వెళ్లడం, మరొక శివాజీ మహారాజు వలె వేషాన్ని ధరించిన వ్యక్తి ముఖ ద్వారం గుండా బయటపడటం. రెండో పల్లకి శత్రుసైన్యానికి సులభంగా కనిపిస్తుంది. కావున అది పట్టుబడుతుంది. శివాజీ రాజు పట్టుపడ్డాడని తెలుసుకొని శత్రువులు సంతోషిస్తారు. ఇంతలో శివాజీ తను ఎంచుకున్న క్లిష్టమైన మార్గం గుండా తప్పించుకొని వెళ్లే ఉపాయం చేశాడు. దానికొరకు ఒక సాహస యువకుడు అందుకు సిద్ధమైనాడు. అతడు చూడడానికి శివాజీ మాదిరిగా ఉంటాడు. అతని పేరు శివా కాశీద్. అతడు శివాజీ కొలువులో కేశాలంకరణ చేసే సేవకుడు. అతడు గొప్ప సాహసవంతుడు మరియు చతురుడు.

ముందే, నిర్ణయించిన ప్రకారం శివాజీ యొక్క పల్లకి రాజ మార్గం గుండా బయటపడెను. అది రాత్రి సమయం జోరుజోరుగా వర్షం కురుస్తుంది. అయినను కొందరు శత్రుసైనికులు కాపలా కాయుచుండిరి. వారు ఈ పల్లకీని పట్టుకొనిరి. శివాజీ రాజు పట్టుబడినాడనుకొని వారు ఆ పల్లకీని సిద్దీ జోహారు సైనిక శిబిరానికి తీసుకొని వెళ్లారు. అక్కడ ఆనందోత్సవాలు ప్రారంభమైనవి. ఇంతలో శివాజీ

మరో మార్గం నుండి బయటపడ్డాడు. అతని వెంట బాజీ ప్రభు దేశ్‌పాండే మరియు ఎన్నిక చేయబడ్డ సైనికులుండిరి. వెంట బాందల్ దేశ్‌ముఖ్ సైన్య ముండెను. ఇక్కడ కొద్ది సేపట్లోనే శివా కాశీద్ యొక్క పథకం బయట పడింది. అప్పుడు సిద్దీ కోపంతో శివాజీ రూపంలో నున్న వ్యక్తిని వెంటనే చంపివేశాడు. శివాజీ కోసం, స్వరాజ్యంకోసం, శివా కాశీద్ ప్రాణత్యాగం చేసి అమరుడైనాడు.

శివాజీ చేతిలో చిక్కినట్టే చిక్కి తప్పించుకు పోయాడని తెలియగానే సిద్దీ కోపోద్రిక్తుడయ్యాడు. అతడు వెంటనే సిద్దీమసూద్ అను తన సర్దారును గొప్ప సైన్యంతో శివాజీని వెంబడించుటకు పంపెను. వీరు శివాజీని వెంబడించడం మొదలు పెట్టారు. శివాజీ సమస్యలో చిక్కుకొనెను. సిద్దీ మసూద్ అశ్వదళానికి ప్రాతఃకాలమున పండరిపాణి సెలయేరు వద్ద శివాజీ కనిపించెను. అతడు, అతని అనుచరులు అతి కష్టంతో ఆ ప్రమాదం నుండి తప్పించుకొని ఘోడ్‌ఖిండ్‌ను దాటారు.

**బాజీప్రభు ధీరత్వం :** కోపోద్రేకంలోనున్న సిద్దీసైన్యం బహువేగంతో ఘోడ్‌ఖిండ్ కనుమ వైపు పురోగమించు చుండెను. శత్రు సైన్యం తమను ఆక్రమించిన యెడల విశాల్‌గడ్ చేరుకొనుట అసాధ్యమని శివాజీ గ్రహించాడు. అతడు బాజీ ప్రభుతో ''బాజీ ఇది చాలా క్లిష్ట సమయం. ముందున్న దారి చాలా నిటారైంది. శత్రువులు మనలను వెంటాడుచున్నారు. ఇపుడు విశాల్‌గడ్‌కు చేరుట వీలుకాదు. కావున వెనుకకు తిరిగి శత్రువు నెదుర్కొందాం'' అని పల్కెను. శివాజీ మనసులో రగులుచున్న ఆవేదనలు బాజీ అర్థం చేసుకొన్నాడు. శత్రుసైన్యం వేగంగా కనుమను సమీపించుచుండెను. శివాజీ ప్రాణంతో పాటు స్వరాజ్యం కూడ ప్రమాదంలో నుండెను. బాజీ ప్రభు శివాజీతో ''మహారాజా! మీరు కొంత మంది సైనికులను తీసుకొని విశాల్‌గడ్‌కు వెళ్లండి. నేను మిగిలిన సైనికులతో కనుమలో ఉంటాను. నా ప్రాణాలైనా అర్పిస్తాను. శత్రువులను కనుమ దాటకుండా అడ్డుకుంటాను. నేను మరణించిన యెడల నాలాంటి బాజీలు అనేక మంది రాగలరు. కాని స్వరాజ్యానికి శివాజీ మహారాజు అవసరం. శత్రువులు అధిక సంఖ్యలో వున్నారు. మన అల్పసైన్యంతో వారిని ఎదిరించలేము. ఇక ఆలసించక ముందుకు సాగండి. కనుమ ద్వారం వద్దనే మేము శత్రువులను ఆపెదం మీరు విశాల్‌గడ్‌కు సురక్షితంగా చేరుకున్నారని తెలిసే వరకు మేము శత్రువులను ముందుకు కదలనీయం'' అని పలికాడు. బాజీ ప్రభు యొక్క రాజ భక్తి శివాజీ కన్నులకు నీరు తెప్పించింది. శివాజీకి బాజీ ప్రభు వంటి రత్నాన్ని కోల్పోవుట ఇష్టం లేకుండెను. కాని అతడు స్వరాజ్య లక్ష్యాన్ని సాధించవలసియున్నది. పొంగి వస్తున్న బాధను తనలో తాను అణచుకొని బాజీని కౌగిలించుకొని ''సరే! మేము విశాల్‌గడ్ పోవుచున్నాము. అచటికి చేరిన వెంటనే ఫిరంగులు మ్రోగును. అదియే సురక్షితమైన సంకేతం ఫిరంగుల మ్రోత వినగానే కనుమను వదిలి కోటకు రండి'' అని పలికెను.

**శత్రుధాటిని నిలువరించిన బాజీప్రభు :** ఆ విధంగా శివాజీ బాజీ ప్రభును కనుమ రక్షణకై వదిలి విశాల్‌గడ్‌కు పయనమయ్యాడు. శివాజీకి బాజీ వంగి నమస్కారం చేశాడు. తరువాత అతడు రెండు చేతులతో రెండు కత్తులు తీసుకొని కనుమ ద్వారం వద్ద నిలడ్డాడు. అతడు మావళీలను చిన్న చిన్న దళాలుగా విభజించాడు. వారికి స్థానాలను నిశ్చయించాడు. మావళీలు బండలను, రాళ్లను సేకరించి తమ తమ స్థానాలను చేరుకొన్నారు. మావళీలు ఉక్కులాంటి గోడను కనుమకు



ఘోరండ్‌ఖిండ్ వద్ద శివాజీ మరియు బాజీప్రభు దేశ్‌పాండే

అడ్డంగా కట్టారు. ఇంతలో శత్రువుల యుద్ధ నినాదములు వినబడ్డాయి. శత్రువులు కనుమ క్రిందికి వచ్చి యుండిరి. బాజీ మావళీలను ఉద్దేశించి "వీర సైనికులారా! మిత్రులారా! మీ ప్రాణాలు పోయినా స్థానం వీడకండి. శత్రువులను కనుమ పైకి రానివ్వకండి" అని పలికెను. బాజీప్రభు, అతని మావళీలు కనుమ ముఖ ద్వారం వద్ద నిర్భయంగా నిలబడి శత్రురాక కొరకు ఎదురు చూచుచుండిరి. కనుమ మార్గం కఠినంగా వంకరటింకరగా ఉంది. కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే బహు కష్టంతో ఎక్కగలరు.

అక్కడ శివాజీ విశాల్‌గడ్‌కు అతివేగంగా ముందుకు సాగుచుండెను. కోటచేరుటకు శివాజీకి ఒకటిన్నర, రెండు గంటల వ్యవధి పట్టును. అంత సమయం బాజీ ప్రభు శత్రు సైన్యాన్నీ కనుమ వద్ద నిలువరించినట్లయితే శివాజీ విశాల్‌గడ్‌కు సురక్షితంగా చేరుకోగలడు.

**ఘోడ్‌ఖిండ్ యుద్ధం :** కనుమలో భీకర యుద్ధం ప్రారంభమైంది. శత్రు సైనికులు కనుమనెక్కుట ప్రారంభించిరి. శత్రు సైనికుల మొదటి దళం కనుమలో ప్రవేశించగానే మావళీలు శత్రు సైనికులపై రాళ్ల వర్షం కురిపించాడు. రాళ్లు విసురుటలో మావళీలు మంచి నైపుణ్యం గలవారు. శివాజీ యొక్క మావళీలు చాలా మంది శత్రువులను హతమార్చిరి. కొందరి వీరుల తలలు పగిలాయి. మొదటి శత్రు దళం పరాజయం పాలై వెనుదిరిగెను. తరువాత రెండో శత్రుదళం ఎంతో ఉత్సాహంతో కనుమ నెక్కుట ప్రారంభించెను. బాజీ ప్రభు కేకలు వేస్తూ "చంపండి, నరకండి" అని మావళీలను ఉత్సాహపరిచాడు. మావళీలు ఉత్తేజితులై 'హరహర మహాదేవ్' అనే సమర నినాదంతో శత్రుసైన్యంపై విరుచుకు పడ్డారు. మరలా రాళ్ల వర్షం మొదలైంది. శత్రు సమూహం కుప్పకూలింది. బాజీ ప్రభు పిచ్చివానిలా "శభాష్! సైనికులారా! ఇంకా రాళ్లను విసరండి శత్రువులను చంపండి, ముందుకు సాగండి శభాష్!" అని చెవులు చిల్లులు పడేలా అరచుచుండెను. రెండో శత్రు దళం కూడా పరాజయం పొందింది.

అక్కడ శివాజీ గుర్రంపై వేగంగా విశాల్‌గడ్‌కోటను సమీపించుచుండెను. క్షణక్షణం ఒక గండంగా తోచుచుండెను. విశాల్‌గడ్‌కోట కింద శత్రువులు చుట్టూ ముట్టడించి ఉన్నారు. శివాజీ తాను ఎన్నుకొన్న సైనిక దళంతో శత్రువులపై దాడిసల్పాడు. యుద్ధం చేస్తూ శత్రువుల ముట్టడిని ఛేదిస్తూ శివాజీ విశాల్‌గడ్‌పైపు అధిగమించాడు.

**బాజీ పరాక్రమం :** ఘోడ్‌ఖిండ్‌లో యుద్ధం చాలా ఘోరంగా జరుగుచుండెను. సిద్దీమసూద్ ఆగ్రహం చెందియుండెను. అతని మూడో సైనిక దళం కనుమనెక్కుట ప్రారంభించెను. మరాఠాలు అపూర్వమైన వీరత్వాన్ని ప్రదర్శించారు. శత్రువులు బాజీ ప్రభువుపై దాడి చేసి చుట్టు ముట్టిరి. బాజీ ఆవేశంతో, అద్భుతమైన పరాక్రమంతో పోరాడుచుండెను. అతని శరీరమంతయూ గాయాలతో నిండి రక్తం ప్రవహించుచుండెను. అయినా కనుమలో తన స్థానం వీడలేదు. శరీరం అంతా రక్తంతో తడిసి ముద్దయి పోయెను. అయినా వెనుకంజవేయలేదు. అప్పుడప్పుడు బిగ్గరగా అరుస్తూ మావళీలను శత్రువుల నెదుర్కొమ్మని ఆజ్ఞాపించుచుండెను. మావళీలు ఉద్రేక పూరితులై శత్రు సైన్యంపై దాడి సల్పిరి. శత్రువులు వెనుకకు మరలిరి. తాను ప్రాణాంతంగా గాయపడినప్పటికి యుద్ధం కొనసాగుతూనే ఉండాలని బాజీ ప్రభు మావళీలను ప్రేరేపించుచుండెను. అతని మనసంతయు ఫిరంగుల మోతపైనే ఉంది.

**ఘోడ్‌ఖిండ్ పావన్‌ఖిండ్ అగుట :** ఇంతలో ఫిరంగుల మోత వినిపించింది. యుద్ధభూమిలో కుప్పకూలిన బాజీప్రభుకు ఫిరంగుల మోత చెవిన పడగానే "నా మహారాజు విశాల్‌గడ్‌కు చేరుకున్నాడు. నేను నా కర్తవ్యాన్ని నెరవేర్చాను. ఇప్పుడు నేను ప్రశాంతంగా కన్నుమూయగలను" అని పలుకుతూ బాజీ తన అంతిమ శ్వాసను వదిలెను. ఈ వార్త విశాల్‌గడ్‌లో మహారాజుకు తెలిసింది. అతడు చాల దుఃఖిస్తూ "బాజీ ప్రభు దేశ్‌పాండే స్వరాజ్యం కొరకు వీరమరణం పొందాడు, బాందల్ ప్రజలు ఘోర యుద్ధం చేశారు" అని అన్నాడు.

బాజీ ప్రభు వంటి దేశ భక్తులు ఉండటం వల్లనే స్వరాజ్యం సిద్ధించుటకు వీలైంది. అటువంటి స్వామి భక్తుని రక్తంచే ఘోడ్‌ఖిండ్ పావనమైంది. అందుకే చరిత్రలో ఆ కోట పావన్‌ఖిండ్ అనే పేరుతో చిరస్థాయిగా నిలిచిపోయింది. అమరులైన ఆ వీరులు మరియు బాజీ ప్రభు ఎంతటి ధన్యులో కదా!

## అభ్యాసం

**1. ఖాళీలను సరైన పదంతో పూరించండి.**

అ) సిద్ధీ జోహార్ ............ కోటను నాలుగు వైపులా ముట్టడించాడు

ఆ) బాజీ ప్రభు ............ శివాజీ కన్నులకు నీరు తెప్పించింది

ఇ) ఘోడ్‌ఖిండ్ ............ అనే పేరుతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శివాజీ పన్హాలాగడ్ ముట్టడి నుండి తప్పించుకోవడానికి సిద్ధీకి ఏమని సందేశం పంపాడు?

ఆ) సిద్ధీ జోహార్ ఎందుకు కోపోద్రిక్తుడైనాడు?

ఇ) విశాల్‌గడ్ వైపు వెళుతూ శివాజీ, బాజీప్రభుతో ఏమన్నాడు?

**3. రెండు-మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) పన్హాలగడ్ ముట్టడి నుండి బయటపడుటకు శివాజీ ఏ ఉపాయాన్ని పన్నాడు.

ఆ) బాజీ ప్రభు శత్రువులను ఘోడ్‌ఖిండ్‌లో నిలువరించుటకు ఏ ఉపాయాన్ని (యుక్తిని) ఉపయోగించాడు?

**4. కారణాలు రాయండి.**

అ) ఆదిల్‌షాహ చాలా కోపగ్రస్తుడైనాడు.

ఆ) శివాజీ కొలువులోని శివా కాశీద్ అమరుడైనాడు.

ఇ) పావన్‌ఖిండ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.

**5. ఎవరో రాయండి.**

అ) ధైర్యవంతుడు, క్రూరుడు కూడ ...............

ఆ) ఘోడ్‌ఖిండ్‌లో భీకర యుద్ధం చేసినవాడు ..............

ఇ) ముట్టడి నుండి తప్పించుకున్న వారు ...........

### ఉపక్రమం

శివాజీ కొలువులోని స్వామి భక్తిగల సేవకుల మరిన్ని వివరాలు ఉపాధ్యాయుల సహాయంతో తెలుసుకోండి.

LSGK94

# 11. శాయిస్తాఖాన్ పరాభవం


**శాయిస్తాఖాన్ దండయాత్ర :** బీజాపూర్ సుల్తాన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా శివాజీ ముందు అవి అన్నీ విఫలమైనాయి. అతడు ప్రతి సర్దారును ఓడించాడు. చివరికి ఆదిల్‌షాహ పోరాటానికి స్వస్తి చెప్పి శివాజీతో సంధి చేసుకొని అతని స్వతంత్ర రాజ్యాన్ని గుర్తించాడు. అందువల్ల శివాజీకి తన దక్షిణ భాగాన కొంతకాలం వరకు శాంతి భద్రతలు లభించాయి.

శివాజీ తన దృష్టిని ఉత్తరంలో మొఘలుల వైపుకు మళ్లించాడు. మొఘలుల నిరంతర దండయాత్రలు మహారాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయి. ఆ సమయాన ఢిల్లీకి ఔరంగజేబు మొఘలు చక్రవర్తిగా వుండెను. శివాజీ ఔరంగజేబు రాజ్య ప్రాంతంపై దండయాత్రలు కొనసాగించెను. అది ఔరంగజేబుకు ఆగ్రహం కలిగించింది. అతడు తన మేనమామ యగు శాయిస్తాఖాన్‌ను శివాజీపైకి పంపాడు శాయిస్తాఖాన్ 75000 మంది సైనికులు, వందల కొలది ఏనుగులు, ఒంటెలు, ఫిరంగులతో పుణెపై దండెత్తాడు. మార్గమధ్యంలో అతడు శిర్వాల్, శివాపూర్, సాన్‌వాడ మొదలగు గ్రామాలను స్వాధీనపరచుకొని చివరికి పురందర్ కోటను ముట్టడించాడు. అతడు అలాగే పురోగమించు చుండగా మరాఠా సైన్యం పర్వత కనుమ దారిలో అతనిని చుట్టు ముట్టింది. మరాఠాలు అతివేగంగా గుర్రపు స్వారీచేయుటలో నిపుణులు. రొట్టె, పచ్చడి తిని, శరీరంపై కంబలి ధరించి గాలిలో తేలునట్లుగా కొండలను అవలీలగా దాటుటలో మరాఠాలు ఆరితేరిన వారు. ఈ గొరిల్లా యుద్ధ పద్ధతివల్ల శాయిస్తాఖాన్ సైన్యం గాభరా పడ్డారు. విసుగు చెందివారు పురందర్ ముట్టడిని చాలించారు.

**ఫిరంగోజీ నరసాల :** తర్వాత శాయిస్తాఖాన్ పుణే వైపు పురోగమించాడు. మొదట అతడు చాకణ్ కోటను వశపరచుకొన్నాడు. ఫిరంగోజీ నరసాల గొప్ప ధైర్య సాహసాలతో శాయిస్తాఖాన్ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. అలా రెండు నెలల వరకు పోరాడాడు. కాని శాయిస్తాఖాన్ ఫిరంగుల దాడికి తాళలేక పోయాడు. శాయిస్తాఖాన్ అతని శూరత్వంను మెచ్చుకొని మొఘలుచక్రవర్తి వద్ద ఉద్యోగం ఇప్పించెదనని ఆశ చూపాడు. కానీ ఫిరంగోజీ నరసాల తిరస్కరించాడు.

**లాల్‌మహల్‌లో శాయిస్తాఖాన్ :** శాయిస్తాఖాన్ పుణెకు వచ్చి శివాజీ నివాసమైన లాల్‌మహల్‌ను తన ప్రధాన కార్యాలయంగా చేసుకొన్నాడు. ఒకటి, రెండు సంవత్సరాలు గడిచాయి. పుణె నుండి కదల లేదు. అతని సైనికులు శివాజీ రాజ్యంలోని ప్రాంతాలపై దాడి సల్పి పంటలను నాశనం చేసి పశువులను తీసుకుపోవడం చేశారు. ఈ విధంగా అతడు పుణె చుట్టు ప్రక్కల ప్రాంతాలను ధ్వంసం చేశాడు.

**సాహసంతో కూడిన ఎత్తుగడ :** చివరికి శివాజీ శాయిస్తాఖాన్‌కు ఒక గుణపాఠం నేర్పదలచాడు. శాయిస్తాఖాన్ లాల్‌మహల్‌లో తిష్టవేయుట శివాజీకి మంచిదయింది. శివాజీకి ఆ మహల్‌లోని గదులు, వసారాలు, కిటికీలు, తలుపులు వచ్చిపోయే దారులు, రహస్య మార్గాలన్నియు తెలుసు. అంతేగాక ఖాన్‌సైన్యపు తీరు తెన్నులను శివాజీ గూఢచారులు ఎప్పటికప్పుడు తెలియజేయు చుండిరి. అందువలన శివాజీ ఒకరోజు రాత్రి లాల్‌మహల్‌లో ప్రవేశించి శాయిస్తాఖాన్‌ను చంపాలని నిశ్చయించుకున్నాడు. ఇది ఎంతో సాహసంతో కూడిన నిర్ణయం. లాల్‌మహల్‌కు కట్టుదిట్టమైన



**శివాజీ శాయిస్తాఖాన్‌పై దాడి చేయుట**

కాపల ఉండేది. చీమ కూడ ప్రవేశించడానికి వీలులేదు. 75000 మంది సైనికులు కాపలా కాయుచుండిరి. మరాఠాలెవ్వరును ఆయుధాలు ధరించి పుణెలో ప్రవేశించుటకు అనుమతి లేదు. శివాజీ నిర్ణయ మంటే నిర్ణయమే. అందులో మార్పులేదు.

శివాజీ తన సాహస కృత్యాన్ని సాధించుటకు ఒక రోజును ఎన్నుకొన్నాడు. 1663 సంవత్సరం ఏప్రిల్ 5వ తేదిన రాత్రి ఒక పెండ్లి ఊరేగింపు మేళ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో పోవు చుండెను. దివిటీలు వెలుగుచుండెను. వందలకొలది స్త్రీ-పురుషులు మెరిసే దుస్తులు ధరించి నడచు చుండిరి. కొందరు పల్లకీలలోను, మరికొందరు మేనాలలోను, అనేక మంది నడుచుకుంటూ వెళ్లుచుండిరి. శివాజీ కొంతమంది విశ్వాస పాత్రులైన అనుచరులు తాము కూడా ఆ ఊరేగింపులో భాగస్వాములన్నట్లుగా కలిసిపోయారు. కొంతసేపటకి ఆ ఊరేగింపు ముందుకు పోయింది. అంతా నిశ్శబ్దం. శివాజీ అతని అనుచరులు మెల్లగా లాల్‌మహల్ వైపు వెళ్లసాగారు. ఆ సమయాన శాయిస్తాఖాన్ గాఢ నిద్రలో ఉండెను.

**శాయిస్తాఖాన్‌కు గుణపాఠం :** శివాజీ గోడకు కన్నం వేసి లాల్‌మహల్‌లోకి ప్రవేశించాడు. అది అతని స్వగృహం కావున మూల మూలలు తెలుసు. ఖాన్ అంగరక్షకులు గాఢ నిద్రలో ఉన్నారు. వారిని శివాజీ అనుచరులు పట్టివేశారు. శివాజీ ఇంకా లోనికి ప్రవేశించాడు. అంతలోనే కత్తిబట్టిన ఒక వ్యక్తి శివాజీపైపు పరుగెడుతు వచ్చాడు. శివాజీ అతనిని హతమార్చాడు. శివాజీ అతనిని శాయిస్తాఖాన్

అనుకున్నాడు. కాని అతడు శాయిస్తాఖాన్ కుమారుడు. ఇంతలో ఆలజడి చెలరేగింది. జనం మేల్కొన్నారు.

శివాజీ సేరుగా ఖాన్ నిద్రించుచున్న గదిలోకి ప్రవేశించాడు. అతడు కత్తిని బయటికి తీయగా శాయిస్తాఖాన్ భయపడి 'దయ్యం! దయ్యం!' అని కేకలు వేస్తూ కిటికీ గుండా తప్పించుకొని పోవుటకు ప్రయత్నించాడు. శివాజీ అతనిని వెంబడించాడు. శాయిస్తాఖాన్ కిటికీ గుండా బయటకి దూకుటకు ప్రయత్నించగా శివాజీ కత్తితో ఒక దెబ్బ వేశాడు. దానితో ఖాన్ మూడు వేళ్లు తెగబడ్డాయి. ప్రాణాలు కోల్పోవుటకు బదులు ఖాన్ వేళ్లు మాత్రమే పోగొట్టుకొన్నాడు. ఖాన్ కిటికీ గుండా బయటికి దూకి పరుగెత్తాడు. మోస పుచ్చుటకు శివాజీ అతని అనుచరులు బిగ్గరగా "శివాజీ వచ్చాడు! పరుగెత్తండి, పట్టుకొనండి" అని కేకలు వేస్తు పరుగిడిరి. ఖాన్‌సైనికులు కూడా భయపడి పరుగిడుట మొదలిడిరి. శివాజీ అతని అనుచరులు సింహగడ్‌వైపు వెళ్లారు. ఖాన్‌సైనికులు రాత్రంతయు శివాజీని వెదకుతూనే యుండిరి.

శాయిస్తాఖాన్ భయకంపితుడైనాడు. "నేడు నావేళ్లు మాత్రమే పోయాయి. రేపు శివాజీ నా తలను కూడ నరికి తీసుకెళ్తాడు" అనే భయాందోళనతో ఉండి పోయాడు. ఔరంగజేబు చక్రవర్తి ఈ మాట వినగానే కోపగ్రస్తుడై శాయిస్తాఖాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అతడు వెంటనే ఉత్తర్వు పంపి శాయిస్తాఖాన్ బెంగాలుకు బదిలీచేశాడు.

ఇది మొఘలు పరిపాలకులకు పడిన తీవ్రమైన మొదటి దెబ్బ. శివాజీ నిర్భయంగా తన కోటలోకి అడుగుపెట్టగానే ఫిరంగుల మోత వినిపించింది మహారాష్ట్రమంతా ఆనంద డోలల్లో మునిగితేలింది.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణములోని సరైన పదంతో పూరించండి.**

అ) శాయిస్తాఖాన్ .......... కోటను ముట్టడించాడు.
(పురందర్, పన్హాల, శివనేరి)

ఆ) శాయిస్తాఖాన్ పుణెలోని ............. తిష్టవేశాడు.
(శనివార్‌వాడలో, లాల్‌మహల్‌లో, పర్వతీపై)

ఇ) ఔరంగజేబు చక్రవర్తి శాయిస్తాఖాన్‌ను ........... బదిలీ చేశాడు.
(అస్సాంకు, కర్నాటకకు, బెంగాల్‌కు)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శాయిస్తాఖాన్ ఏ గ్రామాలను ఆక్రమిస్తూ పుణెకు వచ్చాడు?

ఆ) శాయిస్తాఖాన్ సైన్యం ఎందుకు ఇబ్బంది పడ్డది?

ఇ) శాయిస్తాఖాన్‌కు ఏ భయం పట్టుకుంది?

**3. కారణాలు రాయండి.**

అ) ఔరంగజేబు చక్రవర్తి శివాజీపై కోప గ్రస్తుడయ్యాడు.

ఆ) శాయిస్తాఖాన్ కిటికీ గుండా పారిపోసాగాడు.

**4. కింది సంఘటనలను కాలానుక్రమంగా అమర్చండి.**

అ) శివాజీ మరియు అతని అనుచరులు సింహగడ్ వైపు వెళ్లారు.

ఆ) శాయిస్తాఖాన్ లాల్‌మహల్‌లో తిష్టవేశాడు.

ఇ) శాయిస్తాఖాన్ చాకణ్ కోటను వశపరచు కొన్నాడు.

ఈ) శివాజీ శాయిస్తాఖాన్‌కు గుణపాఠం చెప్పెను.

**ఉపక్రమం**

లాల్‌మహల్‌ను సందర్శించుటకు విజ్ఞాన యాత్రను నిర్వహించండి.

LSK7X1

# 12. పురందర్ ముట్టడి మరియు సంధి

**సూరత్‌పై దండయాత్ర :** ఈ విజయం తర్వాత శివాజీ ఊరకుండలేదు. ఔరంగజేబు సైన్యం మహారాష్ట్ర అంతటా వినాశకర కార్యాలతో అరాచకం సృష్టించుచుండెను. మొఘలు చక్రవర్తి కన్నులు తెరిపించుటకు శివాజీ సూరత్ పట్టణం పై దాడి సల్పాడు. ఎక్కడ పుణె, ఎక్కడ సూరత్? ఆ రోజుల్లో మొఘలు సామ్రాజ్యానికి సూరత్ గొప్ప వ్యాపార కేంద్రంగా ఉండేది. అంతేగాక అది సంపన్నమైన నగరం శివాజీ సూరత్ పై దాడి చేసి లక్షల కొలది రూపాయలను కొల్లగొట్టి తెచ్చాడు. సూరత్‌ను కొల్లగొట్టునప్పుడు శివాజీ ధర్మాన్ని విడిచిపెట్టలేదు. చర్చీలు, మసీదులను ముట్టుకోలేదు. స్త్రీలను కష్టపెట్టలేదు.

సూరత్ కొల్లగొట్టుట వల్ల చక్రవర్తి కోపోద్రిక్తుడైనాడు. అతడు మరాఠా రాజ్యాన్ని అంతం చేయదలచాడు. శివాజీని అణచివేయడానికి సైన్యాధిపతిగా ఉన్న మీర్జారాజే జయసింగ్‌ను అతనికి తోడుగా విశ్వాసపాత్రుడైన దిలేర్‌ఖాన్ అనే సర్దారును కూడా యిచ్చి పంపాడు. వారిరువురు అపారమైన ధనం, ఫిరంగులతో వెళ్లి సైన్యంతో దక్కను ప్రాంతానికి చేరారు. స్వరాజ్యానికి గొప్ప ఆపద ముంచుకొచ్చింది.

శివాజీ సూరత్ దండయాత్ర నుండి తిరిగి రాగానే క్రీ.శ. 1664 లో అతనికి కర్నాటక నుండి శహాజీరాజె వేటకు వెళ్లినపుడు ప్రమాదవశాత్తు మరణించాడనే విషాదవార్త తెలియవచ్చింది. శివాజీ, జిజాబాయి దుఃఖానికి అంతులేకుండా పోయింది. శివాజీ జిజామాతను తనయెదకు హత్తుకొని ఈ దుఃఖం నుండి బయటపడవేశాడు.



పురందర్ కోట

**మొఘలులు పురందర్‌ను ముట్టడించుట :** శివాజీకి ఉన్నబలమైన కోటలలో పురందర్‌కోట ఒకటి. శివాజీ పురందర్‌కోటకు అధిపతిగా ఉన్నంతకాలం అతనిని ఓడించలేమని దిలేరు ఖాన్‌కు తెలుసు. అందువల్ల అతడు ఆ బలమైన కోటను పెద్దసైన్యంతో ముట్టడించాడు. ఆ కోట మురార్‌బాజీ కిల్లేదార్ యాజమాన్యం కింద ఉండేది. అతడు పట్టుదలతో పోరాడగల పరాక్రమ వీరుడు. అతనికి అండగా ధైర్యసాహసాలు కలిగిన సైనికులుండిరి. వారి సహాయంతో మురార్‌బాజీ కోటను రక్షించుటకు పూనుకొన్నాడు.

దిలేర్‌ఖాన్ యొక్క ఫిరంగులు మోగసాగాయి. ఫిరంగిగుండ్ల వర్షము కోటపై కురియసాగింది. కాని మురార్‌బాజీ, అతని మావళీలు వెనుకంజ వేయలేదు. వారు ధీటుగా పోరాడసాగిరి. మొఘలుల ఫిరంగుల దాడి చేయసాగారు. ఫిరంగుల ధాటికి మాచీ బురుజు నేల కూలింది. మొఘలులు మాచీ బురుజు లోనికి ప్రవేశించారు. దిలేర్‌ఖాన్‌కోటను వశపరుచుకొన్నాడు. మరాఠాసైనికులు కోట పైభాగానికి వెళ్లి యుద్ధం చేయసాగిరి. దిలేర్‌ఖాన్ తన శిబిరం నుండి యుద్ధ రీతిని తిలకించుచుండెను.

కోపోద్రిక్తుడైన మురార్‌బాజీ ఐదు వందల మంది మావళీలను ఎంపిక చేసుకొన్నాడు. వారిని తీసుకొని మొఘలులపై దాడిచేయ సంకల్పించాడు. అతడు కోటపై ద్వారాలను తెరిచాడు. 'హరహర మహాదేవ్' అనే యుద్ధ నినాదంతో మురార్‌బాజీ, ఆయన మావళీలు మొఘలులపై విరుచుక పడ్డారు. కొద్దిసేపు భయంకర యుద్ధం కొనసాగింది. మరాఠాలు అపారమైన మొఘలు సైన్యాన్ని ఓడించారు. ఓడిపోయిన మొఘలు సైన్యం దిలేరుఖాన్ శిబిరం వైపు పారిపోయింది.

మురార్‌బాజీ వారిని తరుముచూ వెంట బడ్డాడు. తన సైనికులతో పాటు దిలేర్‌ఖాన్ శిబిరంలో ప్రవేశించి అచట విధ్వంసం సృష్టించాడు. శత్రుసైన్యం పారిపోవుచుండగా మరాఠాలు వారి వెంట బడ్డారు. శిబిరమంతయు అరుపులతో, కేకలతో నిండిపోయింది. గాభరాపడ్డ దిలేర్‌ఖాన్ త్వరగా ఏనుగు అంబారి పైకెక్కి ముందుకు చూడగా అతనికి మురార్‌బాజీ కనిపించెను. అతడు తన పదునైన కత్తితో శత్రువుల గుండెలను చీలుస్తూ, తలలు నరుకుతూ, గొంతులు కోయుచూ ఉండగా అతనిని ఎవ్వరూ ఆపలేకపోయిరి. దిలేర్‌ఖాన్ అతని వీరోచిత పరాక్రమాన్ని చూస్తూ ఆశ్చర్యచకితుడై నిల్చుండిపోయాడు.

**మురార్‌బాజీ సాటిలేని వీరత్వం :** దిలేర్‌ఖాన్‌ను చూచి మురార్‌బాజీ కోపంతో 'చంపండి, నరకండి, చీల్చి చెండాడండి' అని అరుస్తూ శత్రువుపై విరుచుకు పడ్డాడు. అతని కత్తి వీరోచితంగా దూసుకు పోవుట మొదలిడింది. తనకు అడ్డుపడిన సైనికులను అక్కడికక్కడే ముక్కలు ముక్కలుగా నరికి వేశాడు. ఈ ఏకైక వీరుణ్ణి మొఘలు సైనికులు నాలుగువైపుల చుట్టుముట్టిరి. ఇంతలో దిలేర్‌ఖాన్ అంబారీ పై నుండి గట్టిగా "ఆగండి" అని హెచ్చరించాడు. మొఘలు సైనికులు ఒక క్షణం ఆగి కొంచెం వెనుకకు కదిలిరి. ఖాన్ మురార్‌బాజీని ఉద్దేశించి, "మురార్‌బాజీ! నేటి వరకు నీలాంటి పరాక్రమశాలిని నేను చూడలేదు. నీవు మా పక్షానికి రమ్ము. చక్రవర్తి నిన్ను ఒక సర్దారును చేసి, జాగీరును ఇచ్చి బహుమతులతో గౌరవించును" అని పలికెను. మురార్‌బాజీ దిలేర్‌ఖాన్ మాటలు విని ఆక్రోశం నిండిన కన్నులతో "ఓరే! మేము శివాజీ మహారాజు యొక్క విశ్వాస పాత్రులగు సేవకులం. మీ రక్షణ ఎవరికి కావాలి? మాకేమి కొదువలేదు. మీ జాగీరులు ఎవరికి కావాలి?" అని సైనికుల నెదుర్కొంటూ దిలేర్‌ఖాన్



**మురార్‌బాజీ దేశ్‌పాండే - దిలేర్‌ఖాన్‌ల యుద్ధ దృశ్యం**

వైపు వెళ్లనారంభించెను. దిలేర్‌ఖాన్ అంబారీ పై నుండి బాణము వేశాడు. అది మురార్‌బాజీ గొంతులో చొచ్చుకొని పోగా అతడు నేలకొరిగాడు. మావళీలు అతని దేహాన్ని కోట పైభాగానికి తీసుకుపోయారు. తమ కిల్లేదారు(నాయకుడు) మరణించాడని వారు చాలా దుఃఖించారు. కాని "ఒక మరార్ బాజీ హతుడైనంత మాత్రాన ఏమైంది? మనం కూడా అలాంటి వీరులమే. ధైర్యంగా పోరాడుదాం" అంటూ అధైర్యపడకుండా మళ్లీ భీకరంగా పోరాడసాగారు.

శివాజీ ఈ వార్త విని మిగుల దుఃఖించాడు, ఒక్కొక్క కోటను ఒక్కొక్క సంవత్సరం వరకు కాపాడుతూ మొఘలు సైనికులను ఎదుర్కొన వచ్చునని అతనికి తెలుసు. కాని ప్రజలు అన్యాయంగా చనిపోవుదురు. ఇది శివాజీకి నచ్చలేదు.

**పురందర్ సంధి :** మరి ఏం చేయాలి? బాహుబలం విఫలమై, బుద్ధిబలం కూడా పని చేయనప్పుడు కొంతకాలం వరకు ఓటమి అంగీకరించుటయే యుక్తమైనది. అందుకని మొఘలులతో సంధి చేసుకొనుటకు శివాజీ నిశ్చయించు కొనెను. శివాజీ స్వయంగా జయసింగ్ వద్దకు వెళ్లాడు. అతనితో "మీర్జా ప్రభు! మీరు రాజపుత్ర వంశానికి చెందినవారు. మా బాధ మీరు అర్థం చేసుకోగలరు. చక్రవర్తి దండయాత్రల వల్ల మహారాష్ట్రం చాల దెబ్బతిన్నది. ప్రజల పరిస్థితి చాలా కఠినంగా ఉన్నది. ప్రజాక్షేమమే లక్ష్యంగా స్వరాజ్య కార్యాన్ని మేము చేపట్టాం. మీరు కూడా ఈ కార్యంలో చేదోడుగా ఉండినచో మేము, మా మావళీలు మీకు విశ్వాస పాత్రులుగా ఉంటాం" అని పలికెను.



**శివాజీ మీర్జారాజు జయసింగ్‌తో భేటి**

జయసింగ్ చాల విచక్షణగల రాజనీతిజ్ఞుడు. అతడు శివాజీని మొఘలు చక్రవర్తితో సంధి చేసుకొనమని చెప్పెను. శివాజీ సంధి చేసుకొన్నాడు. సంధి ఒడం బడికల ప్రకారం మొఘలు చక్రవర్తికి ఇరువైమూడు కోటలు, నాలుగు లక్షల బంగారు నాణెముల శిస్తు వసూలగు ప్రాంతం ఇవ్వబడింది. ఈ పురందర సంధి 1665వ సంవత్సరంలో జరిగింది.

పురందర సంధి ఒడంబడికలు జరిగిన తరవాత ఆగ్రాకు వెళ్లి చక్రవర్తిని కలవమని శివాజీకి జయసింగ్ సలహా నిచ్చాడు. శివాజీ సురక్షితంగా తిరిగి వచ్చుటకు అతడు హామీ ఇచ్చాడు. జయసింగ్ ఇచ్చిన సలహాపై శివాజీ బాగుగా ఆలోచించి, "చక్రవర్తి మోసగాడు. అతడు తన సొంత సోదరులకే నమ్మకద్రోహం చేశాడు". అని తలపోశాడు. ఇవన్నీ తెలిసి కూడా శివాజీ ఈ పరిస్థితిని జాగ్రత్తగా ఎదుర్కొనవలెనని నిశ్చయించు కొన్నాడు. ఆగ్రాకు వెళ్లి చక్రవర్తిని కలియుటకు సంసిద్ధంగా ఉన్నానని జయసింగ్‌కు శివాజీ సందేశం పంపాడు.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణములోని సరైన పదంలో పూరించండి.**

అ) ఆ రోజుల్లో మొఘలు సామ్రాజ్యానికి ............ గొప్ప వ్యాపార కేంద్రంగా ఉండెను.
(పుణె, సూరత్, ఢిల్లీ)

ఆ) పురందర్ కిల్లేదారు ........... గొప్ప పరాక్రమ వంతుడు.
(బాజీ ప్రభు, తానాజీ, మురార్‌బాజీ)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శివాజీ సూరత్ పట్టణంపై ఎందుకు దాడి చేశాడు?

ఆ) దిలేర్‌ఖాన్ పురందర్‌ను ఎందుకు ముట్టడించాడు?

ఇ) మొఘలులతో సంధి చేసుకొనుటకు శివాజీ ఎందుకు నిశ్చయించుకొన్నాడు?

ఈ) పురందర్ సంధిలో శివాజీ ఏ ప్రాంతాన్ని మొఘలులకు ఇచ్చుటకు ఒప్పుకొన్నాడు?

**3. రెండు-మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) మురార్‌బాజీ పరాక్రమాన్ని చూసి దిలేర్‌ఖాన్ అతనితో ఏమన్నాడు?

ఆ) మురార్‌బాజీ దిలేర్‌ఖాన్‌కు ఏమని సమాధానమిచ్చాడు?

**4. పాఠంలో వచ్చిన పేర్లు అక్షరాన్ని బట్టి పూర్తి పదం రాయండి**

అ) ఔ ......................................

ఆ) పు ......................................

ఇ) ము ......................................

ఈ) జ ......................................

ఉ) ది ......................................


**ఉపక్రమం**

మీ పరిసరాలలోని కోటలను సందర్శించండి. ఆ కోటల గురించి ఉపాధ్యాయుల నడిగి వివరాలు తెలుసుకోండి.

# 13. మొఘలు చక్రవర్తిపై ఎత్తుగడ

జయసింగ్ మాటలపై విశ్వాసముంచి శివాజీ, మొఘలు చక్రవర్తిని కలసుకొనుటకు ఆగ్రాకు బయలుదేరెను. వెళ్లేముందు శివాజీ స్వరాజ్య పరిపాలన జిజామాత చేతుల్లో పెట్టి ఆమె ఆశీర్వాదములను పొందాడు. అతని వెంట తన కుమారుడు సంభాజీరాజెను, ఎన్నుకొన్న సర్దారులను, మరికొంత మంది విశ్వాస పాత్రులైన వ్యక్తులను, అపార ధనాన్ని తీసుకు వెళ్లాడు. అక్కడక్కడ విడిది చేస్తూ ఆగ్రాకు చేరుకున్నాడు.

**చక్రవర్తి దర్బారులో స్వాభిమానాన్ని ప్రదర్శించుట:** శివాజీ నిశ్చయించుకున్న ప్రకారంగా చక్రవర్తి దర్బారుకు హాజరయ్యాడు. యువరాజు సంబాజీ రాజె కూడా వెంటనుండెను. ఆరోజు ఔరంగజేబు చక్రవర్తి యొక్క ఏబదవ జన్మదినోత్సవం. చక్రవర్తి దర్బారును ముగించి రాజకార్యాలను చర్చించుటకు మహల్లో ప్రవేశించాడు. అతనికి ఎదురుగా ఎన్నుకొన్న సర్దారులు తమ తమ హోదాననుసరించి నిలబడి యుండిరి. చక్రవర్తి శివాజీని వెనుక వరుసలో నిలబెట్టాడు. మరాఠుల చేతిలో అనేక పర్యాయాలు పరాజయం పొంది పారిపోయిన జస్వంత్‌సింగ్ రాఠోడ్ శివాజీ కంటే ముందు వరుసలో నిలబడి యుండెను. శివాజీ తన మనస్సులో



బాద్‌షా దర్బారులో శివాజీ

మహారాష్ట్ర రాజ్యానికి సార్వభౌమాధికారంగల రాజును నేను. నాకు దక్కాల్సిన గౌరవస్థానం మొదటి వరుసలో ఉండాల్సింది. కాని చక్రవర్తి వెనుక వరుసలో నిలబెట్టాడు. దీని ఉద్దేశమేమి? అనుకొని కోపంతో కన్నెర్ర చేసుకొనెను. ఈ అవమానం సహిం పలేకపోయాడు. కోపోద్రిక్తుడైన శివాజీ మహలు బయటకు వచ్చెను. నేరుగా తన నివాసానికి వెళ్లెను. ఇక ఎన్నటికీ చక్రవర్తికి ముఖం చూపరాదని నిశ్చయించుకొనెను.

ఈ విధంగా వచ్చిన పని విఫలమైంది. జరిగిన వాస్తవ సంఘటన నలుమూలలా వ్యాపించింది.

**చక్రవర్తి నమ్మకద్రోహం :** శివాజీ నివాసం చుట్టూ ఔరంగజేబు కాపలాకాయు భటులను నియమించాడు. చక్రవర్తి చేతిలో శివాజీ, సంభాజీ రాజెలు ఖైదీలైనారు. చక్రవర్తి నమ్మక ద్రోహం చేశాడని శివాజీ గ్రహించాడు. ఇక అతను నన్ను ఎన్నటికి విడిచి పెట్టడని కూడా గ్రహించాడు.

రోజులు గడవసాగాయి. ఒక రోజు శివాజీ నన్ను మహారాష్ట్రకు పోవుటకు అనుమతించమని చక్రవర్తికి విన్నవించుకొనెను. కాని చక్రవర్తి పెడచెవిన పెట్టెను. అలా అతడు ఎన్ని సార్లు ప్రయత్నించిననూ ఫలితం లేకుండా పోయింది. ఏ విధంగానైనా చక్రవర్తి ఖైదు నుండి తప్పించు కోవాలని శివాజీ నిశ్చయించు కొన్నాడు. మొదట చక్రవర్తి అనుమతితో తన వెంట వచ్చిన వారిని దక్షిణ ప్రాంతానికి తిరిగి పంపాడు. వారు వెళ్లడంతో చక్రవర్తి సంతోషించి "శివాజీ బలం తరగడం ఒకింతకు మంచిదే" అయిందనుకొన్నాడు. ఇప్పుడు శివాజీ వెంట సంభాజీ రాజె, హిరోజి ఫర్జంద్ మరియు మదారి మెహతర్ సేవకులు మాత్రమే మిగిలిపోయారు.

ఆ తర్వాత ఒకరోజు శివాజీ జబ్బు పడినట్లు నటించాడు. తన కడుపులో బాధ ఉన్నట్లు వ్యక్తం చేశాడు. వైద్యులను పిలిపించి చికిత్స చేయనారంభించారు. రోగ నివారణకై సాధువులకు, మౌల్వీలకు బుట్టలలో మిఠాయిలు పంచనారంభించాడు.

**పెట్టెల నుండి తప్పించుకొనుట :** ప్రారంభంలో బయటనున్న కాపలాదారులు ప్రతి దినం మిఠాయి బుట్టలు తెరిచి తనిఖీ చేయుచుండిరి. కొద్ది రోజులు గడచిన తర్వాత వారు విసుగుచెంది ప్రతిరోజు తనిఖీ చేయుట ఎందుకని తనిఖీ మానుకొనిరి. ఒకనాటి సాయంత్రం శివాజీ స్థానంలో హిరోజిని పరుండబెట్టి అతని కాళ్లు ఒత్తుటకు మదారిని కూర్చుండ బెట్టెను. ఆ తరువాత శివాజీ మరియు సంభాజీ రాజె ఒక్కొక్క బుట్టలో కూర్చొని దాగుకొనిరి. బుట్టలు యధావిధిగా బయటకు తీసుకుపోబడ్డాయి. నిర్ణయించిన స్థలానికి క్షేమంగా చేరుకున్నారు. అక్కడ శివాజీ నమ్మిన బంటు సిద్ధంగా గుర్రాలతో ఉండెను. ఇక్కడ వైద్యుని వద్ద నుండి మందు తెచ్చు నెపంతో హిరోజీ, మదారీలు అక్కడ నుండి పలాయనమైరి. మహారాజును ఖైదునుండి విడిపించే పనిలో వీరిద్దరు ప్రాణత్యాగానికి సిద్ధపడి చాలా గొప్ప విజయాన్ని ఇచ్చారు.

మరుసటి రోజు శివాజీ తన ఆధీనం నుండి తప్పించుకుపోయాడన్న వార్త చక్రవర్తికి తెలిసింది. చక్రవర్తి కోపోద్రిక్తుడయ్యాడు. సర్దారులు భయపడసాగిరి. శివాజీని వెదకుటకు చక్రవర్తి నలుమూలలా గూఢాచారులను పంపాడు. కాని వారి అన్వేషణ వృథా అయింది. చక్రవర్తి వల నుండి మరాఠా సింహం తప్పించుకొని శాశ్వతంగా బయటపడింది. వేషం మార్చి శత్రువుల కన్నుగప్పి శివాజీ తన స్థావరానికి చేరుకున్నాడు. సంభాజీ ని మథురలో సురక్షిత ప్రదేశంలో ఉంచి ముందుకు ప్రయాణమయ్యెను. శివాజీ సురక్షితంగా ఇంటికి



శివాజీ మహారాజు ఆగ్రా నుండి తప్పించుకొనుట

చేరుకొన్నందుకు జిజాబాయి ఎంతో సంతోషించింది. రెండు నెలల పిదప సంభాజీ రాజె కూడా సురక్షితంగా రాజగడ్‌చేరుకున్నాడు. ఈ విధంగా శివాజీ గొప్ప నైపుణ్యంతో మొఘలు చక్రవర్తి కన్ను గప్పి తప్పించుకున్నాడు. ఈ సంఘటన 1666 సంవత్సరంలో జరిగింది.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదంతో పూరించండి.**

అ) శివాజీ చక్రవర్తి దర్బారుకు వెళ్లిన రోజున ఔరంగజేబు యొక్క ............... జన్మ దినోత్సవం ఉండెను.
(ఏబదవ, నలుబదవ, అరవదవ)

ఆ) ఆగ్రా నుండి వచ్చుచున్నప్పుడు సంభాజీ రాజెను ................. ఒక సురక్షిత ప్రాంతంలో ఉంచెను.
(ఝాన్సీలో, మధురలో, ఢిల్లీలో)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) ఆగ్రాకు వెళ్లేముందు శివాజీ స్వరాజ్య పరిపాలనను ఎవరి చేతుల్లో పెట్టాడు?

ఆ) ఆగ్రా జైలులో శివాజీతో పాటు ఎవరెవరు ఉండిరి?

ఇ) ఆరోగ్యం బాగు పడవలెనని శివాజీ ఏమి చేసెను?

**3. రెండు-మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) శివాజీ ఔరంగజేబు దర్బారు నుండి కోపంతో ఎందుకు బయటకు వచ్చాడు?

ఆ) శివాజీ తప్పించుకొనుటకు ఏ ఉపాయం పన్నాడు?

**ఉపక్రమం**

శివాజీ ఆగ్రా జైలు నుండి తప్పించుకొని వచ్చిన చిత్రాన్ని తయారుచేయండి.

# 14. కోట దొరికింది, కానీ సింహం పోయింది

**జిజామాత కోరిక :** శివాజీ జయసింగ్‌కు ఇచ్చిన ఇరవై మూడు కోటలు ఇంకనూ మొఘలుల ఆదీనం లో ఉండెను. వాటిలో కొండాణా కోట ఒకటి. ఒకనాడు జిజామాత "శివబా! కొండాణా లాంటి బలమైన కోట మొఘలుల ఆధీనంలో ఉండుట మంచిది కాదు. దానిని జయించి మన ఆధీనంలోనికి తీసుకో" అని శివాజీతో పలికెను. పుణెకు సమీపంలోనున్న కొండాణా కోటను స్వరాజ్యంలో ఒక అంతర్భాగం గా చేర్చాలని శివాజీ కూడా తహతహలాడు చుండెను. కొండాణా మొఘలుల చేతిలో ఉండే అంశం శివాజీ, జిజామాతలు మనస్సులో వాపోవు చుండిరి. శివాజీ కొండాణాను తిరిగి జయించుటకు నిశ్చయించుకొన్నాడు. కాని కొండాణా జయించుట చాలా కష్టతరమైన పని. అటువంటి పనికి తగిన వ్యక్తి ఎవరాయని శివాజీ ఆలోచించు చుండెను.


**తానాజీ మాలుసరే :** మొదటి నుండి తానాజీ శివాజీకి అనుచరుడిగా వుండెను. అతడు కొంకణ్ ప్రాంతంలోని మహాడ్ సమీపాన గల ఉమరఠే గ్రామానికి చెందినవాడు. అతడు శివాజీ ఆదేశించిన ఏ కార్యాన్నైనా మనస్ఫూర్తిగా చేయడానికి సిద్ధంగా నుండే వాడు. అతడు శరీరధారుఢ్యుడే గాక గొప్ప బలశాలి కూడా. ఎంతటి సాహసోపేతుడో అంతటి తెలివిగల వాడు. అతనికి శివాజీపై అమితమైన భక్తి గలదు.



**మొదట కొండాణా పెళ్లి :** తానాజీ తన కుమారుని పెండ్లి హడావుడిలో ఉండెను. అతనికి రాయబా ఒక్కడే కుమారుడు. తానాజీ ఇంట్లో రాయబా పెండ్లి సన్నాహాలు జోరుగా సాగుచుండెను. పెళ్లికి కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉండెను. శివాజీ మరియు జిజాబాయిలను వద్దకు వెళ్లి వారిని రాయబా పెళ్లికి ఆహ్వానించాలని తానాజీ తలంచి, శేలారు మామను వెంట తీసుకొని శివాజీ వద్దకు వెళ్లాడు. వివాహ ఆహ్వానాన్ని శేలారు మామ శివాజీకి అందజేశాడు. ఆహ్వానం స్వీకరిస్తూ అతనితో "శేలారు మామా! మీరు రాయబా పెళ్లి జరిపించండి. నేను స్వయంగా పెళ్లికి రాలేక పోవుచున్నాను. ఎందుకంటే నేను కొండాణా కోటను జయించడానికి బయలుదేరు చున్నాను" అని శివాజీ అనెను.

శివాజీ మాటలు విన్న వెంటనే తానాజీ "మహారాజా! తానాజీ బ్రతికుండగా అంతటి ప్రమాదకరమైన దండయాత్ర చేయుటకు పూనుకుంటారా? మరి నా వంటి వారు ఉండి కూడ ప్రయోజనమేమి? అలా జరగడానికి వీల్లేదు. మొదట కొండాణాను ముట్టడించి దాని పెళ్లి చేసిన తర్వాతే రాయబా పెళ్లి చేస్తా. కొండాణా దుర్గాన్ని జయించుకొనే వస్తా! నన్నాశీర్వదించండి" అని పల్కెను.

**తానాజీ యుక్తి :** తానాజీ దండయాత్రకు నాయకత్వం వహించి కొండాణాకు బయలుదేరాడు. కొండాణా కోట



తానాజీ కొండాణా సెక్కుట

జయసింగ్‌చే నియమింపబడిన ఉదయ భానుడనే పేరుగల రాజపుత్రుని స్వాధీనంలో ఉండెను. ఉదయభానుడు చాలా అప్రమత్తతతో మెలిగేవాడు. కోటకు రెండు ద్వారాలుండేవి. అచట ఉదయభానుడు కట్టుదిట్టమైన కాపలా పెట్టియుం డెను. మరి కోటపైకి పోవుట ఎలా? తానాజీ కోటను నలువైపులా పరిశీలించాడు. పశ్చిమ దిక్కున చాలా ఎత్తైన కొండ వుంది. అచ్చట కాపలా లేదు. ఆ కొండనెక్కి పోవాలని తానాజీ నిశ్చయించుకొన్నాడు. అతడు తన సోదరునితో "సూర్యాజీ, నీవు ఐదు వందల మంది సైనికులను తీసుకొని కళ్యాణ దర్వాజా వద్దకు చేరుకో. నేను మూడు వందల మంది మావళీలను తీసుకొని కొండను ఎక్కి కోటలోనికి ప్రవేశించెదను. అక్కడికి చేరుకున్న వెంటనే మేము కళ్యాణ దర్వాజాను తెరిచెదం. మీరందరు లోపలికి రండి. అందరూ కలిసి మొఘలు సైన్యాన్ని హతమార్చవచ్చు" అని చెప్పాడు. సూర్యాజీ, తానాజీ లిద్దరూ తమతమ మార్గాల వైపు బయలుదేరిరి.

**కొండ నుండి కోటలోకి :** అది రాత్రి సమయం. తానాజీ, అతని అనుచరులు కొండ దిగువభాగానికి చేరారు. కీచురాళ్లు శబ్దం చేస్తుండెను. ఐదారు మంది తానాజీ యొక్క యువ మావళీలు కొండనెక్కుట ఆరంభించిరి. అది నిటారుగా నున్న కొండ. కొండ చరియలను పట్టుకొని, పగుళ్లలో వేళ్లు పెట్టుకొని ధైర్యంగా కొండపైకి ఎక్కి పై భాగానికి చేరుకొనిరి. వారుపైకి చేరుకోగానే ఒక బలమైన చెట్టుకు పెద్ద తాడు ఒక చివరను గట్టిగా కట్టి దానిని కొండ కిందికి వదిలారు. ఇంకేముంది? తానాజీ, అతని మావళీలు తాడు సహాయంతో కోతుల వలె కొండను ఎక్కి కోటపైకి వెళ్లిరి.

**తానాజీ పరాక్రమం :** సూర్యాజీ తన మావళీలతో సహా కళ్యాణ దర్వాజా దగ్గరకు చేరుకొని ద్వారం ఎప్పుడు తెరువబడుతుందా అని ఎదురు చూచుచుండిరి. యుద్ధం ప్రారంభమైంది. ఉదయ భానునికి విషయం తెలిసింది. యుద్ధ భేరి మ్రోగింది. ఉదయభానుని సైన్యం మావళీలను ఎదుర్కొన్నది. ఖడ్గంతో ఖడ్గం ఢీ కొన్నది. భీకర యుద్ధం మొదలైంది. డాల్లు ఖనఖనా మ్రోగాయి. దివిటీల నాట్యం మొదలైంది. మావళీలు కళ్యాణ దర్వాజాను తెరిచారు. తానాజీ సింహంవలె పోరాడుచుండెను. ఉదయభానుడు అతనిని ఎదుర్కొనెను. ఇద్దరి మధ్య యుద్ధం మొదలైంది. ఇద్దరూ శూరులే. ఎవరూ వెనుదిరగలేదు. ఇంతలో తానాజీ ఢాలు విరిగింది. అతడు తన తలపాగా వస్త్రాన్ని చేతికి చుట్టుకొన్నాడు. దానిపై దెబ్బలుపడుతున్నా పోరాడుతూనే వున్నాడు. చివరికి వారిరువురు ఒకరితో ఒకరు పోరాడు కొని తీవ్రంగా గాయపడి నేల కొరిగారు.

**కోట దొరికింది కానీ సింహం పోయింది :** తానాజీ చనిపోయెను, అది చూచి మావళీలకు ధైర్యం తగ్గిపోయెను. వారు పారిపోవుట ప్రారంభించిరి. అంతలో సూర్యాజీతో పాటు అతని వెంట మావళీలు కళ్యాణ దర్వాజా నుండి లోపలికి చేరుకొనిరి. తన సోదరుడు చనిపోయినది చూచి సూర్యాజీ మిక్కిలి దుఃఖించాడు. కాని అది దుఃఖించే సమయం కాదు. పోరాడ వలసిన సమయం. సూర్యాజీ కొండపైనున్న త్రాడును తెగనరికాడు. పారిపోవుచున్న మావళీలను అడ్డగించి "అరే, మీ తండ్రి ఇచ్చట మరణించి యున్నాడు. పిరికి పందలవలె పరుగెత్తుటకు మీకు సిగ్గుకాదా? వెనుకకు మరలండి. నేను కొండపైనున్న తాడును నరికివేశాను. కొండ పై నుండి దూకి మరణించండి, లేదా శత్రువులపై విజృంభించండి."

మావళీలు వెనుకకు మరలిరి. భయంకరమైన యుద్ధం జరిగింది. మావళీలు కోటను జయించిరి. కానీ కోటను సాధించుటలో తానాజీ లాంటి వీరున్ని కోల్పోయారు. ఈ వార్త జిజామాత, శివాజీలకు తెలిసింది. వారు చాలా దుఃఖించారు. శివాజీ బాధపడుతూ కోట వశమయింది కానీ సింహం లాంటి వీరుడు తానాజీ పోయాడు. అని మెల్లగా కోట దొరికింది, కానీ సింహం పోయింది! అని అన్నాడు.

కొండాణా దుర్గం పేరు సింహగడ్‌గా మారింది. ఈ సంఘటన 1670వ సంవత్సరంలో జరిగింది. ఆ తర్వాత శివాజీ స్వయంగా ఉమరఠేకు వెళ్లి రాయబా వివాహాన్ని జరిపించాడు.

## అభ్యాసం

**1. సరియైన పర్యాయం యొక్క వలయాన్ని రంగరించండి.**

అ) తానాజీ కొంకణంలోని ఈ గ్రామానికి చెందినవాడు.

(1) మహాడ్ ○ (2) చిప్‌ళూణ్ ○

(3) ఉమరఠే ○ (4) రత్నగిరి ○

ఆ) జయసింగ్ నియమించిన ఉదయభానుడు ఈ కోటకు సర్దారుగా వుండెను.

(1) పురందర్ ○ (2) కొండాణా ○

(3) రాయగడ్ ○ (4) ప్రతాపగడ్ ○

ఇ) తానాజీ సోదరుని పేరు

(1) రాయబా ○ (2) సూర్యాజీ ○

(3) మురార్‌బాజీ ○ (4) ఫిరంగోజీ ○

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) కొండాణా కోట ఎవరి స్వాధీనంలో వుండెను?

ఆ) కొండాణా కోట గురించి జిజామాత శివాజీతో ఏమనెను?

ఇ) మొదట కొండాణా పెళ్లి, తర్వాత రాయబాది అని ఎవరు అనిరి?

**3. రెండు-మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) శేలారు మామ శివాజీని రాయబాపెళ్లికి ఆహ్వానించినపుడు శివాజీ ఏమనెను?

ఆ) సింహగడ్‌పై సూర్యాజీ మావళీలతో ఏమనెను?

**ఉపక్రమం**

మీ పరిసరాలలోని చరిత్రాత్మక కట్టడాల జాబితా తయారు చేయండి.

LT98E2

# 15. ఒక మరపురాని మహోత్సవం

**పట్టాభిషేకం ఎందుకు జరిగింది? :** శివాజీ రాయరేశ్వరాలయంలో స్వరాజ్య స్థాపనకు శపథం చేశాడు. స్వరాజ్యం స్థాపించుటలో అనేక కష్టాలను ఆపదలను ఎదుర్కోవలసి వచ్చింది. అయినా అతడు గొప్ప ధైర్యంతో, నైపుణ్యంతో వాటన్నిటిని అధిగమించాడు. బాజీప్రభు, మురార్‌బాజీ, తానాజీ మొదలగు వారు స్వరాజ్యం కొరకు పోరాడుతూ తమ ప్రాణాలనే అర్పించారు. చివరికి స్వరాజ్యం ప్రాప్తించింది. శత్రువులు అణచి వేయబడ్డారు.

ఈ స్వరాజ్యాన్ని రాజులందరూ గుర్తించవలెనను ఉద్దేశంతో శివాజీ పట్టాభిషేకం జరుపుకోదలచాడు. మతాలన్నిటిని సమానంగా ఆదరించి ప్రజలకు న్యాయాన్ని, సుఖాన్ని అందజేయగల రాజు కొన్ని వందల సంవత్సరాల తర్వాత మహారాష్ట్రలో జన్మించాడు. స్వరాజ్యం స్థాపించబడినదని ప్రపంచానికి తెలియ జేయడానికి గాను శివాజీ తన పట్టాభిషేకాన్ని జరుపుకోదలచాడు. అతడు తన సుఖ సంతోషాల కొరకు గాని లేదా తన ఘనత కొరకు గానీ పట్టాభిషేకాన్ని జరుపుకోలేదు. కేవలం స్వరాజ్యం సుస్థిరమగుటకే ఆపని చేశాడు.


**స్వరాజ్యానికి రాజధాని :** శివాజీ రాజధాని కొరకు రాయగడ్‌ను ఎన్నుకొన్నాడు. రాయగడ్ బలమైన కోట. రాయగడ్ నుండి సులభంగా పాలించడానికి, శత్రువులపై నిఘా పెట్టడానికి అది చాలా అనుకూలంగా ఉండునని అతడు తలచాడు.

చిప్లూన్ వెళ్లి శివాజీ తన సైన్యాన్ని తనిఖీ చేశాడు. ప్రతాపగడ్‌కు వెళ్లి భవానీ దేవిని సందర్శించాడు. కృతజ్ఞతా భావంతో జ్ఞాపక చిహ్నంగా ఒక సువర్ణ ఛత్రాన్ని దేవికి సమర్పించాడు.

**పట్టాభిషేక సన్నాహం :** శివాజీ ఒక సువర్ణ సింహాసనాన్ని తయారు చేయించి, దానిని విలువైన రత్నాలతో అలంకరింపజేశాడు. దానిపై ఒక శ్వేతఛత్రాన్ని ఉంచాడు. రాజులకు, రాజకుమారులకు, విద్యాకోవిదులైన బ్రాహ్మణులకు, తన ఆధీనంలో ఉన్న సర్దారులకు, అధికారులకు ఆహ్వానాలు పంప బడ్డాయి. పట్టాభిషేక మహోత్సవ కార్యనిర్వహణకు పౌరోహిత్యం చేయడానికి కాశీ నుండి గాగాభట్టు వచ్చెను. గాగాభట్టు పైఠణ్‌కు చెందిన వాడైననూ కాశీలో స్థిరపడెను. అతడు గొప్ప పండితుడు. కాశీక్షేత్రంలో అతడు చాలా గౌరవింపబడుచుండెను. అంతటా అతని కీర్తి వ్యాపించెను.

శివాజీ పట్టాభిషేక సన్నాహాలను శక్తివంచన లేకుండా చేశాడు. ఏడు నదుల నుండి, సముద్రాల నుండి జలాన్ని తెచ్చుటకు మనుష్యులను పంపబడెను. దాదాపు యాభైవేల మంది ప్రజలు రాయగడ్‌కు వచ్చారు. వారి కొరకు అక్కడక్కడ గుడారాలు, షామియానాలు ఎన్నో వేయబడ్డాయి.

**పట్టాభిషేక మహోత్సవం :** పట్టాభిషేకపు రోజు రానే వచ్చింది. అది గొప్ప శుభదినం వాయిద్యాలు వాయించుట ప్రారంభమయ్యెను. సంగీతం, పాటలు పాడసాగారు. ప్రజల ఆనందానికి అవధులు లేకుండెను. శివాజీ రాజు బంగారు పీటపై కూర్చొని యుండెను. అతనిపైన ఛత్ర చామరాలు పట్టుకొనిరి. నెయ్యి, పెరుగు, తేనెల కళశాలు పురోహితుల చేతులలో ఉండెను. గంగా, సింధు, యమున, గోదావరి, కృష్ణా, నర్మదా, కావేరి మొదలగు సప్తనదుల మరియు సముద్ర జలం నింపబడిన సువర్ణ కళశం గాగాభట్టు చేతిలో యుండెను. గాగాభట్టు శివాజీ



శివాజీ పట్టాభిషేక మహోత్సవం

శిరస్సుపై ఆ కళశం నుంచి, పట్టాభిషేక మంత్రాలను జపించనారంభించాడు. వందల సంఖ్యలో వున్న కళశ రంధ్రాల ద్వారా జలము శివాజీ శిరస్సునభిషేకించెను. తర్వాత శివాజీ లేచి జిజామాతకు పాదాభివందనం చేశాడు. జిజామాత అతనిని మనసారా కౌగిలించుకొన్నది. ఆమె కన్నుల నుండి ఆనంద భాష్పాలు రాలాయి. ఆమె ముప్పది సంవత్సరాల నుండి కష్టించినందుకు నేడు ఫలితం లభించింది. శివాజీ పుట్టుక పూర్వం నుండి ఆమె కన్న కలలు చివరకు నిజమాయెనని సంతృప్తితో ఆనంద భాష్పాలు రాల్చింది. శివాజీ మహారాజు మనస్సు ఉప్పొంగి పోయింది. జిజామాత, శివాజీ ఎంత ధన్య చరితులో కదా!

శివాజీ మహారాజు తల్లిని కలుసుకొన్న తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించాడు. అతని ప్రక్కన మహారాణి సోయరాబాయి, యువరాజు సంభాజీ రాజె కూర్చొని యుండిరి. అష్ట ప్రధానులు అతనికి ఇరుప్రక్కల నిలబడి యుండిరి. గాగాభట్టు ముత్యాలతో అలంకరించబడిన ఛత్రాన్ని అతని శిరస్సుపై పట్టుకొని "క్షత్రియ వంశీయుడైన సింహాసనాధీశ్వరుడు శ్రీ శివ ఛత్రపతికి జయం కల్గుగాక!" అంటూ గట్టిగా పల్కెను. అచట చేరినవారందరు కలసి ముక్త కంఠంతో శివాజీకి జయం కల్గుగాక అని పల్కిరి. శుభసూచకంగా కోటపై ఫిరంగులు మ్రోగాయి. శివాజీ మహారాజు జై అను నినాదం మహారాష్ట్ర అంతటా మారుమ్రోగెను. ఈ విధంగా శివాజీ పట్టాభిషేకం 1674 సంవత్సరంలో జరిగింది. ఆ సంవత్సరం నుండి 'పట్టాభిషేకం' పేరుతో శివాజీ మహారాజు క్రొత్తశకం ప్రారంభించాడు. శివాజీ మహారాజు "శక కర్తరాజు" అయ్యాడు. అతడు తన స్వతంత్ర నాణెములను ముద్రించాడు. వివిధ దేశాల రాయబారులు కూడా ఈ పట్టాభిషేకంలో పాల్గొనిరి. ఆంగ్లేయులు 'ఆక్జిండెన్' అనుపేరు గల రాయబారితో కానుకలిచ్చి పంపించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి సుదూరం నుండి ప్రజలెందరో వచ్చి యుండిరి. శివాజీ పట్టాభిషేకం ప్రపంచమంతటా తెలిసెను. శివాజీ కీర్తి నలుమూలలా వ్యాపించెను.

## అభ్యాసం

**1. ఖాళీలను కుండలీకరణంలోని సరియైన పదంతో పూరించండి.**

(అ) శివాజీ రాజధాని కొరకు ....................ను ఎన్నుకొనెను.
(సింహగడ్, రాయగడ్, పన్హాల్‌గడ్)

(ఆ) శివాజీ పట్టాభిషేకం .................. సంవత్సరంలో జరిగింది.
(1674, 1675, 1647)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) సువర్ణ కళశం ఏయే నదుల జలాలతో నింపబడి యుండెను?

ఆ) శివాజీ పట్టాభిషేకంతో ఏ శకం మొదలైంది?

**3. రెండు-మూడు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) శివాజీ పట్టాభిషేకం జరుపుకొనుటకు ఎందుకు నిశ్చయించుకొనెను?

ఆ) శివాజీ రాజధాని కొరకు రాయగడ్‌ను ఎందుకు ఎన్నుకొనెను?

ఇ) జిజామాత కన్నుల నుండి ఆనంద భాష్పాలు ఎందుకు రాలసాగాయి?

**ఉపక్రమం**

అ) పట్టాభిషేక సందర్భంగా ముద్రించిన నాణెముల గురించి ఉపాధ్యాయుల ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోండి.

ఆ) వివిధ రకాల తపాలా బిళ్లలను సేకరించండి. వాటిని మిత్రుల సహాయంతో తరగతిలో ప్రదర్శించండి.

# 16. దక్షిణదేశ దండయాత్ర


**దండయాత్రకు పథకం :** పట్టాభిషేక మహోత్సవం ముగిసింది. అయితే ఆనందం దీర్ఘకాలం నిలువలేక పోయింది. పట్టాభిషేకం జరిగిన స్వల్ప కాలంలోనే 1674 సంవత్సరం జూన్17 వ తేదీ నాడు జిజామాత మరణించింది. శివాజీ గొప్ప ఆధారం కోల్పోయాడు. స్వరాజ్యంలో ప్రజలందరు శివాజీపై ఆధార పడేవారు కాని శివాజీ మాత్రం తన తల్లిపై ఆధారపడేవారు. ఆమె అతని జీవితంలో నిజమైన మార్గదర్శకురాలు మరియు గురువుగా ఉండెను. తన తల్లి మరణం వల్ల అతనికి చాలా దుఃఖం కలిగింది. కాని అతడు దుఃఖించుతూ ఉండలేదు. తాను స్థాపించిన స్వరాజ్యాన్ని పాలించవలసి యున్నది.

శివాజీ కర్నాటక ప్రాంతంపై దండెత్తుటకు నిశ్చయించుకున్నాడు. అతనికి ఇప్పుడు ఆదిల్‌షాహ అంటే భయంలేదు. ఎందుకంటే ఆదిల్‌షాహ రాజ్యం క్షీణదశకు చేరుకుంది. కాని ఉత్తరాన గల మొఘల్‌చక్రవర్తి ఔరంగజేబు మాత్రం స్వరాజ్యాన్ని నాశనం చేయడానికి ఎదురు చూస్తుండెను. అతడు తన రాజ్యంపై ఎప్పుడు దండెత్తి వస్తాడో తెలియదు. కావున దక్షిణాన ఒక బలమైన స్థావరం ఏర్పరచుకున్నచో మొఘలుల దాడిని ప్రతిఘటించవచ్చునని శివాజీ తలంచాడు. ఆ ఉద్దేశంతోనే అతడు దక్షిణ దేశ దండయాత్ర చేయడానికి ఒక పథకం పన్నాడు. ఈ దండయాత్ర కొరకు శివాజీ గోల్కొండను పాలించు కుతుబ్‌షాహ సహాయం కోరాడు. అందుకు అతడు చాలా సంతోషంగా శివాజీకి సహాయం చేయడానికి అంగీకరించాడు.

ఈ దండయాత్ర చేయడానికి శివాజీకి మరొక కారణం కూడా కలదు. శివాజీ సవతి సోదరుడు వెంకోజీ రాజె దక్షిణాన ఉన్న తంజావూరు జాగీరు వ్యవహారాలు చూచుచుండెను. కర్నాటకలోని తన తండ్రి యొక్క జాగీరు కూడ అతని వద్దనే ఉండెను. అందునుండి కొద్దిభాగం కూడ వెంకోజీరాజు శివాజీకి ఇవ్వకుండెను. అంతేకాకుండా స్వరాజ్యంపట్ల అతనికి ఏమాత్రం ఆదరభావం లేకుండెను. అతడు శివాజీ తో దురుసుగా ప్రవర్తించేవాడు. అయినను శివాజీ తాను స్వయంగా వెళ్లి అతన్ని కలిస్తే స్వరాజ్యం కొరకు అతని సహకారం అందుతుందేమో చూద్దాం అనే ఆలోచన శివాజీ మనసులో ఉండెను.

**గోల్కొండను సందర్శించుట :** శివాజీ మహారాజు కర్నాటకకు వెళ్లడానికి బయలుదేరాడు. గోల్కొండ నవాబగు అబుల్‌హసన్ కుతుబ్‌షాహ అతనికి గోల్కొండకు ఆహ్వానించాడు. కనుక అతడు కుతుబ్‌షాహ యొక్క రాజధానిని మొదట దర్శించి తర్వాత దక్షిణమును జయింప నిశ్చయించుకొనెను.

కుతుబ్‌షాహ రాజ్యానికి గోల్కొండ రాజధాని. కుతుబ్‌షాహ శివాజీని ఆహ్వానించడానికి గొప్ప సన్నాహాలు చేశాడు. ఇరువురు కలుసుకొనడానికి ప్రత్యేకంగా ఒక షామియానా వేయించాడు. శివాజీ రాజధానిలో ప్రవేశించగానే ప్రజలు అతని దర్శనం కొరకు వీధులలో బారులుదీరి నిలబడి యుండిరి. అతని సాహస గాథల గూర్చి దేశమంతటా చెప్పుకొనుచుండిరి. అఫ్జల్‌ఖాన్ మరణం, శాయిస్తాఖాన్ పరాభవం, ఆగ్రా నుంచి తప్పించుకొన్న విధానం గూర్చి ప్రజలు చెప్పుకొనుచుండిరి. అందుకే గోల్కొండ పురవీధుల్లో శివాజీ రాజోచితమైన స్వాగతం పొందాడు. ఇంటిపైకప్పుల మీదనుండి ప్రజలు అతనిపై పూల వర్షం కురిపించారు. ఘనమైన



శివాజీ గోల్కొండ కోట చారిత్రాత్మక సందర్శనం

స్వాగతాన్ని స్వీకరించి కుతుబ్‌షాహ దర్బారుకు వెళ్లాడు. కుతుబ్‌షాహ ముందుకు వచ్చి మహారాజు కోసం ప్రత్యేకంగా తయారుచేసిన సింహాసనంపై తనతో సమానంగా కూర్చుండబెట్టెను. ఈ స్వాగత సత్కారాలను గైకొని శివాజీ కర్నాటక దండయాత్రకు బయలు దేరాడు.

**జింజీని జయించుట :** శివాజీ రాజు తూర్పు తీరానికి చేరాడు. చెన్నైకి దక్షిణ దిశలో జింజీ కోట వున్నది. అది రాయగడ్ వలె పెద్దది, బలమైంది. శివాజీ దానిని ముట్టడించి స్వాధీనం పరచుకొన్నాడు. దక్షిణంలో స్వరాజ్యం యొక్క ఒక బలమైన స్థావరం తయారైంది. ఆ తర్వాత వేలూరు కోటను ముట్టడించాడు. ఎన్నో నెలలు ముట్టడించి ఉన్నప్పటికీ కోట వశం కాలేదు. అప్పుడు వేలూరు కోటకు దగ్గరలోనున్న కొండ నుండి శివాజీ ఫిరంగుల వర్షం కురిపించాడు. కోట స్వాధీనమైంది. అతడు కర్నాటకలో ఇరవై లక్షల ఆదాయం వచ్చు ప్రాంతాలను మరియు చిన్నచిన్న కోటలెన్నో జయించాడు.

**వెంకోజీ రాజును కలుసుకొనుట :** శివాజీ మహారాజ తన సవతి సోదరుడు వెంకోజీ రాజెను కలుసుకొనడానికి ఆహ్వానించాడు. అతడు అయిష్టాంగానే వచ్చాడు. అయినను మహారాజు అతనిని తగిన రీతిలో సత్కరించాడు. అతనికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. వెంకోజీ రాజును సహకారం అందించాలని కోరుతూ శివాజీ అతనిని ఒప్పించుటకు ప్రయత్నించాడు. కొన్ని రోజులు వెంకోజీ రాజె శివాజీతో కలిసియుండెను. కాని ఒకరోజు రాత్రి శివాజీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే




**శివాజీ – వెంకోజీ రాజును కలుసుకొనుట**

అతడు తంజావూరుకు వెళ్లిపోయెను. పైగా అచటి నుండి శివాజీసైన్యంపై దాడిచేశాడు. శివాజీసైనికులు వెంకోజీసైన్యాన్ని ఎదుర్కొనిరి. వెంకోజీ రాజు ఓడిపోయెను. తన సోదరుని ప్రవర్తన పట్ల శివాజీ మిక్కిలి బాధపడ్డాడు. వెంకోజీరాజుకు తన పద్ధతులను మార్చుకోమని నచ్చచెపుతూ స్నేహపూర్వక లేఖ రాశాడు. జింజీకి దక్షిణంలో నున్న కొన్ని ప్రాంతాలను అతనికి ఇచ్చాడు. అతని భార్య దీపాబాయికి కూడా చీరలు, గాజుల నిర్వహణ ఖర్చులకై కర్నాటకలో కొంత భాగాన్ని ఇచ్చాడు. శివాజీ రాజు వెంకోజీ రాజుకు రాసిన ఒక లేఖలో 'పరాయి శత్రువుల పట్ల విశ్వాసం ఉంచవద్దు. వీరోచిత మార్గాన్నీ అనుసరించు' అని తెలిపాడు.

శివాజీ విజయమంతంగా కర్నాటక దండయాత్ర ముగించుకొని రాయగడ్‌కు మరలి వచ్చాడు. కాని ఆ దండయాత్ర వల్ల అతనికి తీవ్రమైన అలసట ఉన్ననూ శివాజీ జంజీర సిద్దీని ఎదుర్కొనడానికి తన నావికాదళాన్ని పంపవలసి వచ్చింది. అప్పటికి శివాజీ మహారాజు వయస్సు యాభై సంవత్సరాలుండెను. ముప్పై–ముప్పైఐదు సంవత్సరాలు విరామం లేకుండా కష్టపడ్డాడు. అతనికి ఎప్పుడూ విశ్రాంతి దొరకలేదు.

**ప్రజా సంరక్షకుడు ఇకలేడు :** 1680 సంవత్సరం ఏప్రిల్ 3వ తేదీన తన ప్రజలందరినీ దుఃఖ సాగరంలో ముంచి శివాజీ ఈ ప్రపంచం నుండి శాశ్వతంగా వీడ్కోలు తీసుకున్నాడు. ప్రజా సంరక్షకుడు గతించి పోయాడు. తన జీవిత కాలంలో మహారాజు ఎన్నో ఘన కార్యాలను సాధించాడు. శక్తిమంతులైన శత్రువులను ఓడించి శివాజీ మహారాజు హైందవ స్వరాజ్యాన్ని స్థాపించాడు. అతడు సాధించిన ఘనకార్యాలకు సరితూగగలవాడు భారతదేశంలో లేడు. శివాజీ మహారాజు గొప్ప జాతీయ నేత అయ్యాడు.




The following foot notes are applicable : (1) © Government of India, Copyright : 2014. (2) The responsibility for the correctness of internal details rests with the publisher. (3) The territorial waters of India extend into the sea to a distance of twelve nautical miles measured from the appropriate base line. (4) The administrative headquarters of Chandigarh, Haryana and Punjab are at Chandigarh. (5) The interstate boundaries amongst Arunachal Pradesh, Assam and Meghalaya shown on this map are as interpreted from the "North-Eastern Areas (Reorganisation) Act. 1971," but have yet to be verified. (6) The external boundaries and coastlines of India agree with the Record/Master Copy certified by Survey of India. (7) The state boundaries between Uttarakhand & Uttar Pradesh, Bihar & Jharkhand and Chattisgarh & Madhya Pradesh have not been verified by the Governments concerned. (8) The spellings of names in this map, have been taken from various sources.

**1. ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదంతో పూరించండి.**

అ) వెంకోజీ రాజె దక్షిణాన వున్న ............... జాగీరు వ్యవహారాలను చూచుండెను.
(వేలూరు, తంజావూరు, బెంగళూరు)

ఆ) కుతుబ్‌షాహ రాజ్యానికి ............... రాజధానిగా ఉండెను.
(ఢిల్లీ, జింజీ, గోల్కొండ)

**2. ఒకే వాక్యంలో జవాబులు రాయండి.**

అ) శివాజీ మహారాజు వెంకోజీరాజును కలుసుకోవడానికి గల ఉద్దేశమేమి?

ఆ) శివాజీ మహారాజు వెంకోజీరాజును ఏమని కోరాడు?

ఇ) శివాజీ మహారాజు వెంకోజీ రాజుకు ఏమని లేఖ రాసెను?

**3. కారణాలు రాయండి.**

అ) శివాజీ మహారాజు దక్షిణ ప్రాంతాన్ని తన ఆధీనం లోకి తీసుకోవలెనని నిశ్చయించుకున్నాడు.

ఆ) శివాజీ మహారాజు వెంకోజీ రాజుకు స్నేహపూర్వక లేఖ పంపాడు.

**ఉపక్రమం**

శివాజీ మహారాజు మరియు వెంకోజీ రాజెల సమావేశ సంభాషణను అభినయించండి.

LTRZHC



శివాజీ మహారాజు సమాధి – రాయగడ్

# 17. పర్వతదుర్గాలు మరియు నౌకదళవ్యవస్థాపన

శివాజీ మహారాజు అనేక మంది శత్రువులను జయించి స్వరాజ్యస్థాపన చేశాడు. యుద్ధమైనా, రాజ్యపరిపాలన అయినా శివాజీ మహారాజు యొక్క వ్యవస్థాపన కౌశల్యం అన్నిరంగాల్లో కనిపిస్తుంది. ఈపాఠంలో మనం శివాజీ మహారాజు వ్యవస్థాపన కౌశల్యానికి సంబంధించిన వివరాలు తెలుసుకుంటాం.

**మీకు తెలుసా ?**

- వ్యవస్థాపన కౌశల్యం అనగానేమి ?

వ్యవస్థాపన కౌశల్యం అనగా నిర్ణయించుకొన్న లక్ష్యాన్ని సాధించటానికి చేపట్టిన పనిని క్రమబద్ధమైన పద్ధతిలో చేయడం.

శివాజీ మహారాజు యొక్క వ్యవస్థాపన కౌశల్యం, అతడు జీవితాంతం చేసిన పోరాటాల్లో ఏ విధంగా కనిపిస్తుందో, అట్లే అతని పరిపాలన అంతటిలోనూ కనిపిస్తుంది. వాటిలోని ఉదాహరణలు కొన్ని కింద ఇవ్వబడినవి.

## పర్వతదుర్గాల ఏర్పాటు

పర్వతదుర్గాలు-కోటల సహాయంతో శివాజీ మహారాజు స్వరాజ్యాన్ని సంరక్షించాడు. **'సంపూర్ణ రాజ్యానికి కోటలే కీలకం'** అనే నిర్దిష్టమైన మరియు పరిమితమైన పదాలతో 'ఆజ్ఞాపత్రం' అను శివాజీ కాలం నాటి గ్రంథంలో కోటల అనగా పర్వతదుర్గాల-కోటల యొక్క ప్రాముఖ్యత చెప్పబడింది. శివాజీ మహారాజు యవ్వనంలో సహ్యాద్రిశ్రేణులలో సంచరించాడు. సహ్యాద్రిపర్వతాలపై నిలిచిన కోటలు-దుర్గాలను అతడు చాలాసార్లు సూక్ష్మంగా పరిశీలించాడు. స్వరాజ్య సంరక్షణకోసం పర్వతదుర్గాలు చాలా ముఖ్యమని అతనికి అవగతమయింది.

శివాజీ మహారాజు వన్యదుర్గాలు, పర్వతదుర్గాలు మరియు జలదుర్గాలు అను మూడు రకాల కోటలను నిర్మించాడు. జలదుర్గాలను 'జంజిరా' అని కూడ అంటారు. అతడు హిరోజీ ఇందుల్కర్ మరియు అర్జోజీయాదవ్ వంటి మేధావుల చేతులమీదుగా రాజగడ్, ప్రతాప్‌గడ్, సింధుదుర్గ్ మొదలగు కొత్తకోటలెన్నో నిర్మించాడు. అదేవిధంగా రాయగడ్ కోటను మెరుగుపరచాడు. అంతేకాకుండ విజయదుర్గం, తోరణా, రాంగణా మొదలగు కొన్ని పాతకోటలు మరమత్తు చేయించాడు. శివాజీవద్ద సుమారు 300 కోటలు ఉండెను.

**మీకు తెలుసా ?**

- శివాజీ మహారాజు చిన్నకుమారుడు ఛత్రపతి రాజారాంమహారాజు ఆజ్ఞానుసారం రామచంద్రపంత్ ఆమాత్యుడు 'ఆజ్ఞాపత్రం' అను గ్రంథాన్ని రాసాడని భావింపబడుతుంది. ఈ గ్రంథంలో శివాజీ మహారాజుయొక్క రాజనీతి స్పష్టంగా ప్రతిబింబించు చున్నది.

**చేసి చూడండి.**

- దీపావళి సెలవుల్లో మిత్రుల సహాయంతో ఏదేని కోటనమూనాను తయారు చేయండి.
  - కోటను తయారు చేయటానికి కావలసిన వస్తువుల జాబితా తయారుచేయండి.
  - కోట కోసం స్థలాన్ని ఎంపిక చేయండి.
  - కోటపై నీరు, ఇళ్ల వ్యవస్థ ఎలా ఉండాలో ప్రణాళిక తయారుచేయండి.

**చెప్పుకోండి చూద్దాం!**

- మీ పరిసరాలలో ఉన్న కోట/గుహ పేరు చెప్పండి.
- కోటపై ఏ వస్తువులు/కట్టడాలు ఉన్నాయి ?
- ఏ రకమైన కోట ?



కోట నిర్మాణం

## కోటల నిర్వహణ

పర్వతదుర్గాల సంరక్షణకోసం మహారాజు నిర్దిష్టమైన వ్యవస్థను చేశాడు.

ప్రతి పర్వతదుర్గంపై కిల్లేదారు, సబనీస్ మరియు కార్ఖానీస్ అను అధికారులు నియమింపబడేవారు. కిల్లేదారు చేతికింద సబనీస్ మరియు కార్ఖానీస్‌లు పనిచేసేవారు.

ఈ అధికారుల పనులను కింది పట్టికద్వారా చెప్పవచ్చును.

**కిల్లేదారు (హవాల్‌దార్)**

- కోట సంరక్షణ మరియు పాలన
- సబనీస్, కార్ఖానీస్‌లను ఆజ్ఞాపించడం.
- ప్రభుత్వ దస్తావేజులు, ఉత్తర్వులు మరియు ఆదేశాలను పాటించడం.

**సబనీస్**

- కోటపై జమాఖర్చులు నమోదు చేయడం.
- కోటపై మరియు కోట కింద ప్రజలనుంచి పన్ను వసూలు చేయడం.
- ఉత్తర ప్రత్యుత్తరాలను చూచుకోవడం.

**కార్ఖానీస్**

- కోటమీద ఉండే ప్రజలకు ధాన్యం మరియు వస్తువులను సరఫరా చేయడం.
- యుద్ధ సమయంలో ఫిరంగులకు, తుపాకులకు కావలసిన మందుగుండు సామాగ్రిని ఏర్పాటు చేయడం.
- కోట మరియు కోటమీద ఉండే భవనాలను చూచుకోవడం మరియు మరమత్తులు చేయడం.

## ఫిరంగులు-మందుగుండు సామాగ్రి

శివాజీ మహారాజు కాలంలో శత్రువుల నుంచి కోటలను సంరక్షించుకోవడంకోసం చిన్న-పెద్ద ఫిరంగులు ఉపయోగింపబడేవి. ఈ ఫిరంగులు కోటల యొక్క అంచులపై మరియు బురుజులపై పెట్టబడేవి. పురందర్, భీమ్‌గడ్ వంటి కొన్నికోటలపై ఫిరంగులను తయారుచేసే కర్మాగారాలు కూడ ఉండేవి. ఇనుము, ఇత్తడి, రాగి మొదలగు లోహాలతో ఫిరంగులు తయారు చేయబడేవి. వర్షాకాలపు రోజుల్లో కోటపైనున్న ఫిరంగులు త్రుప్పుపట్టకుండా వాటికి మైనంపూత పూయబడుచుండేది. శత్రువులపై దాడిచేయటానికి ఫిరంగులలో ఇనుప, రాతి మరియు సీసపుగుండ్లను (అందులో సీసపు గోళీలు ఉంటాయి) ఉపయోగించేవారు. ఈ ఫిరంగిని పేల్చడానికి గంధకపు (ప్రేలుడు) గుండ్లు ఉపయోగింపబడేవి.

**చర్చించండి.**

- కోటపైనున్న ఫిరంగులు త్రుప్పుపట్టకుండా ఉండటానికి వాటికి మైనంలేపనం పూయబడేది.

**చెప్పుకోండి చూద్దాం.**

- శివాజీ మహారాజు యొక్క నౌకాదళంలోని ఓడల రకాలను చెప్పండి. ఉదా: గురాబ్, గలబత్, పాల్, మచవా, నావ్, హోడి
- స్వతంత్ర భారతదేశ నౌకాదళంలోని ఓడల పేర్లు తెలపండి.

## నౌకాదళం

నౌకాదళం అనగా యుద్ధనౌకల సమూహం. ఆంగ్లేయులు, పోర్చుగీసు, సిద్ధీ, డచ్‌వారివద్ద ప్రబలమైన నౌకాదళం ఉండేది. వీరిలో కొందరు సముద్రతీరంలో



నౌకాదళాన్ని వీక్షిస్తున్న శివాజీ

ఉండే గ్రామాలను దోచుకొనేవారు. అక్కడి ప్రజలను హింసించే వారు. శివాజీ మహారాజు ఈ సముద్ర శత్రువులను శాశ్వతంగా కట్టుదిట్టం చేయడానికి స్వతంత్రమైన నౌకాదళాన్ని నిర్మించాడు.

శివాజీ మహారాజు చిన్న-పెద్ద ఓడలు-నావలు తయారుచేసే కర్మాగారాలను ఏర్పాటు చేశాడు. సముద్రంలోని పాతకోటలను జయించి స్వాధీనం చేసుకున్నాడు. సువర్ణదుర్గం, విజయదుర్గం వంటి జలదుర్గాలను మరమత్తు చేశాడు. శివాజీ మాలవణ్ దగ్గర కురటే అను దీవిపై సింధుదుర్గ్ అను క్రొత్త జలదుర్గాన్ని నిర్మించాడు. అలాగే ముంబయి దగ్గర ఖాందేరీ కోటను నిర్మించాడు.

స్వరాజ్యంయొక్క నౌకాదళంలో కోళీ, భండారీ, ఆగ్రీ వంటి వివిధతీరవాసుల జాతి-మతాల సైనికులు ఉండేవారు. దౌలత్‌ఖాన్, మాయనాక్, భండారీ, లాయ్ పాటిల్, దర్యాసారంగ్, తుకోజీ ఆంగ్రే వంటి పేరుపొందిన నౌకాదళ యోధులు ఈ కాలంలోనే ప్రసిద్ధి చెందారు.

మరాఠీయుల నౌకాదళంవలన ఆంగ్లేయులు, పోర్చుగీసులు, సిద్దీలు మరియు డచ్‌ల వంటి సముద్రశత్రువులకు భయం వేయసాగింది. అందువల్ల స్వరాజ్యానికి శత్రువుల వలన కలిగే ఇబ్బంది తగ్గిపోయింది. శివాజీ మహారాజు స్వతంత్ర నౌకాదళాన్ని నెలకొల్పి దాని ఆధారంతో తన సముద్ర సరిహద్దును నిశ్చయించి, సముద్రతీరాన్ని అంటియున్న ప్రాంతంపై రాజ్యాధికారాన్ని నెలకొల్పాడు. తన సముద్రతీరాన్ని సురక్షితం చేశాడు. ఇది మధ్యయుగకాలంలోని భారతదేశంలో శివాజీ నెలకొల్పిన మొదటి నౌకాదళం. అందువలన ఛత్రపతి శివాజీని '**భారతీయ నౌకాదళ జనకుడు**' అని గౌరవించడం జరిగింది.

**శివాజీ మహారాజు యొక్క గూఢచార విభాగం :** శివాజీ మహారాజు సైనిక వ్యవస్థలో గూఢచారశాఖ ఉండేది. బహిర్జీనాయిక్ అతని గూఢచారశాఖకు ప్రముఖులుగా ఉండేవారు. మహారాజు చేసిన సూరత్‌దాడి వంటి దండయాత్రలు విజయవంతం అవటానికి ఆయన సేకరించిన ఖచ్చితమైన సమాచారం ఎంతో సహాయపడింది. శివాజీ మహారాజుగారి గూఢచారులు రహస్యంగా శత్రువుల స్థావరంలోనికి ప్రవేశించి, స్థావరంలోని ప్రతి ఒక్కసూక్ష్మాతి సూక్ష్మమైన సమాచారాన్ని సేకరించి తెచ్చేవారు. ఏదైన దాడిచేసేముందు శివాజీ మహారాజుగారు గూఢచారుల నుంచి వార్తలు తెలుసుకొనేవారు. ఆ తర్వాతే దాడి ప్రయత్నం చేసేవారు.

**గొరిల్లా యుద్ధ పద్ధతి :** శివాజీ మహారాజు యుద్ధనీతిలో గొరిల్లా యుద్ధతంత్రానికి చాల ప్రాముఖ్యత ఉండెను. గొరిల్లా యుద్ధతంత్రలో మనకు అనుకూలమైనచోట, అనుకూల సమయానికి శత్రువులపై అకస్మాత్తుగా, అనుకోకుండా దాడిచేసి శత్రువులు తేరుకునేలోపే సైన్యం సురక్షితస్థానానికి చేరుకుంటుంది. ఈ యుద్ధతంత్రాన్ని అవలంభించేటపుడు మహారాజుకు సహ్యాద్రి పర్వతశ్రేణుల్లోని దట్టమైనఅడవులు, పర్వతదుర్గాలు మరియు ప్రజల మద్దతు సహకరించాయి.



**మీకు తెలుసా ?**

- శివాజీ మహారాజు సైన్యం క్రమశిక్షణగలదిగా ఉండేది. అతని సైనికులు స్త్రీలను గౌరవించేవారు. అందువలన 'స్త్రీల రక్షణకర్త'గా శివాజీ యొక్క కీర్తి అంతట వ్యాపించింది. సైనికులు మద్యం సేవించకూడదు, ప్రజలకు కష్టం కలిగించకూడదు. ప్రజలను దోచుకోకూడదని సైనికులకు శివాజీ కట్టడిగా హెచ్చరిక చేశాడు.



**మీకు తెలుసా ?**

- శివాజీ మహారాజు యొక్క కొందరు సహాయకులు- కాన్హోజీ జేధే, వీర్ బాజీ పాసల్కర్, ఫిరంగోజీ నర్సాళా, ప్రతాపరావు గుజర్, సిధోజీ నింబాళ్కర్ మరియు సిద్ధి హిలాల్.

## అభ్యాసం

**1. చెప్పుకోండి చూద్దాం.**

(అ) కోటలు అనగా పర్వతదుర్గాల ప్రాముఖ్యతను తెలిపే గ్రంథం ......................

(ఆ) జలదుర్గాలను ఇలా కూడ అంటారు. ......................

**2. మీకు ఏమనిపిస్తుందో చెప్పండి.**

(అ) ఛత్రపతి శివాజీ మహారాజు 'భారతీయ నౌకాదళ జనకుడు' అని గౌరవింపబడ్డాడు.

(ఆ) శివాజీ మహారాజు యొక్క వ్యవస్థాపనసామర్థ్యం ఏయే రంగాలలో చూడవచ్చును?

**3. కోటల పైగల కింది అధికారుల యొక్క రెండు పనులను రాయండి.**

| | | |
|---|---|---|
| (అ) కిల్లేదారు | 1. ......... | 2. ......... |
| (ఆ) సబనీస్ | 1. ......... | 2. ......... |
| (ఇ) కార్ఖానీస్ | 1. ......... | 2. ......... |

**4. మహారాష్ట్ర బహిర్రేఖా (అవుట్ లైన్) మానచిత్రపటంలో కింది స్థలాలను చూపండి.**

(అ) సింధుదుర్గ్ కోట　　(ఆ) విజయదుర్గం

(ఇ) ముంబయి　　(ఈ) ప్రతాప్ గడ్

**5. ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క వ్యవస్థాపన కౌశల్యంలో ఏ అంశం నీకు బాగా నచ్చింది? ఆ అంశాన్ని నీ నిత్యజీవనంలో ఎలా ఉపయోగిస్తావు?**

### ఉపక్రమం

(అ) 'శివాజీ మహారాజు యొక్క ముఖాముఖి' ఏర్పాటు ఈ ముఖాముఖి నాటికను తరగతిలో ప్రదర్శించండి.

(ఆ) భారతీయ నౌకాదళంలోని యుద్ధనౌకల గురించిన వివరాలు సేకరించండి.

(ఇ) వివిధ రకాల కోటలను సందర్శించండి. కోటలయొక్క వివిధ భాగాల పేర్లను తెలుసుకోండి.

LU1VIZ

# 18. ప్రజాసంక్షేమ స్వరాజ్య నిర్వహణ



**చెప్పుకోండి చూద్దాం.**

- శివాజీ మహారాజు ఏయే రాజ్యాలతో పోరాటం చేశాడు.

శివాజీ మహారాజు ఆదిల్‌షాహి, ముఘల్, పోర్చుగీసు మరియు జంజిరేకర్ సిద్ధీ అను అన్యాయకారుల రాజ్యాలతో దీర్ఘకాలం పోరాటం చేశాడు. అందువల్ల స్వతంత్ర హైందవ స్వరాజ్యం ఏర్పడింది.

రాజ్యపరిపాలన పనులు సవ్యంగా సాగటానికి శివాజీ మహారాజు రాజ్యపరిపాలనను ఎనిమిది విభాగాలుగా విభజించాడు. అదే శివాజీ మహారాజు యొక్క అష్టప్రధానులమండలి. ప్రతి విభాగానికి ఒక ప్రముఖుణ్ణి నియమించాడు. ఆ ప్రముఖులతో ఏర్పడినదే మహారాజు యొక్క అష్ట ప్రధానుల మండలి. అష్టప్రధానుల మాధ్యమం ద్వారా నడిపించిన శివాజీ యొక్క స్వరాజ్యం వాస్తవానికి ప్రజా సంక్షేమ రాజ్యంగా ఉండేది. ఈ అష్టప్రధానుల మరియు ఇతర ముఖ్యమైన అధికారులను వారి అర్హత మరియు యోగ్యతనుబట్టి మహారాజు స్వయంగా నియమించేవాడు. వారి పనితీరుపై మహారాజు దృష్టిపెట్టేవాడు.



**మీకు తెలుసా?**

ప్రజాసంక్షేమ రాజ్యంలో ప్రజలకు కావలసిన ఆహారం, నివాసం, దుస్తులు (కూడు, గుడ్డ, నీడ) ఈ జీవనావశ్యక అవసరాలు తీరుతాయి. స్త్రీలు గౌరవింపబడతారు. సామాన్య ప్రజలు మరియు రైతులు మోసానికిగురికారు. ఎవరికి అన్యాయం జరగదు. ప్రజలకు తొందరగా న్యాయం లభిస్తుంది. వ్యవసాయం మరియు పరిశ్రమల అభివృద్ధి జరుగుతుంది. జానపద కళలు వెల్లివిరుస్తాయి. ప్రజలు సుఖశాంతులతో ఉంటారు.

ఛత్రపతి శివాజీ మహారాజు నిర్మించిన స్వరాజ్యంలో అతని ప్రజలు సుఖశాంతులతో ఉండసాగిరి. అందువలన మహారాష్ట్రలోని ప్రజల్లో ప్రగాఢ ఆత్మవిశ్వాసం, స్వాభిమానం మరియు దేశభక్తి కనిపించసాగింది.

**అష్ట ప్రధానుల మండలి**

| | ప్రధాని పేరు | పదవి | పనులు |
|---|---|---|---|
| 1. | మోరో త్రింబక్ పింగళే | ప్రధాని | రాజ్య పరిపాలన పనులు చూచుట |
| 2. | రామచంద్ర నీళకంఠ ముజుమ్‌దార్ | అమాత్యుడు | రాజ్యపు ఆదాయ వ్యయాలు సరిచూచుట |
| 3. | హంబీర్ రావు మోహితే | సేనాపతి | సైన్యానికి నేతృత్వం వహించుట |
| 4. | మోరేశ్వర్ పండితరావు | పండితరావు | మతసంబంధ పనులు చూచుట |
| 5. | నిరాజీ రావ్‌జీ | న్యాయాధీశుడు | న్యాయాన్ని అందించుట |
| 6. | అన్నాజీ దత్తో | కార్యదర్శి | ప్రభుత్వ ఆజ్ఞాపత్రాలను పంపుట |
| 7. | దత్తాజీ త్రింబక్ వాకనీస్ | మంత్రి | ఉత్తర ప్రత్యుత్తర వ్యవహారాలు జరుపుట |
| 8. | రామచంద్ర త్రింబక్ డబీర్ | సుమంతుడు | ఇతర రాజ్యాలతో సంబంధాలు నిర్వహించుట. |



రైతులకు ఎద్దులజతను మరియు ఇతర జీవనావశ్యక వస్తువులు ఇస్తున్న శివాజీ

**చేసి చూడండి.**


- పాఠ్యపుస్తకంలోని 'ఆజ్ఞాపత్రంలోని పర్యావరణ రక్షణ' అను శీర్షికను పెద్ద అక్షరాలలో రాసి దానికి సంబంధించిన పట్టిక తయారు చేయండి. దానిని తరగతిలో సామూహికంగా పఠించండి.

## పర్యావరణ సంరక్షణ

ఆయా ప్రాంతాలలోనైసర్గికంగా ప్రకృతి సృష్టించిన నేల, గాలి, వర్షం, నదులు సముద్రం, సెలయేళ్ళు, అడవులు, చిన్న-పెద్ద జంతువులు, పక్షులు, సూర్యరశ్మి, చంద్రుని వెన్నెల మొదలగు అంశాలన్నిటిద్వారా మానవుని చుట్టుప్రక్కల తయారగు పరిసరాలనే 'నైసర్గిక పర్యావరణం' అని అంటారు. ఈ పర్యావరణాన్ని అవసరమైనమేరకు ఉపయోగించుకోవడం వలన మానవునికి మేలు జరుగుతుంది.

పర్యావరణంలో ఈ వివిధ అంశాలు అంతం కాకుండా ఉండటానికి శివాజీ మహారాజు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తుంది.

మన రాజ్యంలోని అడవులు ప్రజల ద్వార నష్టపోకుండా ఉండటానికి శివాజీ మహారాజు చాలా శ్రద్ధ వహించాడు. ఉదా: నౌకాదళంకోసం చిన్న-పెద్ద పడవలు, ఓడలు, తెడ్లు, చెట్లబోదెలతో స్తంభాలు మొదలగునవి తయారు చేయవలసి వస్తుంది. దానికోసం కలప అవసరమవుతుంది. కావున కేవలం టేకు చెట్లనే నరకాలి. టేకుకలప అధికంగా కావలసి వస్తే విదేశాల నుంచి ఖరీదుచేయాలి. కాని ఎట్టి పరిస్థితులలోను మామిడి, పనస మొదలగు వృక్షాలను నరక వద్దు. పెద్ద వృక్షాలు ఒకటి రెండు సంవత్సరాలలో పెరిగి పెద్దవికావు. ప్రజలు ఈ చెట్లను తమ పిల్లలమాదిరిగా కాపాడుతూ పెంచుతారు. వాటిని నరికి, ప్రజలకు దుఃఖం కలిగించకూడదు. పూర్తిగా ఎండిపోయి, మోడువారిన చెట్టునుమాత్రమే ఆ చెట్టు యజమానికి రొక్కము ఇచ్చి



పర్యావరణ సంరక్షణ

అతన్ని తృప్తిపరచిన తరువాతనే దానిని నరకవచ్చు. ఇటువంటి అనేక ఆజ్ఞలు శివాజీ ఇచ్చాడని ఆజ్ఞాపత్రం ద్వార తెలుస్తుంది.



**ఎల్లప్పుడు గుర్తుంచుకోండి.**

పర్యావరణ సంరక్షణ ప్రాముఖ్యతను నచ్చజెప్పటానికి మరియు పర్యావరణం క్షీణించకుండా ఆపటానికి జూన్ 5వ తేదిని ప్రతిసంవత్సరం 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'గా జరుపుకుంటారు.

### జల నిర్వహణ

శివాజీ స్వరాజ్యంలోని ప్రతిగ్రామంలో అడ్డుకట్టలుకట్టి ప్రజలకు త్రాగునీరు అందించాడు. అటులనే ఈ అడ్డుకట్టలకు కాలువలు తీసి సాగునీరుకూడా అందించాడు. అందువలన స్వరాజ్యం యొక్క ఆదాయం పెరిగింది. స్వరాజ్యంలోని ప్రజలకు కరువు యొక్క తీవ్రత ఎప్పుడు అనుభవంలోకి రాలేదు. శివాజీ కాలంలో కోటలపై నివసించే ప్రజలసంఖ్య అధికంగా ఉండేది. అక్కడ నీటి వ్యవస్థను ఏర్పాటు చేయటానికి శివాజీ జాగ్రత్త తీసుకొనేవాడు. కోట నిర్మించటానికి ముందు ఆ స్థలంలో తగినంత నీరు ఉందో లేదో పరిశీలించేవారు. ఏదేనిస్థలంలో నీరు లేకపోయినట్లయితే అక్కడ వర్షాకాలం రాకముందే చెరువులు మరియు గుంటలు నిర్మించి అందులో వర్షపునీటిని నిలువ చేసేవారు.

ఇలా నిలువచేసిన నీరు పొదుపుగా ఉపయోగింపబడేది. ఇటువంటి జలవ్యవస్థ వలన కోటలపైగల ప్రజలకు మరియు స్వరాజ్యంలోని ప్రజలకు కరువుకాలంలో నీటి ఎద్దడి అనుభవంలోనికి రాలేదు.



శివాజీ మహారాజు అడ్డుకట్టలు కట్టి వ్యవసాయం, తాగునీటి వ్యవస్థ గావించెను.

**చెప్పుకోండి చూద్దాం.**

- నీటి వాడుకను పొదుపుగా ఎందుకు చేయాలి ?
- మీ గ్రామంలో /పరిసరంలో ఏ ఆనకట్ట, చెఱువు వుంది ?
- జల వ్యవస్థాపన అనగానేమి ?
- జలవ్యవస్థాపన విషయంలో ప్రభుత్వ ప్రణాళికలేవి ?

**మీకు తెలుసా ?**

- రాష్ట్రాన్ని శాశ్వతంగా కరువు నుంచి విముక్తి చేయటానికి ప్రభుత్వం 'జలయుక్త వ్యవసాయ భూములు' అను పథకాన్ని ప్రారంభించింది.

## కరువు నివారణ

కరువు-కాటకాల సమయంలో శివాజీ మహారాజు రైతులకు వివిధ సౌకర్యాలను కల్పించాడు. ప్రజలకు పన్నులను రద్దు చేశాడు. అందువల్ల స్వరాజ్యంలో కరువుతీవ్రత తగ్గిపోయింది. ఏదేని సంవత్సరం స్వరాజ్యంలో కరువు వచ్చినపుడు శివాజీ మహారాజు ప్రభుత్వ ధాన్యాగారంలో నిల్వచేసిన ధాన్యాన్ని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేవాడు. అదే విధంగా కరువు వచ్చిన సంవత్సరం శివాజీ మహారాజు వివిధ కోటలపై మరమ్మత్తులపని ప్రారంభించేవాడు. అదేవిధంగా అడ్డుకట్టలు, కాలువలు, ఆనకట్టలపని ప్రారంభించేవాడు. ఈ పనులవల్ల రైతులతోబాటు కార్మికులకు అనగా చేతివృత్తులవారికి పనిదొరికేది. పని దొరకడంవల్ల స్వరాజ్యంలోని ప్రజలకు కరువు తీవ్రత ఎప్పుడు తెలిసేదికాదు.

రైతులు అభివృద్ధి చెందడంవల్ల నిన్న ఎవరికైతే కాళ్ళకు చెప్పులులేవో, వారు చెప్పులు కొన్నారు. శరీరంపై బట్టలులేనివారు బట్టలు కొన్నారు. దానివల్ల నేత కార్మికులకు పని లభించింది. నివసించుటకు ఇల్లులేని

వారికి ఇల్లు కట్టుకొనే స్తోమత ఏర్పడింది. వీటివల్ల ఇళ్ళు కట్టే మేస్త్రీలకు, వడ్రంగులకు, కమ్మరివారికి మరియు ఇటుకలు తయారు చేసే కుమ్మరివారికి పని దొరికింది. ఈ విధంగా స్వరాజ్యంలో రైతులతోబాటు చేతి వృత్తుల వారు మరియు గ్రామసేవకులు సుఖసమృద్ధులతో జీవించారు.



**చెప్పుకోండి చూద్దాం!**

- మీ గ్రామంలోని/పరిసరాలలోని వ్యాపారకేంద్రం పేరు చెప్పండి.
- వ్యాపారకేంద్రానికి ఆ పేరు ఎందుకు వచ్చిందో వివరించండి.

## సముద్రవ్యాపారం మరియు ఇతర వ్యాపారకేంద్రాలు

స్వరాజ్యం యొక్క రక్షణ బాగుగా చేయగలగాలని స్వరాజ్యాన్ని అంటియున్న సముద్రంపై తన అధికారం ఉండవలెననే ఉద్దేశ్యంతో శివాజీ తనదైన స్వతంత్ర నౌకాదళాన్ని ఏర్పాటు చేశాడు. అక్కడితో ఆగకుండ స్వరాజ్యంలోని వ్యాపారాన్ని పెంచడానికి అతడు వస్తువులు రవాణాచేయగల ప్రత్యేకమైన ఓడలు నిర్మించాడు. రాజాపూర్ వంటి వ్యాపార ఓడరేవులు నిర్మించాడు. అదే విధంగా రాయగడ్‌పై ప్రత్యేకమైన వ్యాపారకేంద్రం నెలకొల్పాడు. పుణెప్రక్కన గల ఖేడ్‌శివాపూర్ అను వేరొక వ్యాపారకేంద్రం ప్రారంభించాడు. పెద్దగ్రామంలో మరియు మార్గంపైగల గ్రామంలో వ్యాపారకేంద్రాలను నిర్మించాడు. వీరమాత జీజాబాయి ఆజ్ఞప్రకారం పుణె సమీపంలోని పాషాణ్ గ్రామంలో ఒక క్రొత్త వ్యాపార కేంద్రం (బజారు) తయారుచేయబడింది. దానిని 'జిజాపూర్' అని పిలుస్తారు.

స్వరాజ్యంలోని వ్యాపారం అభివృద్ధిచెందాలని శివాజీ బయటిదేశాల నుంచి వచ్చే వస్తువులపై అధికపన్ను విధించాడు. పోర్చుగీసు సరిహద్దుల్లో తయారయ్యే ఉప్పుపై అతడు అధికపన్ను విధించాడు. అందువలన ఆ ఉప్పు యొక్క ధర పెరిగింది. స్వరాజ్యంలో తయారయ్యే ఉప్పుపై పన్నుతగ్గించాడు. అందువల్ల ప్రజలకు స్వరాజ్యంలోని ఉప్పు స్వల్పధరకు చౌకగా లభించసాగింది. అనగా స్వరాజ్యంలోని ఉప్పువ్యాపారం వృద్ధి చెందింది. అందువలన స్థానిక వ్యాపారానికి ప్రోత్సాహంలభించింది.

స్వరాజ్యంలోని వ్యాపారం – పరిశ్రమలు అభివృద్ధి చెందటానికి శివాజీ ప్రయత్నించేవాడు. తన ప్రజలు వ్యాపారులద్వార ఏ విధంగానూ మోసపోకూడదని అతడు స్వయంగా శ్రద్ధ చూపేవాడు. కొంకణ్‌లో కొబ్బరి, వక్కలు (పోకల) వ్యాపారంలో ప్రజలు మోసపోతున్న విషయం తెలియగానే శివాజీ అక్కడి సుబేదారును హెచ్చరించాడు.

## స్త్రీలను గౌరవించుట

యుద్ధకాలంలో శత్రుపక్షంలోని స్త్రీలు లేక పిల్లలకు ఎలాంటి హాని చేయకూడదు. వారితో చాలా మర్యాదగా ప్రవర్తించాలని శివాజీ మహారాజు ఆజ్ఞాపించాడు. అతడు స్వయంగా ఎన్నోసార్లు తన ఆదర్శప్రవర్తనతో స్త్రీలతో మర్యాదగా ఎలా మసలు కోవాలో చూపినట్లు తెలియవస్తుంది.

కర్ణాటకలోని బెళవడి వద్ద కోటనుజయించటానికి మరాఠీ సైన్యం వెళ్ళింది. అక్కడి కోటను రక్షించుకోడానికి మల్లమ్మదేసాయి అను వీరవనిత గొప్ప పోరాటం చేసింది. ఆమె వీరత్వం గురించి శివాజీకి తెలిసింది. అప్పుడు అతడు మల్లమ్మను తన చెల్లెలుగా భావించి ఆమె కోటను మరియు గ్రామాలను గౌరవపూర్వకంగా ఆమెకు తిరిగి ఇచ్చివేశాడు. ఆమెకు 'సావిత్రి' అనే బిరుదును ఇచ్చాడు.

## స్వచ్ఛత గురించి శ్రద్ధ

ఇళ్ళు మరియు సార్వజనిక స్థలాలు మరింత స్వచ్ఛంగా ఎలా ఉంచవచ్చుననే విషయం గురించి శివాజీకాలంలో పరిష్కార ప్రణాళికలను చేసినట్లు



బెళవడి మల్లమ్మ దేసాయిని సన్మానిస్తున్న శివాజీ

తెలియవస్తుంది. ఇంటిచుట్టూ వావిలి (నిర్గుడి) చెట్లతో కంచెవేసి ఇంట్లోకి ఎలుకలు, తేళ్ళు, పురుగులు, చీమలు వంటి ప్రాణులు రాకుండా జాగ్రత్త తీసుకొండి. అదే విధంగా పొగవేసి ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే జీవులను అంతంచేయండి అని కూడా శివాజీ మహారాజు ఆజ్ఞాపించినట్లు కనిపిస్తుంది.

కోటపై గల వ్యాపార కేంద్రాల్లో, రోడ్లపై చెత్తచెదారం లేకుండా చూచుకోవాలని హెచ్చరిక చేసినట్లు తెలియవస్తుంది. ఇంతచేసినా కూడ అక్కడక్కడ చెత్తచెదారం పడి ఉన్నట్లయితే దానిని కోట క్రిందకు విసిరి వేయకూడదు. ఆ చెత్తను అక్కడే కాల్చివేయండి. దాని నుండి లభించిన బూడిదను పెరట్లోని కూరగాయల మొక్కలకు ఎరువుగావాడండి అని వివిధ సూచనలు ఇచ్చినట్లుగా తెలుస్తుంది.

కోటలనిర్మాణం, ఫిరంగులు, మందు గుండ్లు, నౌకాదళం, పర్యావరణ సంరక్షణ, జల నిర్వహణ, సముద్రవ్యాపారం మరియు వ్యాపారకేంద్రాలు, స్వచ్ఛత గురించిన శ్రద్ధ ఈ విషయాలలో శివాజీ చేసిన నిర్వహణ నేటికి మార్గదర్శకంగా నిలిచింది.

## హైందవ స్వరాజ్యం

హైందవ స్వరాజ్యం శివాజీ యొక్క స్వప్నం. హైందవులు అంటే (హిందూస్థాన్) హిందూదేశంలో నివసించు వారు ; వారు ఏ మతస్థులయినను, ఏ జాతివారైనను కావచ్చు. వారి రాజ్యమే హైందవ స్వరాజ్యం.

## ఉదార మతవైఖరి

శివాజీ మహారాజు మత వైఖరి ఉదారమైనది. దాడి చేస్తున్నప్పుడు శివాజీ మసీదులను నష్టపరచలేదు. ఏదేని కుర్ఆన్ పవిత్ర గ్రంథం దొరికినపుడు దానిని భక్తి పూర్వకంగా, గౌరవంగా ముస్లింలకు అందజేశాడు. ముస్లింలను ఏనాడు ద్వేషించలేదు. ఎవరైనా మతాన్ని

మార్చుకొని, తర్వాత వారికి తిరిగి తమ మతంలోకి రావాలని అనిపించినపుడు వారిని దూరం చేసుకోకుండా ఆదరించేవాడు. శివాజీ మహారాజు బావమరిది బజాజీ నాయిక్ నింబాల్కర్, బీజాపూర్ ఆదిల్‌షాహకొలువులో ఉద్యోగం చేసేవాడు. అతనిని ఆదిల్‌షాహ తన మతాన్ని స్వీకరించేట్లు చేశాడు. బజాజీ బీజాపూర్‌లో ఉండసాగాడు. అతనికి ఏ కొరతలేకుండెను. కాని అతడు తన మతాన్ని మార్చుకున్నందుకు దుఃఖపడుతుండేడు. అతనికి బాధ అనిపించింది. అందువల్ల అతడు స్వమతంలోకి మారడానికి నిర్ణయించుకొన్నాడు. అప్పుడు శివాజీ అతన్ని స్వమతంలోకి ఆహ్వానించాడు. నేతాజీ పాల్కర్ మతం మారాడు. కానీ తర్వాత అతనికి స్వమతం లోనికి రావాలనే కోరిక కలిగింది. అప్పుడు శివాజీ అతన్ని కూడా స్వమతంలోకి ఆహ్వానించాడు.

**మీకు తెలుసా?**

● శివాజీ మహారాజు సాధు-సజ్జనులను చాల గౌరవించేవాడు. అతనికి దేవాలయాలంటే ఇష్టం. మసీదులను కూడ కాపాడాడు. అతనికి భగవద్గీత పూజనీయమైనది. కుర్‌ఆన్ గ్రంథాన్ని గౌరవించాడు. క్రైస్తవప్రజల ప్రార్థనామందిరాలను గౌరవించేవాడు. శివాజీ పండితులను గౌరవించేవాడు. పరమానందుడు, గాగాభట్టు, ధుండీరాజ్, భూషణ్ మొదలగు పండితులను అతడు సత్కరించాడు. అటులనే భక్త తుకారాం, సమర్థ రామదాసు, బాబాయాకుత్, మౌనీబాబాలను కూడా చాల గౌరవించాడు.



శివాజీ మహారాజు స్మరణీయ రూపం

**శివాజీ మహారాజు స్మరణీయ రూపం :** గాఢాంధకారంలో మన దిశను నిర్ణయించుకొని మార్గాన్ని కనుగొనటం, విషమ పరిస్థితులలోను వెనుకంజ వేయక దానిని సాధించి ముందుకు సాగడం, శక్తివంతులైన శత్రువులతో తనకున్న కొద్దిపాటి బలగం తోనే పోరాడుతూ, తన సామర్థ్యాన్ని పెంచుకుంటు పోవడం సహకారులను ఉత్సాహపరచి, శత్రువులను మోసగించి చివరకు విజయాన్ని సాధించటం, ఈ గుణాలన్నీ శివాజీ మహారాజులో వుండేవి.

శివాజీ ఒక ఆదర్శపుత్రుడు, దక్షుడైన నాయకుడు, నిపుణుడైన వ్యవస్థాపకుడు, ప్రజాసంక్షేమ పరిపాలకుడు, సుసజ్జితుడైన యుద్ధవీరుడు, దుష్టులకు కాలుడు, శిష్టులకు రక్షకుడు మరియు ఒక నూతన యుగకర్త, ఈ విధంగా శివాజీ మహారాజు యొక్క వ్యక్తిత్వపు తేజోవంతమైన కోణాలు ఎన్నో ఉన్నాయి. ఇదంతా గమనిస్తే మరలమరల అనిపిస్తుంది.

**'శివరాయుని రూపాన్ని స్మరించాలి!**
**శివరాయుని ప్రతాపాన్ని స్మరించాలి!!**
**శివరాయుని స్మరించాలి విశ్వమంత!!!**

## అభ్యాసం

**1. చెప్పుకోండి చూద్దాం!**

(అ) స్వతంత్రమైన హైందవ స్వరాజ్యం నిర్మాణమైంది.

(ఆ) స్వరాజ్యంలోని ప్రజలకు కరువుతీవ్రత ఎప్పుడు కూడ అనుభవంలోనికి రాలేదు.

(ఇ) శివాజీ మల్లమ్మ దేసాయికి ఇచ్చిన బిరుదు.

**2. ఖాళీస్థలంలో సరైన పదం రాసి పట్టికను పూర్తి చేయండి.**

**3. చర్చించండి**

పర్యావరణంలోని వివిధ అంశాలు అంతరించి పోకుండా శివాజీ ఏ విధమైన జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తుంది. నీవు పర్యావరణసంరక్షణ కొరకు ఏమేమి చేయగలవు?

**4. చదవండి మరియు మీ మాటల్లో వివరించండి.**

**'జల వ్యవస్థాపన'** ఈ విషయం గురించిన సమాచారం చదవండి. ఈ విషయాన్ని మీ సొంత మాటలలో వివరించండి.

| | ప్రధాని పేరు | పదవి | పని |
|---|---|---|---|
| 1. | మోరో త్రింబక్ పింగళే | ............ | రాజ్య పరిపాలన పనులు చూచుట |
| 2. | ......................... | అమాత్యుడు | ఆదాయ వ్యయాలు చూచుట |
| 3. | హంబీర్‌రావు మోహితే | సేనాపతి | ......................... |
| 4. | మోరేశ్వర్ పండితరావు | ............ | మత సంబంధ పనులు చూచుట |
| 5. | ......................... | న్యాయాధీశుడు | ......................... |
| 6. | అన్నాజీ దత్తో | ............ | ......................... |
| 7. | ......................... | ............ | ఉత్తర ప్రత్యుత్తర వ్యవహారాలు జరుపుట |
| 8. | రామచంద్ర త్రింబక్ డబీర్ | సుమంత్ | ......................... |

**ఉపక్రమం**

(అ) మీ తరగతి అధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో అంగడి ఏర్పాటు చేయండి. వివిధ వస్తువులు మరియు వాటి ధరలపట్టిక తయారు చేయండి. దీనికోసం పరిసరాలలోని (వర్తక) వ్యాపార కేంద్రాన్ని సందర్శించండి.


(ఆ) మీ పాఠశాల పరిసరాలలో నీవు ఏ మొక్కలను నాటావు, వాటిని ఎలా పెంచుతావో చెప్పుము.

# 'ఆజ్ఞా పత్రంలోని' పర్యావరణ రక్షణ


రామచంద్ర పంత్ అమాత్యులు 'ఆజ్ఞా పత్రం' (ఉత్తర్వు) వ్రాశారు. ఇందులో శివాజీ మహారాజు గారి విధానాలు ప్రతిబింబిస్తున్నాయి. కింది పరిచ్ఛేదం ద్వారా పర్యావరణం గురించిన మహారాజు గారి యొక్క దృక్పథం స్పష్టమవుతుంది.

"నావికాదళానికి బల్లపరుపు చెక్కలు, పొడవైన గుంజలు, తెరచాప స్తంభం మొదలగు వాటికి బలిష్టమైన కలప కావాల్సి ఉంటుంది. మన రాజ్యంలోని అరణ్యాలలో టేకు లాంటి వృక్షాలున్నాయి. వాటిలో తగిన వాటిని, అధికారులకు పత్రాన్నిరాసి అధికారుల అనుమతితో నరికి తీసుకు పోవాలి. ఇంకా అవసరమైతే వాటిని ఇతర రాజ్యాల నుండి ఖరీదు చేసి తీసుకురావాలి. మనరాజ్యంలోని మామిడి, పనస మొదలగు చెట్ల కలప కూడా నావికాదళానికి ఉపయోగకరమైనదే కానీ, వాటిని ముట్టుకోనీయ వద్దు. ఈ చెట్లు సంవత్సరానికో, రెండేళ్ళకో పెరిగేవికావు. ప్రజలు ఈ మొక్కలు నాటి వాటిని స్వంత బిడ్డలలాగా చాలా కాలం పాటు పెంచి పోషిస్తారు. అలాంటి చెట్లను నరికితే వారి దుఃఖానికి హద్దులుండునా? ఒకరికి దుఃఖాన్ని కలిగించే కార్యాన్ని ఎవరైతే చేస్తారో, ఆ కార్యం చేసిన వారు అనతి కాలంలోనే నశించిపోతారు. ముఖ్యంగా రాజు ప్రజా పీడన దోషాన్ని మూటగట్టుకోవాలి. ఈ వృక్షాలే గనక లేనట్లయితే ఎంతో హాని గూడా జరుగుతుంది. అందుకని ఇలా ఎప్పుడు జరగకుండా చూడండి. ఒకవేళ ఏదైనా చెట్టు మోడువారి, పనికి రాకుండా పోయినప్పుడు ఆ చెట్టు యజమానిని ఒప్పించి, తగిన ద్రవ్యాన్నిచ్చి వారిని సంతోషపరిచే నరికి తీసుకురావాలి..."


రాజగడ్‌కోట



జింజీకోట పై భాగం

జింజీకోట ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఉంది. ఛత్రపతి శివాజీ మహారాజు దక్షిణాన దండయాత్ర సమయంలో దాన్ని జయించెను. ఈ కోట వాస్తవంగా దృఢంగా ఉండెను. అయినప్పటికి మహారాజు ముందున్న కోట గోడలను కూల్చివేసి కొత్త గోడలను మరియు బురుజును నిర్మించి ఇంకా దృఢంగా చేసెను. కోటలను కఠినతరంగా ఎలా తయారుచేయాలనే శిక్షణ శహాజీరాజు బాల్యంలోనే ఇచ్చాడు. శివాజీ మహారాజు ఆ జ్ఞానాన్ని ఈ సమయంలో ఉపయోగించాడనేది స్పష్టమగుతుంది. తర్వాత రాజారాం మహారాజు కూడా ఈ కోట పైనే తన రాజధానిని స్థాపించెను. అతడు ఈ కోటపై నుండగా మొఘలులు దీన్ని ముట్టడించారు. కానీ రాజారాం మహారాజు ఈ ముట్టడి నుండి సుమారు ఏడు సంవత్సరాల వరకు పోరాడెను. శివాజీ మహారాజు దూరదృష్టితో ఈ కోటను అధిక దుర్భేద్యంగా తయారు చేసినందువల్లే రాజారాం మహారాజు ఇన్ని సంవత్సరాలు ఆ కోటపై సురక్షితంగా ఉండగలిగెను.





భవానీదేవి – ప్రతాప్‌గడ్

# छत्रपती शिवाजी महाराज स्मृतिग्रंथ




- सामान्य रयतेच्या कल्याणासाठी स्थापन केलेल्या स्वराज्य स्थापनेची कथा उलगडणारे पुस्तक.
- छत्रपती शिवाजी महाराजांच्या उत्तुंग कार्य व त्यामागची तेवढीच उत्तुंग व उदात्त भूमिका वाचकांसमोर आणणारे प्रेरणादायी वाचन साहित्य.
- इतिहास वाचनासाठी पूरक असे संदर्भ पुस्तक.







- इतिहास वाचनासाठी पूरक अशी संदर्भ पुस्तके.
- निवडक लेखक, इतिहासकारांचे प्रेरणादायी लेख.

**पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेतस्थळावर भेट द्या.**

***साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.***

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे - ☎ २५६५९४६५, कोल्हापूर- ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) - ☎ २८७७१८४२, पनवेल - ☎ २७४६२६४६५, नाशिक - ☎ २३९१५११, औरंगाबाद - ☎ २३३२१७१, नागपूर - ☎ २५४७७१६/२५२३०७८, लातूर - ☎ २२०९३०, अमरावती - ☎ २५३०९६५



శత్రుస్థావరాలను తీసివేసి మన స్థావరాలను ఏర్పాటు చేయాలని, ముర్‌గూడ్ పరగణా (జిల్లా - కోల్హాపూర్) దేసాయి రుద్రప్పనాయిక్ గారికి డిసెంబరు 11వ తేదీ 1676 రోజున శివాజీ మహారాజు గారు మోడి లిపిలో పంపించిన పత్రం.

మహారాష్ట్ర రాష్ట్ర పాఠపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె.

परिसर अभ्यास भाग - २ इ. ४ थी (तेलगु माध्यम)

₹ 36.00